
సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4+16+40 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 6.00



'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు'



పేదరికం వెక్కిరిస్తున్నా..
దృష్టిలోపం వేధిస్తున్నా..



- చెస్ పోటీల్లో విజయాలు సాధిస్తున్న ముఠా కూలీ
- చూపు సరిగా లేకున్నా అతని ఎత్తులకు ప్రత్యర్థులు చిత్తు
- పగలు కూలి పనులు.. రాత్రి పూట చదరంగం సాధన
- వరల్డ్ బ్లైండ్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక
- ప్రభుత్వ ప్రోత్సాహాన్ని ఆశిస్తున్న పేద క్రీడాకారుడు

చెస్ ప్రాక్టీస్ చేస్తున్న వెంకటరెడ్డి



ముఠా కూలీగా ...

సాక్షి, గుంటూరు

ఆ యువకుడికి చదువు లేదు.. రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితి.. కంటి చూపు కూడా అంతంత మాత్రమే.. ఆదరించేవారు.. ప్రోత్సహించేవారు లేరు. కానీ అపార ప్రతిభ, పట్టుదలతో చదరంగం (చెస్)లో అసమాన విజయాలు సాధిస్తున్నాడు. అడుగడుగునా ప్రతిబంధకాలు ఎదురవుతున్నప్పటికీ ఆత్మవిశ్వాసంతో, ధైర్యంగా ముందుకు సాగుతున్నాడు. అతడే శాగం వెంకటరెడ్డి.

75 శాతం దృష్టి లోపంతో జన్మించినా..

గుంటూరు జిల్లా గురజాల మండలంలోని జంగమహేశ్వరపురం గ్రామానికి చెందిన పేద కూలీ శాగం నారాయణరెడ్డి కుమారుడైన వెంకటరెడ్డి 80 శాతం దృష్టి లోపంతో జన్మించాడు. వెంకటరెడ్డి ఓ ముఠా కూలీ. అతడు రాష్ట్రస్థాయి చదరంగం క్రీడాకారుడంటే ఎవరూ నమ్మలేరు. చిన్నతనంలోనే చదరంగంపై మక్కువ పెంచుకున్న వెంకటరెడ్డి ఆడేవారి వద్ద నిలబడి ఆటను చూస్తూ ఉండిపోయేవాడు. అలా క్రమేణా ఆట నేర్చుకున్నాడు. పేద కుటుంబం కావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు కూలి పనులు చేస్తూ తల్లిదండ్రులకు సహాయపడుతున్నాడు. రాత్రి పూట గురజాలలోని వీఎంఏఎస్ క్లబ్‌లో చదరంగం సాధన చేస్తున్నాడు.



చెన్నైలో జరిగిన సౌత్‌జోన్ చాంపియన్‌షిప్ (విజువల్లీ చాలెంజ్డ్)లో మొదటి స్థానంలో నిలిచి మొమెంటో అందుకుంటున్న వెంకటరెడ్డి

గల్లీ స్థాయి నుంచి జాతీయ స్థాయికి..

గుంటూరు ఎల్‌వీఆర్ క్లబ్‌లో 2005, నవంబర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి చదరంగం పోటీల్లో నాలుగో స్థానంలో నిలిచి నిర్వాహకులను అబ్బురపరిచాడు. చదరంగంలో ప్రావీణ్యం ఉన్నవారిని సైతం ఓడించి పలువురి మన్ననలు పొందాడు. 2012లో వరంగల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో మూడో స్థానంలో, 2013 జూలైలో చెన్నైలో జరిగిన జాతీయస్థాయి చెస్ టోర్నమెంట్‌లో 12వ స్థానంలో నిలిచాడు. 2014 నవంబర్‌లో కన్యాకుమారిలో జరిగిన సౌత్‌జోన్ అంధ చదరంగ క్రీడాకారుల సెలక్షన్స్‌లో రెండో బహుమతి సాధించి నేషనల్ -బి జట్టుకు ఎంపికయ్యాడు. 2017 నవంబర్‌లో జరిగిన సౌత్‌జోన్ చాంపియన్‌షిప్ (విజువల్లీ చాలెంజ్డ్)లో ప్రథమ స్థానం దక్కించుకున్నాడు. 2017 డిసెంబర్‌లో హరియాణాలో జరిగిన నేషనల్–బి చాంపియన్‌షిప్ (విజువల్లీ చాలెంజ్డ్) పోటీల్లో 7వ స్థానంలో నిలిచాడు. త్వరలో బల్గేరియాలో జరిగే వరల్డ్ బ్లైండ్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికై విజయమే లక్ష్యంగా కృషి చేస్తున్నాడు. కాగా, సౌత్‌జోన్ పరిధిలోని ఐదు రాష్ట్రాల్లో వెంకటరెడ్డి టాప్ ర్యాంక్‌లో ఉండడం విశేషం.

మట్టిలో మాణిక్యం

గ్రామీణ నిరుపేద కుటుంబంలో జన్మించి చదరంగంలో అసమాన ప్రతిభాపాటవాలు చూపుతున్న వెంకటరెడ్డి మట్టిలో మాణిక్యమని అందరూ ప్రశంసలు కురిపిస్తున్నారు. కనీసం కోచ్ కూడా లేకుండా, దృష్టి లోపాన్ని సైతం అధిగమించి విజయాలు సాధిస్తుండటం చూసి చదరంగ శిక్షకులు సైతం ఆశ్చర్యపోతున్నారు. చెస్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకుని దేశానికి మంచి పేరు తీసుకొస్తానని వెంకటరెడ్డి చెబుతున్నాడు. ఇతర రాష్ట్రాల్లో చెస్ పోటీలకు ఆహ్వానం అందుతున్నా పేదరికం కారణంగా వెళ్లలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. రాష్ట్ర చెస్ అకాడమీ, ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరుతున్నాడు. ఇలాంటి ప్రతిభావంతులను గుర్తించి ప్రభుత్వం వారికి ఉచితంగా శిక్షణ ఇప్పించి ప్రోత్సాహాన్నందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని క్రీడా ప్రేమికులు అభిప్రాయపడుతున్నారు.

మిఠాయిలు దండిగా
మనకే ముందుగా!

పరేడ్ గ్రౌండ్స్‌లో నోరూరిస్తున్న అంతర్జాతీయ స్వీట్ ఫెస్టివల్

- మిఠాయిల పండుగను ప్రారంభించిన మంత్రి చందూలాల్, స్పీకర్ మధుసూదనాచారి
- రుచులు, కళలపై ప్రభుత్వానిది ప్రత్యేక ముద్ర: స్పీకర్
- ఒకేచోట పలు దేశాలు, రాష్ట్రాలకు చెందిన వెయ్యికిపైగా స్వీట్లు





సాక్షి, హైదరాబాద్

78 రకాల లడ్డూలు.. 66 రకాల హల్వాలు.. 74 రకాల పాయసాలు.. మరెన్నో రకాల స్వీట్లు నగరవాసుల నోరూరించాయి. దేశంలోనే తొలిసారి ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన ఇంటర్నేషనల్ స్వీట్ ఫెస్టివల్ శనివారం ఉదయం పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రారంభమైంది. మూడు రోజులపాటు సాగే ఈ ఫెస్టివల్‌ను సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి చందూలాల్, శాసనసభ స్పీకర్ ఎస్.మధుసూదనాచారి ప్రారంభించారు. మిఠాయిల పండుగలో వెయ్యికి పైగా స్వీట్లను ప్రదర్శించారు. కాకినాడ కాజా, బందరు లడ్డూలు, పలురకాల పాయసాలు, 220 రకాల డ్రై ఐటమ్స్, 446 రకాల సెమీ లిక్విడ్ హల్వాలు, 60 రకాల జ్యూస్‌లు, పానకాలు ఘుమఘుమలాడాయి. హైదరాబాద్‌లో స్థిరపడిన గుజరాతీలు, బెంగాలీలు, రాజస్తానీలు, కేరళ, తమిళనాడు, కర్ణాటక అసోసియేషన్స్ తమ సంప్రదాయ మిఠాయిలను ప్రదర్శనకు తీసువచ్చాయి. వీటి కోసం 720 విక్రయశాలలు ఏర్పాటు చేశారు. అలాగే 12 అంతర్జాతీయ స్టాల్స్‌ను ఉంచారు. తొలిరోజు ఫెస్టివల్‌ను సందర్శించిన 25 వేల మందికిపైగా ప్రజలు.. అద్భుతం.. అమోఘం అంటూ లొట్టలేస్తూ మిఠాయిలు లాగించేశారు.

రుచులు, కళలపై ప్రత్యేక ముద్ర



రుచులు, కళలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ముద్రను వేస్తూ ముందుకు సాగుతోందని స్పీకర్ మధుసూదనాచారి పేర్కొన్నారు. మిఠాయిలు ఓ ప్రాంతానికి పరిమితం కావని, భాగ్యనగరం కూడా అందరికీ చెందినదని చెప్పారు. ప్రపంచంలో ఇంత వరకు ఎక్కడా జరగని మిఠాయిల పండుగకు హైదరాబాద్ వేదిక కావడం రాష్ట్రానికి గర్వకారణమన్నారు. నగరవాసుల జీవితాల్లో ఈ స్వీట్ ఫెస్టివల్ ఒక మధురానుభూతిగా మిగిలిపోతుందని చెప్పారు. మంత్రి చందూలాల్ మాట్లాడుతూ.. 15 దేశాలు, 25 రాష్ట్రాలకు చెందిన వెయ్యి రకాల మిఠాయిలను ఒకే చోట చూసే, తినే అవకాశం రావడం అద్భుతమేనని చెప్పారు. శాసనమండలి చైర్మన్ కె.స్వామిగౌడ్ వివిధ దేశాల వారి కోసం ఏర్పాటు చేసిన అంతర్జాతీయ స్వీట్ స్టాల్స్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం, స్వీట్ ఫెస్టివల్ వైస్ చైర్మన్ మామిడి హరికృష్ణ, ఈవెంట్స్ కన్వీనర్ అభిజిత్, టూరిజం కమిషనర్ సునీత భగవత్ తదితరులు పాల్గొన్నారు.

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14+4+16+40 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 6.00
సంపుటి: 10
సంచిక: 294
SUNDAY Special
ఆదివారం 14-1-2018



'నా అక్కలూ.. చెల్లెళ్లు.. తమ్ముళ్ల కళ్లలో వెలుగులు చూసినపుడే నా నిజమైన పుట్టిన రోజు'



సమంత ఆటపట్టించింది
- ఫ్యామిలీలో



పోరాడి పైచేయి..
- స్పోర్ట్స్‌లో

SIMULTANEOUSLY PRINTED AT KADAPA | VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

పల్లె సీమపై సంక్రాంతి సంతకం



సంక్రాంతి సందర్భంగా కృష్ణా జిల్లా నాగాయలంకలో ముగ్గులు వేస్తున్న మహిళలు

రంగవల్లులు, ఆటపాటల సందడి

- అలసిన మనసులకు సొంతూరే సాంత్వన
- వ్యయప్రయాసలకోర్చి ఊరు చేరుకున్న బంధుగణం.. ఆత్మీయుల రాకతో పులకరిస్తున్న కుటుంబాలు
- పల్లెల్లో సంప్రదాయ క్రీడలు, పందేల హోరు
- జిల్లాల్లో జోరుగా పండుగ వ్యాపారం

సాక్షి, అమరావతి

సంప్రదాయానికి మారుపేరైన సంక్రాంతి అంటేనే తెలుగు లోగిళ్లలో ఒక కొత్త వెలుగు. సూర్య భగవానుడు మకర రాశి లోకి ప్రవేశిస్తూ జనుల మదిలో వెలుగులు పూయించే సమయం... చలిపులి ధాటికి దుప్పట్లో ముసుగుతన్నిన పల్లెలిప్పుడు పండుగ సంబరాలు జరుపుకుంటున్నాయి. ఉత్తరాయణ పుణ్యకాల సమయాన పురివిప్పి ఆడే నెమళ్లలా పులకిస్తున్నాయి. ఆత్మీయులు, రక్తసంబంధీకుల రాకతో పెద్దల ముఖాల్లో చిరునవ్వులు కనిపిస్తున్నాయి. గంగిరెద్దులు, హరిదాసులు, రంగవల్లులతో పల్లెలు ఇపుడు కళకళలాడుతున్నాయి. వాతావరణంలో వచ్చిన మార్పుల్లాగే జీవన శైలిలో చోటుచేసుకుంటున్న వింత పోకడలతో పండుగ సంబరాలూ కొత్త పుంతలు తొక్కుతున్నాయి. సంప్రదాయాలకు కొత్త భాష్యం చెబుతున్నాయి.

దూరం భారమైనా...దగ్గరవాలనే తపన

చాలామంది హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర చోట్ల స్థిరపడ్డారు. వేలాది మంది అమెరికా, ఆస్ట్రేలియా, దుబాయ్,

మిగతా 2వ పేజీలో ▶

పండుగ దోపిడీకి 'ప్రైవేటు'
కొత్త రూటు

- నిబంధనలకు విరుద్ధంగా అదనపు సీట్లు, బెర్తులు ఏర్పాటు
- పట్టించుకోని రవాణాశాఖ అధికారులు
- ఏకంగా ఐదు రెట్లు రేట్లు పెంచిన ట్రావెల్స్
- రేట్లలో పోటీపడుతున్న ఆర్టీసీ

9లో

ఇంటి పన్నుల మోత

పల్లెటూర్లలో రూ.500 కోట్ల దాకా బాదుడుకు సర్కారు ప్రణాళిక

- పన్ను పరిధిలోకి 81 లక్షల నివాసాలు
- భూమి ధరల ఆధారంగా వడ్డన
- వారంలోగా ఆదేశాల జారీ!

సాక్షి, అమరావతి:

పల్లెటూర్లల్లో ఇంటి పన్ను భారీగా పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. 2016–17లో నివాస గృహాలపై పన్ను భారీగా పెంచిన ఉభయ గోదావరి జిల్లాలు మినహా రాష్ట్రవ్యాప్తంగా 11 జిల్లాల్లో ఇంటి పన్నులు మోత మోగనున్నాయి. గత 20 ఏళ్లలో గ్రామీణ ప్రాంతాల్లో పెరిగిన భూమి ధరల ఆధారంగా ఇంటి పన్ను పెంచనున్నారు.

పండుగ తరువాత పెంపు ఆదేశాలు!

రాష్ట్రంలో 12,918 గ్రామ పంచాయతీల పరిధిలో గతేడాది ఇంటి పన్ను ఆదాయం రూ.751 కోట్లు వరకు ఉండగా దీన్ని రూ.1,050 – రూ.1,250 కోట్లకు పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది. పంచాయితీరాజ్ శాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు ఇంటి పన్ను పెంపు ప్రక్రియకు సంబంధించి అధికారులు ఇప్పటికే రెండు రకాల ప్రతిపాదనలను ప్రభుత్వానికి అందజేశారు. ప్రస్తుతం సంక్రాంతి పండుగ నేపథ్యంలో మరో వారం రోజుల్లోగా పెంపు ఆదేశాలు

మిగతా 7వ పేజీలో ▶



చిత్తూరు జిల్లా రామచంద్రాపురంలో జరిగిన బహిరంగ సభకు భారీగా హాజరైన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్

పింఛన్లు ఇప్పుడు గుర్తుకొచ్చాయా?

ప్రజాసంకల్ప యాత్రలో సీఎం చంద్రబాబుపై ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ ధ్వజం

- ఆరోగ్యశ్రీ హైదరాబాద్‌లో వర్తించదని ఇప్పడే గుర్తొచ్చిందా?.. ఎన్నికలు వస్తాయనగానే చంద్రబాబు మోసాలకు తెర తీస్తారు
- సీఎం సొంత గడ్డ చంద్రగిరిలో అభివృద్ధి శూన్యం
- చంద్రగిరి నియోజకవర్గంలో 70 శాతం గ్రామాల్లో నీటి కొరత.. బాబు చదివిన స్కూల్ తుమ్మితే పడిపోయేలా ఉంది
- టీడీపీ పాలనలో ఒక్కరు కూడా సంతోషంగా లేరు
- ప్రజా కంటక పాలనకు ముగింపు పలకాలి
- చెడిపోయిన రాజకీయ వ్యవస్థను మార్చాలి

ప్రజాసంకల్ప యాత్ర నుంచి 'సాక్షి' ప్రత్యేక ప్రతినిధి

అవినీతి, అన్యాయం, అక్రమాలు, మోసాలకు పరాకాష్టగా మారిపోయిన చంద్రబాబు పరిపాలనకు ముగింపు పలకాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. సీఎం చంద్రబాబు పుట్టి పెరిగిన సొంత గడ్డ చంద్రగిరి నియోజవకర్గంలో అభివృద్ధి అణువంతైనా కనిపించడం లేదని ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు కావొస్తున్నా ప్రజలను పట్టించుకోని పెద్ద మనిషి మరో ఏడాదిలో ఎన్నికలు జరుగుతాయనగా ఇప్పుడు పింఛన్లు పెంచుతానని చెప్పడం మోసం కాదా? అని నిలదీశారు. ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా శనివారం చిత్తూరు జిల్లా చంద్రగిరి నియోజకవర్గంలోని రామచంద్రాపురంలో నిర్వహించిన

మిగతా 6వ పేజీలో ▶





'సంక్షోభం' సమసేందుకు!

నేడు నలుగురు న్యాయమూర్తులతో సీజేఐ దీపక్‌మిశ్రా భేటీ అయ్యే అవకాశం

- కొనసాగుతున్న సంప్రదింపులు
- పర్యవేక్షిస్తున్న జైట్లీ, రవిశంకర్, అటార్నీ జనరల్
- బయటివారి జోక్యం వద్దు.. త్వరలోనే పరిష్కారం: జస్టిస్ కురియన్
- చర్చల కోసం ఏడుగురితో కమిటీ నియమించిన బార్ కౌన్సిల్
- సీజేఐ అపాయింట్‌మెంట్ కోసం వేచి చూసిన ప్రధాని ముఖ్య కార్యదర్శి
- మోదీ సమాధానం చెప్పాలని కాంగ్రెస్ డిమాండ్

8లో





జస్టిస్ దీపక్‌మిశ్రా


ముంబై తీరంలో కూలిన హెలికాప్టర్

- ఐదుగురు దుర్మరణం, ఇద్దరు గల్లంతు
- ఓఎన్‌జీసీ అధికారులు ప్రయాణిస్తుండగా దుర్ఘటన
- కొనసాగుతున్న గాలింపు

- 8లో







సాక్షి

రాష్ట్రీయం


వైఎస్ఆర్ జిల్లా

ఆదివారం | జనవరి | 14 | 2018

www.sakshi.com

2

ప్రస్తుతం ఉన్న సుప్రీంకోర్టు 1950 జనవరి 28న అందుబాటులోకి వచ్చింది. అప్పటివరకు ఉన్న



ఫెడరల్ కోర్టు, జుడీషియల్ కమిటీ ఆఫ్ ది ప్రైవీ కౌన్సిల్ల స్థానంలో సుప్రీంకోర్టు ఏర్పాటైంది.





డ్రోన్ కెమెరాల ద్వారా మానవ నేత్రానికి సాధ్యం కాని రూపంలో ప్రకృతిని చూసే అవకాశం లభిస్తుంది. చాలా ఎత్తులో నుంచి ప్రకతిని మరో అద్భుతమైన కోణంలో చూడొచ్చు. డ్రోన్స్ట్రాగామ్.. ప్రపంచవ్యాప్తంగా మంచి మంచి ఫొటోలు సేకరిస్తుంటుంది. డ్రోన్లతో తీసే ఫొటోలంటే ఆ సంస్థకు పిచ్చి ప్రాణం. రోజుకు కొన్ని వేల ఫొటోలు ఈ సంస్థకు వస్తూ ఉంటాయి. డ్రోన్స్ట్రాగామ్ సైట్ ద్వారా మనం పంపిన ఫొటోలతో పాటు.. మన వ్యక్తిత్వానికి, అభిరుచికి సరితూగే వ్యక్తులను కూడా కలుసుకోవచ్చు.. ఫొటోగ్రఫీ రంగంలో అభిప్రాయాలను, మెలకువళను కూడా పంచుకోవచ్చు. 2017 సంవత్సరానికి గాను టాప్ 20 డ్రోన్ ఫొటోలను ఇటీవల ప్రకటించింది.

అంత డబ్బులేదు బాసూ!



ఉగాండాకు చెందిన సెమాండా.. అక్కడి కటాబా అనే టౌన్లో రోడ్డుపై ఆహారపదార్థాలు అమ్ముకుంటూ ఉంటాడు. వయసు 50 ఏళ్లు. గత నెలలో ఆఫ్రికా మొత్తం సెమాండా పేరు వార్తల్లో ప్రముఖంగా కన్పించింది. ఎందుకంటే అతడు పెళ్లి చేసుకున్నాడు. అక్కడ పెళ్లి చేసుకుంటే కూడా వార్తేనా అవాక్కవకండి! ఎందుకంటే ఒకేసారి మూడు పెళ్లిళ్లు చేసుకున్నాడు. అయితే ఆ వయసులో పెళ్లి చేసుకున్నందుకు వార్తల్లోకి ఎక్కలేదు..! ముగ్గురిని ఒకేసారి ఎందుకు పెళ్లి చేసుకున్నాడో ఆయన చెప్పిన సమాధానానికి అక్కడి జనం అవాక్కయ్యారు. వార్తల్లో నిలిచాడు. ఆ సమాధానం ఏంటంటే.. ముగ్గురిని మూడుసార్లు పెళ్లి చేసుకునేంత డబ్బు తనవద్ద లేదని.. అందుకే ముగ్గురినీ ఒకేసారి చేసుకున్నానని చెప్పాడు. దీంతో ఫేమస్ అయిపోయాడు. మరి డబ్బే లేనప్పుడు ముగ్గురిని ఎలా పోషిస్తావు అని అడిగితే ''వారికి నేనంటే ఇష్టం.. వారంటే నాకు చాలా ఇష్టం. నలుగురం బతికేందుకు ఇంకా ఇంకా కష్టపడతాను' అని సమాధానం ఇచ్చాడు. ఆ ముగ్గురు భార్యల్లో ఒకరికి 48 ఏళ్లు.. మరో ఇద్దరికి 27, 24 ఏళ్లు..


ప్రేమానురాగాలు, సోదరభావం పెంపొందాలి

- గవర్నర్ నరసింహన్ ఆకాంక్ష..
- తెలుగు రాష్ట్రాల ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు



సాక్షి, హైదరాబాద్: సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ప్రజలకు గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ శనివారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలియజేశారు. పంటలు చేతికొచ్చిన ఆనందంతో జరుపుకునే ఈ పండుగకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. మన ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన ఈ పండుగ అన్ని వర్గాల ప్రజల మధ్య సమైక్యతకు దోహదపడుతుందన్నారు. పండుగ సందర్భంగా మనందరి మధ్య ప్రేమానురాగాలు, సోదరభావం పెంపొందాలని ఆయన ఆకాంక్షించారు.

రాష్ట్ర ప్రజలకు సీఎం చంద్రబాబు సంక్రాంతి శుభాకాంక్షలు



అందరూ సుఖసంతోషాలతో ఉండాలని, తెలుగు లోగిళ్లలో ఏడాదంతా ప్రతిరోజూ ఆనందం వెల్లివిరియాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలకు, దేశ, విదేశాల్లోని తెలుగు వారికి ఆయన భోగి, మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్కళ్యాణ్ కూడా రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలి

తెలుగు ప్రజలకు వైఎస్ జగన్ సంక్రాంతి శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: మకర సంక్రాంతి సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సొంత గ్రామాలతో ప్రజలకు ఉన్న చెక్కుచెదరని ఆత్మీయతలు, అనుబంధాలకు సంక్రాంతి ప్రతీక అని జగన్ పేర్కొన్నారు. సంక్రాంతి అంటేనే రైతులు, పల్లెలు.. గుర్తుకు రావడం సహజమన్నారు. పంటలు బాగా పండి రైతులు సంతోషంగా ఉండాలని, ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలని జగన్ ఆకాంక్షించారు. భోగి మంటలు, రంగ వల్లులు, హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల ఆటలు, గాలి పటాల సందళ్లు, పచ్చటి పైరుల కళకళలు సంక్రాంతి పేరు చెబితే అందరికీ గుర్తుకు వస్తాయన్నారు. అన్నపూర్ణగా పేరు గాంచిన తెలుగు నేల మీద రైతన్నలు, గ్రామీణ వృత్తుల వారు సుఖసంతోషాలతో తులతూగాలని మనసారా కోరుకుంటున్నట్లు జగన్ పేర్కొన్నారు.

పల్లెసీమపై సంక్రాంతి సంతకం



కాకినాడలో గంగిరెద్దుల సందడి

▶ మొదటి పేజీ తరువాయి

సింగపూర్లో ఉద్యోగాల్లో రాణిస్తున్నారు. వీరంతా మూడు రోజుల పండుగ కోసం పల్లెదారి పట్టారు. హైదరాబాద్ నుంచే వేలమంది రాష్ట్రంలోని సొంత ఊర్లకు తరలారు. బస్సులు, రైల్వేస్టేషన్లు వారం రోజులుగా కిటకిటలాడాయి. ఎంత ఖర్చయినా సరే సంక్రాంతికి రావాల్సిందే. ఆత్మీయతలు, అనుబంధాలు పెనవేసుకోవాల్సిందే. ఈ పండుగ ఏ దేవుడికీ సంబంధించినది కాదని, అందరినీ కలిపే ఒక వేడుకని విశాఖపట్నం జిల్లాకు చెందిన రిటైర్డ్ ఉద్యోగి ఎం.ఎ.మోహన్రావు చెప్పారు. అమెరికా నుంచి వచ్చిన కొడుకులు, కోడళ్లను చూసి ఆయన మురిసిపోతున్నారు.

ఆత్మీయల కోసం తపన

ఇంటినిండా బంధుగణం ఉందంటే కోట్లున్నా అంత సంతోషముండదు. ఉపాధి, ఉద్యోగ, వ్యాపారాల కోసం చాలా మంది పట్టణాలకు అక్కడ్నుంచి వీలైతే విదేశాలకూ వెళ్లారు. చాలామందికి డబ్బు సంపాదిస్తున్నా ఆప్యాయతలు లేక పలకరింపు కోసం తపిస్తున్నారు. ఆత్మీయ పలకరింపులు, అనురాగ బంధాల మేళవింపులతో ఏడాదికొక్కసారైనా రాములోరి గుడిపంచన కూర్చుని మనసు విప్పి మాట్లాడే మాటలు కాలిఫోర్నియా, న్యూయార్క్లో చూసిన బహుళ అంతస్థుల మేడలకన్నా మిన్న. సంక్రాంతి పండుగ ఎప్పుడొస్తుందా అని ఎదురు చూస్తున్నామని కర్నూలు జిల్లా సంజామలకు చెందిన సాఫ్ట్వేర్ ఇంజనీర్ కె.వెంకట్రామిరెడ్డి చెప్పారు. ''మా చిన్నప్పుడు సంక్రాంతి అంటే ఎంతో సందడి. గంగిరెద్దుల సందడి, అక్షయ పాత్రతో హరిదాసు పాటలు, గంటలతో జంగాల పొగడ్తలు ఉండేవి. ఇళ్ల ముందు పోటీలు పడి ముగ్గులు పెట్టేవాళ్లం. అంత సందడి ఇపుడు లేదు.'' అని శ్రీకాకుళం జిల్లా కె.కెరాజపురానికి చెందిన శంభాన వెంకటనారాయణమ్మ అన్నారు.

పనిలో పనిగా పెళ్లిచూపులు కూడా..

ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాల్లో ఉంటున్న అబ్బాయిలు, అమ్మాయిలు సంక్రాంతికి ఇంటికొస్తారు. నిజానికి ఇప్పుడు ముహూర్తాలు లేకున్నా పెళ్లి చూపులు మాత్రం కానిస్తున్నారు. అమెరికాలో ఉద్యోగం చేస్తున్న సుధీర్కు ఇలా సంక్రాంతికి వచ్చినప్పుడే పెళ్లిచూపులు జరిపి తరువాత వివాహం చేశారని వైఎస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గం మబ్బుచింతలపల్లెకు చెందిన ఎల్.రామసుబ్బారెడ్డి చెప్పారు.

పల్లెల్లో ఆటపాటలు, పందేల సందడి..

విజయనగరం జిల్లా ఎస్కోట నియోజకవర్గంలో భోగి రోజు నుంచి ప్రారంభమయ్యే తీర్థాల సందర్భంగా యడ్ల బండ్ల పోటీలు, పోతుల పందాలు, సంగిడిరాళ్ల పోటీలు నిర్వహించేందుకు నిర్వాహకులు సమాయత్తమవుతున్నారు. శ్రీకాకుళం జిల్లాలో వినోదం విషయానికొస్తే పొట్టేలు పందేలు ఒక్కటే చెప్పుకోదగినవి. ఇందుకు అనుమతి లేకపోవడంతో వంగర, వీరఘట్టం మండలాల్లో, విజయనగరం సరిహద్దుల్లో గుట్టుగా నిర్వహిస్తున్నారు. పచ్చని కోనసీమలో జరిగే ప్రభల తీర్థాల కోసం రాష్ట్ర నలు మూలల నుంచి తరలివస్తారు. పంటచేలు, కాలవలను దాటుకుని వచ్చే ప్రభలను చూసేందుకు జనం పోటెత్తుతారు. ముఖ్యంగా కొబ్బరి కేంద్రమైన అంబాజీపేట మండలం మొసలపల్లి శివారు జగ్గన్నతోటలో జరిగే ప్రభల తీర్థం వెనుక నాలుగున్నర దశాబ్దాలకుపైగా చరిత్ర ఉంది. ఎటువంటి ఆలయం లేని ఇక్కడ 11 గ్రామాలకు చెందిన ప్రభలు ఊరేగింపుగా వస్తాయి. కర్నూలు జిల్లా జొహరాపురంలో నిర్వహించే బండలాగుడు పోటీలు అందరిలో ఉత్సాహాన్ని నింపుతాయి. అహోబిలంలో జరిగే పారువేట ఉత్సవాలు ప్రత్యేక ఆకర్షణ. ఆళ్లగడ్డ, రుద్రవరం, ఉయ్యాలవాడ, కోవెలకుంట్ల, హరివరం తదితర ప్రాంతాల నుంచి తరలివచ్చే పల్లెవాసులు ఈ పారువేట ఉత్సవాల్లో పాల్గొంటారు. గిరక బండి పోటీలు, ఎద్దులతో బండలాగుడు పోటీలలో పల్లెవాసులు పాల్గొని ఆనందంగా ఈ ఉత్సవాలు జరుపుకుంటారు. విశాఖ జిల్లా వ్యాప్తంగా తీర్థాల్లో ఎడ్ల పందేలు నిర్వహిస్తారు. ఒకప్పుడు గోదావరి జిల్లాలకే పరిమితమైన కోడి పందేలు ఇపుడు విశాఖ గ్రామీణ ప్రాంతాలకూ విస్తరించాయి. ముత్యాలమ్మపాలెం బీచ్ మొదలుకొని భీమిలి బీచ్ వరకు పతంగుల పండుగ నిర్వహిస్తున్నారు.

భారీగానే పండుగ వ్యాపారం

సంక్రాంతి పండగ నేపథ్యంలో ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా వ్యాపారం బాగానే జరిగిందని అంటున్నారు. వస్త్ర వ్యాపారానికి ఉత్తరాంధ్రలోనే పేరెన్నికగన్న విజయనగరంలో సుమారు రూ.170 కోట్ల మేర వస్త్ర వ్యాపారం జరిగినట్లు వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఉభయ గోదావరి జిల్లాల వస్త్ర మార్కెట్కు కేంద్రమైన రాజమహేంద్రవరం, కాకినాడ, ద్వారపూడి, ఇతర పట్టణాల్లో గడిచిన ఐదారు రోజుల్లో సుమారు రూ.80 కోట్ల వ్యాపారం జరిగిందని అంచనా. నోట్ల కష్టాలు లేకుంటే వ్యాపారం ఇంకా బాగా జరిగేదని అంటున్నారు. కర్నూలుజిల్లాలో పండుగ ముగ్గుల రంగుల అమ్మకాలే రూ.2 కోట్ల మేర జరిగినట్టు తెలుస్తోంది. చిత్తూరుజిల్లాలో ఈ ఏడాది వస్త్ర దుకాణాలు, గృహోపకరణాలు, బంగారు, నిత్యావసర సరుకులు ఇలా మార్కెట్లో రూ.230 నుంచి రూ.250 కోట్ల మేర వ్యాపారం జరుగుతున్నట్లు మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

ఇప్పుడు మాట్లాడటం అంటే మద్యమే

తరాలు మారినంత మాత్రాన తలరాతలు మారతాయా? అంటారు. కానీ అంతరాలు మాత్రం ఖచ్చితంగా మారుతున్నాయి. ఒకప్పుడు సంక్రాంతికి దూరప్రాంతాల నుంచి వచ్చిన వారంతా ఆటపాటలతో, ఆత్మీయ పలకరింపులతో సందడి చేసేవారు. అంతా చావిడి వద్ద గుమికూడేవారు. ఇప్పుడు పదిమంది కుర్రాళ్లు కలవాలంటే మద్యం సీసా వారధిగా మారింది. ఆటవిడుపు అంటే మద్యం అన్నట్లుగా మారింది. అన్నాదమ్ములు, అల్లుళ్లు పక్కపక్కనే కూర్చుని చీర్స్ చెప్పుకుంటున్నారు. కొన్నిచోట్ల కనుమరోజు ఉదయం 10 గంటల నుంచి మొదలయ్యే మద్యం ప్రవాహం రాత్రి పదిగంటల వరకూ కొనసాగుతూనే ఉంటుంది. బలాబలాలు బేరీజు వేసుకోవటానికి మద్యపానాన్ని కొలబద్ధగా మార్చుకోవటం కొత్త ట్రెండ్కు అద్దం పడుతోంది.



విజయనగరం మార్కెట్లో కొనుగోలుదారుల రద్దీ



విజయవాడ కృష్ణలంక జామా తోట హైస్కూల్లో 1.25 లక్షల ఆవు పిడకలతో భోగి మంటలకు సిద్ధం చేసిన దృశ్యం



భోగి మంటలు వేసుకునేందుకు విజయవాడలోని భవానీపురం కబేళా రోడ్డులో మొద్దులను కేజీ రూ. 6 చొప్పున విక్రయిస్తున్న దృశ్యం



ఏలూరు సమీపంలోని పెదవేగిలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో సందడి చేస్తున్న విదేశీ యువతి

సంక్రాంతి సంబరాల్లో రాష్ట్ర ఎన్నికల కమిషనర్



గ్రామస్తులతో కలసి పొంగలి తింటున్న కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్

దుగ్గిరాల(మంగళగిరి): రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్ కుమార్ శనివారం తన స్వగ్రామమైన దుగ్గిరాలలో జరుగుతున్న సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు. స్వచ్ఛంద సంస్థ 'దోస్త్' అధ్యక్షుడు మిక్కిలినేని గాంధీ ఆధ్వర్యంలో డాక్టర్ కేఆర్ఆర్ఎం కాలేజీలో జరుగుతున్న ఈ ఉత్సవాల్లో కామన్వెల్త్ క్రీడాకారిణి ఘట్టమనేని సాయిరేవతి, వాలీబాల్ క్రీడాకారుడు విజయ్చంద్తో కలిసి కరాటే, వాలీబాల్, క్రికెట్ తదితర పోటీలను ఆయన పర్యవేక్షించారు. అనంతరం గ్రామస్తులతో కలసి పొంగలి ఆరగించారు.

3న విశాఖలో హనుమాన్ చాలిసా మహాయజ్ఞం

దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానంద



పటమట (విజయవాడ తూర్పు): విశాఖపట్నంలో ఫిబ్రవరి 3న సామూహిక హనుమాన్ చాలీసా మహాయజ్ఞాన్ని నిర్వహించనున్నట్లు దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానందస్వామి చెప్పారు. విజయవాడ పటమటలోని దత్తపీఠంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. నదులన్నీ కాలుష్యమవుతున్నాయని, ప్రకృతి వైపరిత్యాలు అధికంగా చోటు చేసుకుంటున్నాయని, ఇలాంటి విపత్తులను ఎదుర్కోవటానికి హనుమాన్ చాలీసా సాముహిక మహాయజ్ఞం చేపట్టనున్నట్లు తెలిపారు. 2015లో తెనాలిలో లక్షా 28 వేల మందితో హనుమాన్ చాలిసా పారాయణం జరిగిందని, ఆ ఘటన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో నమోదైందని వివరించారు. హనుమాన్ పారాయణ చాలిసాని దేశవిదేశాల్లో కూడా నిర్వహించినట్లు తెలిపారు. మహాయజ్ఞంలో 50 మొక్కలను కూడా పంపిణీ చేస్తున్నామని చెప్పారు. కార్యసిద్ధి హనుమాన్ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమం విశాఖపట్నం రామకృష్ణబీచ్లో ఫిబ్రవరి 3న సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నట్లు వివరించారు.

SAINIK SCHOOL, KALIKIRI, CHITTOOR DIST ANDHRA PRADESH- 517234

TENDER - NOTICE

Ref:SSKAL/3006/QM/2015 dated 14 Jan 2018 Tel: 0877-2500270

1. Sainik School Kalikiri invites sealed Tenders/Bids for Cadet Clothing Items and providing Sanitation and Hygiene material at Sainik School Kalikiri. For details please visit school website www.kalikirisainikschool.com.
2. The Principal has the right to accept /reject the Bids or cancel or postpone the date or the tender without assigning any reason.

Sd/- PRINCIPAL

ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్

(భారత ప్రభుత్వ చట్టబద్ధమైన సంస్థ)

నెల్సన్ మండేలా మార్గ్, వసంత్ కుంజ్, న్యూఢిల్లీ - 110070

ఫోన్: 011-29581000, వెబ్సైట్: www.aicte-india.org

బహిరంగ ప్రకటన

రిజిస్ట్రేషన్ తేదీ పొడిగింపు

(ఇంజినీరింగ్లో డిస్టెన్స్ ఎడ్యుకేషన్కు సంబంధించి)

AICTEచే నిర్వహించబడే పరీక్ష(ల)లో హాజరయ్యేందుకు నాలుగు డీమ్డ్-టు-బి-యూనివర్సిటీస్ (03-01-2017 తేదీగల గౌరవనీయ సుప్రీమ్ కోర్టు ఉత్తర్వులో తెలిపిన విధంగా) 2001-2005 అకడమిక్ సెషన్స్ కాలంలో నమోదుకాబడిన విద్యార్థులు/అభ్యర్థుల ఆన్లైన్ రిజిస్ట్రేషన్ కోసం జారీచేయబడిన 02-12-2017 తేదీగల బహిరంగ ప్రకటనకు తదుపరి ఇది జారీచేయబడింది.

AICTE వెబ్పోర్టల్ **(www.aicte-india.org)** పైన ఆన్లైన్ రిజిస్ట్రేషన్ కోసం ఆఖరి తేది ఏడు రోజులు అంటే **15-1-2018 నుండి 22-1-2018 (సా.5.00 గం. వరకు)** పొడిగించబడినదని పరీక్ష(లు)లో హాజరయ్యేందుకు ఆసక్తిగల విద్యార్థులు/అభ్యర్థులందరికి ఇందుమూలంగా తెలియజేయడమైనది.

Advt. No. P&AP/01 (02)/2018


మెంబర్ సెక్రటరీ, AICTE

ఇదంజగత్



భోగి మంటలు వేసుకోవడానికి ఏమీ దొరకట్లేదట మరి!

61వ రోజు



13-01-18, శనివారం,
నెన్నూరు, చిత్తూరు జిల్లా.

ప్రజలు ఆర్థికంగా నష్టపోతే..

ఆదుకునే తీరు ఇదేనా?

ఉదయం కొద్దిదూరం నడవగానే పేదవాని కష్టార్జితం ఏ విధంగా మందిపాలవుతోంది.. అనే దానికి నిదర్శనం ఎదురైంది. కుప్పంబాదూరు గ్రామానికి చెందిన బత్తల సుబ్రహ్మణ్యం అనే అగ్రిగోల్డ్ బాధితుడు వచ్చి 'అయ్యా.. నేను అగ్రిగోల్డ్లో చేరాను. నా బంధువులు, పరిచయస్తులు దాదాపు వంద మందిని చేర్పించాను. నేను రూ.5 లక్షలు కట్టి, మిగతా వారితో రూ.10 లక్షలు కట్టించాను. ఇప్పుడు నా పరిస్థితి చాలా దారుణంగా ఉంది. డబ్బు కట్టిన వారు రోజూ ఇంటి వద్దకు వచ్చి కూర్చుంటున్నారు. టెన్షన్తో షుగర్, బీపీ కూడా వచ్చాయి. ఆత్మహత్య చేసుకోవాలని ప్రయత్నించాను. పిల్లల ముఖాలు చూసి, మంచి రోజులు వస్తాయన్న ఆశతో బతుకుతున్నాను' అని కన్నీటి పర్యంతమయ్యాడు. అగ్రిగోల్డ్ బాధితుల కష్టాలు వింటుంటే కడుపు తరుక్కుపోతోంది. నోరు కట్టుకుని, రూపాయి రూపాయి కూడబెట్టి కూతురి పెళ్లికో, కొడుకు చదువుకో అక్కరకు వస్తాయనే గంపెడాశతో అగ్రిగోల్డ్లో దాచుకుంటే చివరికి ' ఈనగాచి.. నక్కల పాలైనట్లు' తయారైంది. అగ్రిగోల్డ్లో బాధితులు మన రాష్ట్రంలోనే 9 లక్షల మందికి పైగా ఉన్నారు. వారిలో అత్యధికులు కూలీలు, చిన్న, సన్నకారు రైతులు, కార్మికులు, మధ్యతరగతి జీవులే. జీవిత కాలం కష్టపడి సంపాదించిన డబ్బు ఇక రాదన్న బెంగతో దాదాపు 200 మంది తుదిశ్వాస విడిచారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం మిన్నకుండిపోవడంలో ఆంతర్యమేంటి? తక్షణం రూ.1100 కోట్లు విడుదల చేస్తే.. దాదాపు 80శాతం మంది బాధితులకు ఉపశమనం కలుగుతుందని తెలిసి కూడా ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారు? గతేడాది నేను అగ్రిగోల్డ్ బాధితులకు బాసటగా.. వారి దీక్షా శిబిరాన్ని సందర్శించిన వెంటనే ఈ ప్రభుత్వం హడావుడిగా మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది. అసెంబ్లీ సాక్షిగా ప్రకటించి కూడా ఇద్దరికో, ముగ్గురికో తప్ప పరిహారంఇవ్వలేదంటే వీరికున్న చిత్తశుద్ధి అర్థమవుతోంది. తన పాలనలో ప్రజలు ఆర్థికంగా మోసపోతే ఒక ప్రభుత్వం ఆదుకునే తీరు ఇదేనా? మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.1100 కోట్లు విడుదల చేసి 80 శాతం మంది బాధితులకు తక్షణ ఉపశమనం కల్గించాలన్న నా సంకల్పం మరింత దృఢమైంది.

రాష్ట్రంలోని అతి పెద్ద చెరువులలో ఒకటైన రాయల చెరువు వెంబడి నడుస్తున్నప్పుడు ఒక గొప్ప అనుభూతికి లోనయ్యాను. ఈ చుట్టుపక్కల ఏడు మండలాల భూగర్భ జలాలకు ఆధారమైన చెరువది. దాదాపు 500 సంవత్సరాల కిందట శ్రీకృష్ణదేవరాయలు తవ్వించారట. వారి దార్శనికతకు అచ్చెరువొందాను. కరవు నివారణకు, భావితరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని చెరువులు తవ్వించిన నాటి పాలకుల తీరుకు, రైన్ గన్నులు, ఇంకుడు గుంతలంటూ.. ప్రజలను మభ్యపెడుతూ, ఓట్ల కోసమే ఆలోచిస్తున్న నేటి నాయకుల సంకుచిత రాజకీయ ఆలోచనలకు ఎంత వ్యత్యాసమో కదా!

సంజీవపురం వద్ద రాయవ్వ అనే 67 ఏళ్ల అవ్వ కలిసింది. ఆమెది మనసుకు కష్టం కలిగించే బాధ. 40 ఏళ్ల కిందటే ఆమె భర్త చనిపోయాడట. కూతురు కూడా చనిపోయిన విషాదం ఆమెది. ఆ అవ్వకు నాన్నగారి హయాంలో వితంతు పింఛన్ వచ్చేదట. ఇప్పుడా పింఛన్ ఆపేశారట. కాసేపటికే బలిజపల్లి హరిజనవాడకు చెందిన బుజ్జమ్మ అనే ఓ అక్క తన పదేళ్ల కొడుకుని ఎత్తుకుని వచ్చింది. ఆ బిడ్డ పుట్టుకతోనే మూగ, చెవుడు అట. వంద శాతం వైకల్యం ఉన్నట్టు డాక్టర్లు సర్టిఫికెట్లు కూడా ఇచ్చారట. అయినా పింఛన్ రావడంలేదని 'వచ్చేలా చెయ్యన్నా..' అంటూ అర్జీ ఇచ్చింది. పుట్టుకతో మూగ, చెవుడు అయిన పిల్లాడికి ఆపరేషన్ చేయించకపోవడమేగాక, పింఛన్ కూడా ఇవ్వకపోవడం చాలా దారుణం. ఇలా ఇంటికొకటి ఇచ్చే పింఛన్లకే దిక్కు లేకపోతే.. బాబుగారు సరికొత్తగా ఇప్పుడు ఇంట్లో ఇద్దరు, ముగ్గురు అర్హులున్నా ఇస్తామంటున్నారు. ఆయనకు ఈ అర్హులు కనిపించలేదా? ఇక రెండు పింఛన్ల సంగతి నమ్మేదెలా? నాలుగేళ్లు గడిచిపోయి.. ఇక ఏడాదిలో ఎన్నికలు వస్తాయనగా ఇప్పుడు ఇన్ని డ్రామాలా?

నడవలూరు వద్ద పదవీవిరమణ చేసిన పారామిలటరీ బలగాల సంఘ నేతలు కలిశారు. మిలటరీతో సమానంగా విధులు నిర్వహిస్తున్న తమను ఎక్స్సర్వీస్మేన్లుగా గుర్తించాలంటూ కేంద్ర ప్రభుత్వం సూచించినా.. రాష్ట్ర ప్రభుత్వం పెడచెవిన పెడుతోందని వాపోయారు. దేశ సరిహద్దులలోనూ, అంతర్గతంగానూ ప్రాణాలొడ్డి దేశరక్షణకై పోరాడుతున్న బలగాల పట్ల మానవత్వంతో ఆలోచించాల్సిన బాధ్యత పాలకులకు ఉండాలి కదా. వారి త్యాగాలకు ఈ ప్రభుత్వం ఇచ్చే విలువ ఇదేనా?

చివరిగా, ముఖ్యమంత్రి గారికి నాదో ప్రశ్న.. అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకుంటామని ఎన్నికల ముందు మాటిచ్చి, ఆదుకునే మార్గాలు కళ్ల ముందు కనిపిస్తున్నా.. పట్టించుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటి? ఆ ఆస్తులపై మీ బినామీల, మంత్రుల కన్ను పడటమే కారణం కాదా?

వైయస్. జగన్.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

టోల్ ఫ్రీ నం: 1800 270 1083

Dwaraka

31న చంద్రగ్రహణం

- ఉదయం 11 నుంచి రాత్రి 9.30 గంటల వరకు శ్రీవారి ఆలయం మూసివేత


తిరుమల శ్రీవారి ఆలయం

సాక్షి, తిరుమల: చంద్రగ్రహణం కారణంగా ఈనెల 31న ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9:30 గంటల వరకు శ్రీవారి ఆలయ తలుపులు తాత్కాలికంగా మూసి వేయనున్నారు. ఆరోజు సాయంత్రం 5:18 గంటలకు చంద్రగ్రహణం ప్రారంభమై రాత్రి 8:41 గంటలకు పూర్తికానుంది. గ్రహణ సమయానికి 6 గంటలు ముందుగా ఆలయం తలుపులు మూసి వేయడం ఆనవాయితి. గ్రహణం తర్వాత రాత్రి 9:30 గంటలకు ఆలయ తలుపులు తెరిచి శుద్ధి, పుణ్యాహవచనం, రాత్రి కైంకర్యాలు నిర్వహిం చనున్నారు. రాత్రి 10:30 గంటల నుంచి 12 గంటల వరకు భక్తులకు సర్వదర్శనం కల్పిస్తారు. 31న ఆర్జితసేవలైన సహస్రకలశాభిషేకం, కళ్యా ణోత్సవం, ఊంజల్‌సేవ, బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను రద్దు చేస్తున్నట్లు టీటీడీ తెలిపింది.



ఉపాధి కల్పనకు త్వరలో 'ఆలీబాబా'తో ఒప్పందం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు టెక్నికల్, ఈ కామర్స్ రంగాల్లో శిక్షణ ద్వారా ఉపాధి కల్పించాలని నిర్ణయించినట్లు చైనాకు చెందిన ఆన్‌లైన్ ఈ–కామర్స్ దిగ్గజం ఆలీబాబా ఇండియా బిజినెస్ డెవలప్‌మెంట్ హెడ్ వండర్ చాన్ తెలిపారు. చాన్ శనివారం హైదరాబాద్‌లో రాష్ట్ర మంత్రులు లోకేశ్, అఖిలప్రియలతో చర్చలు జరిపారు. త్వరలోనే విజయవాడ పర్యటనకు వచ్చినప్పుడు దీనికి సంబంధించి ఒప్పందం కుదుర్చుకోనున్నట్లు మంత్రి అఖిలప్రియ వెల్లడించారు.

- ఉద్యోగులకు చెల్లించాల్సిన పీఆర్సీ, డీఏ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ సర్వీసెస్ అసోసియేషన్ చైర్మన్ జి.వీరయ్య, ప్రధాన కార్యదర్శి బుచ్చిరాజు శనివారం డిమాండ్ చేశారు.

OFFICE OF THE EXECUTIVE COUNCIL OF INSURERS
3rd floor, JeevanSevaAnnexe Building, S. V. Road, SantaCruz (West), Mumbai - 400 054
Tel No.: 022-26106889/ 26106671 E-mail: inscoun@ecoi.co.in, Website: www.ecoi.co.in

PUBLIC NOTICE

ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఆఫ్ ఇన్సూరర్స్ సంస్థ (ECOI), గతంలో గవర్నింగ్ బాడీ ఆఫ్ ఇన్సూరెన్స్ కౌన్సిల్, భారత ప్రభుత్వం వారిచే జారీచేయబడిన 2017 ఇన్సూరెన్స్ అంబుడ్స్‌మన్ నిబంధనల ప్రకారం ఇన్సూరెన్స్ అంబుడ్స్‌మన్ మానిటరీ బాడీగా ప్రకటించబడినదని ప్రజానీకానికి ఇందుమూలంగా తెలియజేయడమైనది. మీకు వ్యక్తిగత పాలసీలుగాని, గ్రూప్ పాలసీలుగాని లేదా సోల్ ప్రొప్రైటర్‌షిప్ మరియు మైక్రో ఎంటర్‌ప్రైజెస్ స్థాయిలో జారీ చేయబడిన బీమా పాలసీలు ఉండి, సంబంధిత బీమా కంపెనీలు వారి ఏజెంట్లు మరియు మధ్యవర్తులతో (ఇంటర్‌మీడియరీస్) ఏమైన సమస్యలు ఉన్న పక్షంలో పరిష్కార నిమిత్తం మీ ఫిర్యాదులను ఇన్సూరెన్స్ అంబుడ్స్‌మన్‌కు పంపించవచ్చును.

ECOI ఇందు మూలంగా ప్రజానీకానికి తెలియజేస్తున్న ముఖ్య గమనిక:

- ECOI ప్రత్యక్షంగా గాని, ప్రతినిధుల ద్వారా గాని ఎటువంటి బీమా లేదా ఆర్థిక ప్రొడక్టులను విక్రయించటం లేదు.
- ECOI పాలసీదారులకు లేక బీమా కంపెనీలకు ఎలాంటి బోనస్‌ను ప్రకటించదు.
- ECOI బీమా కంపెనీల నుంచి ప్రీమియమ్స్ సేకరించి పెట్టుబడులు పెట్టదు.
- ECOI ఉద్యోగులమని, అధికారులమని చెప్పుకొనే మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిందిగా ECOI ఇందుమూలంగా ప్రజానీకాన్ని కోరుతోంది.

ఆ మేరకు ఎవరయినా ఫోన్ చేస్తే తక్షణం ఆ ఫోన్ నంబర్, కాలర్ వివరాలతో మీ సమీపం లోని స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయవలసిందిగా కోరడమైనది.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతం పాండిచ్చేరిలో భాగమైన యానాం నివాసితులు తదుపరి విచారణ కొరకు సంప్రదించవలసిన ఇన్సూరెన్స్ అంబుడ్స్‌మన్ కార్యాలయం యొక్క కాంటాక్ట్ వివరాలు దిగువ ఇవ్వబడినవి.

#6-2-46, 1వ అంతస్తు, మొయిన్ కోర్టు, హ్యూందాయ్ షోరూమ్ ఎదురుగా గల లేన్, A.C. గార్డ్స్, లక్డీకాపూల్, హైదరాబాద్-500004. ఫోన్: 040-65504123,23312122.
ఇ-మెయిల్: bimalokpal.hyderabad@ecoi.co.in

సెక్రటరీ జనరల్ (ECOI)










సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
ఆదివారం I జనవరి I 14 I 2018
www.sakshi.com

దిద్దుబాటే శ్రేయస్కరం

త్రికాలమ్



కె. రామచంద్రమూర్తి

సర్వోన్నత న్యాయస్థానంలో నలుగురు అత్యంత అనుభవశాలురైన న్యాయమూర్తులు మీడియా సమక్షంలో హృదయావిష్కారం చేసిన ఘట్టం చరిత్రాత్మకమైనది. శుక్రవారంనాడు ఢిల్లీలో జస్టిస్ చలమేశ్వర్, జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ మదన్ బి లోకూర్, జస్టిస్ కురియన్ జోసెఫ్‌లు మీడియాతో మాట్లాడటమే అపూర్వమైన అంశం అయితే వారు అందించిన సందేశం దిగ్భ్రాంతికరమైనది. జస్టిస్ లోధా, జస్టిస్ ఠాకూర్ వంటి మాజీ ప్రధాన న్యాయమూర్తులూ, మాజీ సొలిసిటర్ జనరల్ సోలీ సొరాబ్జీ వంటి న్యాయకోవిదులూ ఈ పరిణామం దురదృష్టకరమైనదనీ, అవాంఛనీయమైనదనీ అభివర్ణించారు. న్యాయమూర్తులు చేసిన ఆరోపణలు అస్పష్టంగా ఉన్నాయనీ, న్యాయవ్యవస్థను వేధిస్తున్న సమస్యలను వెల్లడిస్తే ప్రయోజనకరంగా ఉండేదనే అభిప్రాయం కూడా ఉంది.

సుప్రీంకోర్టులో అనుభవం రీత్యా, పేరుప్రఖ్యాతుల దృష్ట్యా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్‌మిశ్రా తర్వాత అగ్రగణ్యులైన నలుగురు న్యాయమూర్తులు సంప్రదాయం, నియమావళి పేరుతో తమను కట్టిపడవేసిన బంధనాలను తెంచుకొని, తెగించి ప్రజల ముందుకు వచ్చారంటే అందుకు బలమైన కారణాలు ఉండాలి. ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందనీ, న్యాయవ్యవస్థ స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను ప్రజలే కాపాడుకోవాలనీ వారు చెప్పారంటే పరిస్థితి తీవ్రతను ఊహించుకోవచ్చు. ప్రధాన న్యాయమూర్తిని కలసి సంప్రదింపుల ద్వారా సమస్యల పరిష్కారానికి ప్రయత్నం జరిగింది. బహుశా రాష్ట్రపతిని కలసి ఆయనకు సమస్యను నివేదించి ఉంటే ప్రయోజనం ఉండేదేమో!

నలుగురు నిష్ణాతులే

ఇప్పుడు వివాదం సృష్టించడం వల్ల ఈ నలుగురిలో ఏ ఒక్కరికీ ఒనగూరే అదనపు ప్రయోజనం ఏమీలేదు. పైగా ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి వచ్చే అక్టోబర్ 2న పదవీ విరమణ చేసిన తర్వాత ఆ పదవిని అలంకరించే అవకాశం ఉన్న రంజన్ గొగోయ్ తక్కిన ముగ్గురితో గొంతు కలపడం ఆయనకు వ్యక్తిగతంగా నష్టదాయకంగా పరిణమించవచ్చు. జస్టిస్ చలమేశ్వర్ పదవీ కాలం ఈ యేడాది జూన్ 22తో ముగుస్తుంది. జస్టిస్ కురియన్ జోసెఫ్ నవంబర్ 29 వరకే పదవిలో ఉంటారు. జస్టిస్ లోకూర్ సైతం డిసెంబర్ 30న పదవీ విరమణ చేయవలసి ఉంది. నెలా, రెండు నెలల్లో పదవీ విరమణ చేయబోయే వారిని ప్రధాన న్యాయమూర్తి పీఠంపైన కూర్చోబెట్టే సంప్రదాయం లేదు కనుక 2019 నవంబర్ 17 వరకూ పదవీకాలం కలిగిన గొగోయ్‌కి ప్రధాన న్యాయమూర్తి పదవి దక్కే అవకాశం ఉంది. ఆయన ముగ్గురు సహచరులతో కలసి తిరుగుబాటు చేయడం నిజంగా సాహసమే. జస్టిస్ చలమేశ్వర్ చెప్పినట్టు, భావితరాలు తమను తప్పుపట్టకుండా తగిన సమయంలో ప్రశ్నించవలసిన బాధ్యతను నెరవేర్చామని గొగోయ్ సైతం భావించారు. జాతి రుణం తీర్చుకుంటున్నామని స్వయంగా చెప్పారు. ఇది ఎంతో గంభీరమైన విషయం కాకపోతే అంత బరువైన మాటలు న్యాయమూర్తులు ఉపయోగించేవారు కాదు. సచ్ఛీలత, ధర్మనిష్ఠ కలిగిన వ్యక్తిగా గొగోయ్‌కి పేరున్నది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కర్ణన్‌ను కోర్టు ధిక్కార నేరంపైన జైలుకు పంపించిన ఏడుగురు సభ్యుల రాజ్యాంగధర్మాసనంలో జస్టిస్ గొగోయ్ ఉన్నారు. చీఫ్ జస్టిస్ తర్వాత స్థానంలో ఉన్న జస్టిస్ చలమేశ్వర్ (నెంబర్ 2) నిష్కర్షగా వ్యవహరించి వివాదాలకు కేంద్రమైనారు. న్యాయమూర్తుల నియామకం కొలీజియం ద్వారా కాకుండా జాతీయ న్యాయ నియామకాల కమిషన్ (నేషనల్ జుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్-ఎన్‌జెఏసీ) ప్రమేయంతో జరగాలని భావించి మెజారిటీ తీర్పుతో విభేదించారు. ఈ కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగధర్మాసనం 2015 అక్టోబర్ 16న వెలువరించిన తీర్పులో ఈ అసమ్మతిని జస్టిస్ చలమేశ్వర్ (1:4) నమోదు చేశారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టంలో 66(ఎ) సెక్షన్ రాజ్యాంగ విరుద్ధమని తీర్పు చెప్పడం ద్వారా భావ ప్రకటనాస్వేచ్ఛకు దన్నుగా నిలిచారు. కొలీజియం వ్యవహారాలలో కానీ ఇతర అంశాలలో కానీ పారదర్శకత ఉండాలని వాదించే ప్రముఖులలో అగ్రశ్రేణి ప్రముఖుడు. సీనియారిటీ ప్రకారం నాలుగో స్థానంలో ఉన్న లోకూర్ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. గువాహటి హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా, ఢిల్లీ హైకోర్టు తాత్కాలిక చీఫ్ జస్టిస్‌గా కూడా ఉన్నారు. రాజకీయవాదులు మతం పేరుతో ఓట్లు అడగరాదంటూ ఉత్తమమైన తీర్పు చెప్పిన న్యాయమూర్తులలో ఆయన ఒకరు. ఐదో స్థానంలో ఉన్న కురియన్ ట్రిపుల్ తలాక్ చెల్లనేరదని చరిత్రాత్మకమైన తీర్పు ఇచ్చిన న్యాయమూర్తి. ఈ నలుగురూ మీడియాతో మాట్లాడటాన్ని తప్పు పట్టినవారు సైతం వారి రుజువర్తనం, నిజాయితీ, న్యాయశాస్త్ర పరిజ్ఞానం, ధర్మనిరపేక్షత, నిబద్ధత పట్ల లవలేశమంత సందేహం వెలిబుచ్చలేదు.

ముదిరిన విభేదాలు

కడచిన రెండు మాసాలలో సంభవించిన కొన్ని పరిణామాలు ఒకానొక అసాధారణ పరిస్థితిని సృష్టించాయి. ఒకటి, ఉత్తరప్రదేశ్‌లో ప్రసాద్ ఎడ్యుకేషన్ ట్రస్టు నడిపే మెడికల్ కాలేజీలో ప్రవేశాలకు సంబంధించిన కుంభకోణంపైన రగిలిన వివాదం. ఈ కేసును సీబీఐ దర్యాప్తు చేసి ఒడిశా హైకోర్టు మాజీ న్యాయమూర్తిని అరెస్టు చేసింది. ఇందులో ప్రధాన న్యాయమూర్తి ప్రమేయం ఉన్నట్టు పిటిషనర్లు అన్యాపదేశంగా ఆరోపించారు. ప్రముఖ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ దాఖలు చేసిన ప్రజాప్రయోజన పిటిషన్ (పిల్)ను పునస్సమీక్షించాలని ఈ కేసు విచారణకు ఐదుగురు సీనియర్ న్యాయమూర్తులతో ఒక బెంచిని నెలకొల్పుతూ జస్టిస్ చలమేశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే ప్రధాన న్యాయమూర్తి జోక్యం చేసుకొని, చలమేశ్వర్ ఏర్పాటు చేసిన బెంచిని రద్దు చేసి ఆయన స్వయంగా తన ఆధ్వర్యంలోనే ఒక బెంచిని నియమించారు. 'చీఫ్ జస్టిస్ ఈజ్ ది మాస్టర్ ఆఫ్ రోస్టర్' అని ఏ కేసు ఎవరు విచారించాలో నిర్ణయించే అధికారం ప్రధాన న్యాయమూర్తికే ఉంటుందంటూ 1998లో రాజ్యాంగధర్మాసనం ఇచ్చిన తీర్పు నెలకొల్పిన సంప్రదాయాన్ని జస్టిస్ దీపక్‌మిశ్రా గుర్తు చేశారు. నిజానికి చీఫ్ జస్టిస్ సమానులలో ప్రథముడే (ఫస్ట్ ఎమాంగ్ ఈక్వల్స్) కానీ అందరి కంటే అధికుడు కాదని నలుగురు న్యాయమూర్తులూ విడుదల చేసిన లేఖలో వ్యాఖ్యానించారు. అయినప్పటికీ, ప్రధాన న్యాయమూర్తికి విశేష ప్రాధాన్యం ఉంటుంది. తక్కినవారంతా సుప్రీంకోర్టు న్యాయమూర్తులైతే (జడ్జెస్ ఆఫ్ సుప్రీంకోర్టు) చీఫ్ జస్టిస్ దేశానికి ప్రధాన న్యాయమూర్తి (చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా). అంతమాత్రాన విశేషాధికారాలను వినియోగించే క్రమంలో పక్షపాతం కానీ స్వప్రయోజనాలు కానీ ఉన్నట్టు కనిపిస్తే ప్రధాన న్యాయమూర్తిని సైతం ప్రశ్నించే అధికారం న్యాయమూర్తులకూ, న్యాయవాదులకూ, సామాన్య పౌరులకూ ఉంటుంది. నర్సస్తాదనంగా ఏర్పాటైన కేసు విచారించడానికి నియమించిన బెంచ్‌ని విస్తరించడంలో కొత్తగా కొందరు న్యాయమూర్తులను చేర్చుతారు కానీ ఉన్నవారిని తొలగించరు. ఉదాహరణకు ఇద్దరు న్యాయమూర్తులున్న బెంచిని విషయ ప్రాధాన్యం దృష్ట్యా ఐదుగురు సభ్యుల బెంచ్‌గా విస్తరించాలంటే కొత్తగా ముగ్గురిని నియమిస్తారు కానీ, మొదటి ఇద్దరిలో ఎవ్వరినీ తొలగించరు. ఇది రివాజులకు పెద్దపీట వేసే సంప్రదాయం. మెడికల్ కుంభకోణం కేసు విచారించడానికి జస్టిస్ మిశ్రా నియమించిన బెంచ్‌లో జస్టిస్ చలమేశ్వర్ లేరు. రెండు, గుజరాత్ పరిణామాలకు సంబంధించిన సోహ్రాబుద్దీన్ అనే వ్యక్తిని 'బూటకపు ఎన్‌కౌంటర్' చేశారనే ఆరోపణ విచారిస్తున్న సీబీఐ జడ్జి బీహెచ్ లోయా మృతి కేసు. నాగపూర్‌లో తన సహచరుడి కుమార్తె వివాహానికి వెళ్లి అనుమానాస్పద పరిస్థితులలో 2014 డిసెంబర్ 1న గుండెపోటుతో లోయా మరణించారు. ఈ కేసు ప్రారంభంలో బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా నిందితుడు. అనంతరం షా పేరు నిందితుల జాబితా నుంచి తొలగించారు. లోయా మరణానికి సంబంధించిన కేసు విచారణ బొంబాయి హైకోర్టులో నడుస్తుండగానే దాన్ని సుప్రీంకోర్టుకు బదిలీ చేయాలని కోరుతూ ఒక పిటిషన్ ఆధారంగా సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ కేసును ప్రధాన న్యాయమూర్తి సీనియర్ న్యాయమూర్తులకు కాకుండా సీనియారిటీ జాబితాలో పదో స్థానంలో ఉన్న జస్టిస్ అరుణ్ మిశ్రా బెంచ్‌కి కేటాయించారు. లోయా పోస్ట్‌మార్టం రిపోర్టునూ, ఇతర పత్రాలను సుప్రీంకోర్టులో జనవరి 15 నాడు సమర్పించాలని ఆదేశాలు వెళ్ళాయి. మహారాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించాలని కూడా కౌన్సెల్ నిశాంత ఆర్ కర్నేశ్వార్కర్‌కు సుప్రీంకోర్టు పురమాయించింది. సాధారణంగా హైకోర్టులో విచారించవలసిన అంశాలు సుప్రీంకోర్టుకు వస్తే ముందు హైకోర్టుకు వెళ్ళండి అని పిటిషనర్లను న్యాయమూర్తులు ఆదేశిస్తారు. లోయా కేసు విషయంలో ఇందుకు విరుద్ధంగా జరిగింది. పైగా బొంబాయ్ లాయర్ల సంఘం ఈ కేసు విచారణ బొంబాయ్ హైకోర్టులోనే జరగా



లని కోరుతోంది. ఈ సంఘం తరఫున ప్రముఖ న్యాయవాది దుష్యంత్ దవే సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ముంబయికి చెందిన జర్నలిస్టు బీఆర్ లోన్ తరఫున ఇందిరా జైసింగ్ వాదిస్తున్నారు. కాంగ్రెస్ వకీలుగా వరీందర్ కుమార్ శర్మ మరో పిటిషన్ వేశారు. వీరందరి ప్రార్థనా ఒక్కటే. ఈ కేసును సుప్రీంకోర్టులో విచారించవద్దు, బొంబాయ్ హైకోర్టులో విచారణ కొనసాగించాలి. ఇంతటి రాజకీయ ప్రాధాన్యం ఉన్న కేసును సీనియర్‌ల నాయకత్వంలోని బెంచ్‌కి అప్పచెప్పకుండా జూనియర్‌కు పంపించడం వివాదాస్పదం అయింది. వాస్తవానికి సుప్రీంకోర్టులో న్యాయమూర్తులు అందరూ సమానులే. సీనియర్, జూనియర్ అనే భేదం లేదు. కానీ రాజకీయ ప్రాముఖ్యం ఉన్న కేసులు సీనియర్లకు కేటాయించడం రివాజు.

ప్రధాన న్యాయమూర్తిదే బాధ్యత

ఈ వివాదం చినికి చినికి గాలివానగా మారక ముందే సామరస్యంగా పరిష్కరించుకోవాలి. సోమవారం నుంచి తాము యథావిధిగా సుప్రీంకోర్టుకు వెడతామని జస్టిస్ చలమేశ్వర్ చెప్పారు. శనివారంనాడు సుప్రీంకోర్టు బార్ కౌన్సిల్, బార్ అసోసియేషన్ల సమావేశాలు జరిగాయి. బార్ కౌన్సిల్ సీనియర్ న్యాయమూర్తులు మీడియాను కలుసుకోవడాన్ని తప్పు పట్టింది. వివాదం పరిష్కరించేందుకు ఏడుగురు సభ్యులతో ఒక కమిటీని నియమించింది. లోయా కేసులో క్షుణ్ణంగా విచారణ జరగాలంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించడం అనవసరమైన రాజకీయ జోక్యమంటూ విమర్శించింది. ఈ వివాదంలో జోక్యం చేసుకోకుండా దూరంగా ఉండాలన్న ఎన్‌డీఏ ప్రధానమంత్రి, న్యాయశాఖ మంత్రి వైఖరిని స్వాగతించింది. న్యాయమూర్తులు మీడియాతో మాట్లాడటం పట్ల బార్ అసోసియేషన్ అభ్యంతరం చెప్పలేదు కానీ పరిస్థితి తీవ్రత పట్ల ఆందోళన వ్యక్తం చేసింది. లోయా కేసు సహా అన్ని 'పిల్'లనూ ఐదుగురు సీనియర్ న్యాయమూర్తుల ఆధ్వర్యంలోని బెంచ్‌లే విచారించాలని బార్ అసోసియేషన్ కోరింది. ప్రభుత్వం తక్షణం చేయవలసిన పని ఒకటి ఉంది. న్యాయమూర్తుల నియామకాలను కొలీజియం చేస్తుందని నిర్ణయించిన అనంతరం ఆ నిర్ణయం అమలు జరగాలంటే సుప్రీంకోర్టుకూ, కేంద్ర ప్రభుత్వానికీ మధ్య ఒక ఒప్పంద పత్రం (మెమొరాండం ఆఫ్ ప్రొసీజర్-ఎంఓపీ) ఉండాలి. ఈ పత్రాన్ని తయారు చేయడంలో సహకరించడానికి అటార్నీ జనరల్ ముకుల్ రోహత్గీ నిరాకరించినప్పుడు 'మీరు అటార్నీ జనరల్ దేశానికా లేక ప్రస్తుత ప్రభుత్వానికా?' అంటూ సీనియర్ న్యాయవాది రాజీవ్ ధవన్ ఎద్దేవా చేశారు. ఎంఓపీని సుప్రీంకోర్టు కేంద్రానికి పంపి నెలలు గడిచిపోతున్నా కేంద్రం ఆమోదం తెలపలేదు. ఎంఓపీ లేకపోవడం వల్ల న్యాయమూర్తిగా తనను నియమించడానికి నిరాకరించారంటూ లూత్రా అనే న్యాయవాది వేసిన పిల్‌పైన జస్టిస్ ఆదర్శకుమార్ గోయెల్, జస్టిస్ ఉదయ్ ఉమేశ్ లలిత్‌తో కూడిన బెంచ్ తీర్పు ఇస్తూ ఎంఓపీని సాధ్యమైనంత త్వరగా కేంద్రం ఆమోదించాలని విజ్ఞప్తి చేసింది. ఎంఓపీ లేకపోవడం వల్ల న్యాయమూర్తుల నియామకాలు నిలిచిపోయి కోర్టులలో ఖాళీలు న్యాయవ్యవస్థను వెక్కిరిస్తున్నాయి. ప్రస్తుత సంక్షోభాన్ని అధిగమించే క్రమంలో చాలాకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కారమైతే, న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యాన్ని పటిష్టం చేసే చర్యలు తీసుకుంటే న్యాయమూర్తులు తమ వంతు కర్తవ్యం నెరవేర్చినట్టే. ఈ మొత్తం కార్యక్రమాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్‌మిశ్రా పెద్దమనసుతో నిర్వహించాలి. న్యాయమూర్తులనూ, న్యాయవాదులనూ కలుపుకొని వెళ్ళవలసిన బాధ్యత ప్రధానంగా ఆయనదే.

ట్రంప్ (అమెరికా ప్రెసిడెంట్) రాయని డైరీ

మాధవ్ శింగరాజు


అమెరికాలోనే ఉన్నామా అనిపిస్తోంది! ప్రెసిడెంటుకే ఫ్రీడమ్ ఆఫ్ స్పీచ్ లేనప్పుడు స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ మాత్రం ఎందుకిక్కడ? లేపేసి హైతీలోనో, ఆఫ్రికాలోనో పెట్టేస్తే సరిపోతుంది.

ఐక్యరాజ్యసమితిని కూడా ఇక్కడి నుంచి లేపేయాలి. ఐక్యరాజ్యసమితిలా లేదది. ఐక్య ఆఫ్రికాసమితిలా బిహేవ్ చేస్తోంది. ఎవర్నీ ఒక మాట అనకుండా కూర్చోడానికైతే అమెరికాకు ఒక ప్రెసిడెంట్ ఎందుకు?

'షిట్‌హోల్'.. అన్నానట! నాకైతే గుర్తు లేదు. అంతా ఫీలైపోతున్నారు. 'షిట్‌హోల్' అని నేను ఎప్పుడు అన్నానో, ఎందుకు అన్నానో, ఎవర్ని అన్నానో మరి! పనికిమాలిన విషయాల్ని మీడియా వెంటనే పట్టేసుకుంటుంది. అన్నవాళ్లకు గుర్తుండదు. అనిపించుకున్న వాళ్లకూ గుర్తుండదు. మీడియా గుర్తుపెట్టుకుంటుంది. సిక్ పీపుల్.

వాషింగ్టన్ పోస్ట్‌ని కూడా ఇక్కణ్నుంచి లేపేయాలి. అమెరికా శుభ్రమౌతుంది. ప్రజలు ఓట్లేస్తేనే కాదు, పేపర్లూ ఇష్టపడితేనే ఎవరైనా అమెరికా ప్రెసిడెంట్ అవుతారు అనే చట్టం లేదు కాబట్టి ఈ మాత్రమైనా మాట్లాడగలుగుతోంది అమెరికా.

'షిట్‌హోల్' అనడం ఏంటని వీళ్లందరి అబ్జెక్షన్! 'దేశాలన్నీ కలిసి నిర్మించిందే అమెరికా..' అని



అంటున్నవాళ్లు.. భాషలన్నీ కలిసిందే అమెరికన్ లాంగ్వేజ్ అని ఎందుకు అనుకోరు?

'షిట్‌హోల్' అని అంటే మాత్రం.. షిట్‌హోలే ఎందుకు కనిపించాలి ఈ డర్టీ డెమోక్రాట్స్‌కి. నా ఉద్దేశంలోని పారిశుద్ధ్యం వీళ్లకు అర్థం కాదా?

కడుపులో ఏదుంటే అదేగా వస్తుంది. మనిషన్నాక అదే రావాలి. ఇంకేదో రాకూడదు. కోపంలో కోపం రావడం, విసుగులో విసుగు రావడం నేచురల్. కోపంలో, విసుగులో కూడా నోట్లోంచి పూలగుత్తుల పరిమళాలు రావడం అన్ నేచురల్. ఈ డెమోక్రాట్‌లు, మీడియాక్రాట్‌లు అంతా అన్ నేచురల్. బయటి వాళ్లను ఇంట్లోకి పిలిచి, ఇంట్లోని వాళ్లను బయటికి తరిమేసే రకం.


అందర్నీ రానివ్వాలంటారు, అమెరికా డెవలప్ అవ్వాలంటారు! కుదురుతుందా? డెవలప్‌మెంట్ అంటే మనతో అవసరం ఉన్నవాళ్లు రావడం కాదు. మనకు అవసరం ఉన్నవాళ్లు రావడం. నేనన్నది ఈ మాటే. దాన్ని వదిలేసి, 'షిట్‌హోల్'ని పట్టుకున్నారు.

వీళ్లకూ తెలుసు.. అమెరికాకు అవసరమైన వాళ్లే అమెరికాకు కావాలని. ఆ మాట ధైర్యంగా చెప్పలేరు. ఒబామా చెప్పలేదు. వాషింగ్టన్ పోస్టూ చెప్పలేదు.

ఒక కంట్రీని నేను షిట్‌హోల్ అనుకున్నప్పుడు షిట్‌హోల్ అనే అంటాను. ఎందుకనుకున్నానో అడగడం మానేసి, ఎందుకన్నావ్ అని అడుగుతున్నారు! ఇంకోలా ఎలా అనగలను? 'దయచేసి నా షిట్‌హోల్ కంట్రీలోకి రాకండి' అనైతే అనలేను కదా.

అప్రియమైన మనుషుల్ని దూరంగా పెట్టడం కోసం ప్రియమైన పదాల్ని వెదుక్కునేంత టైమ్ ఉన్న అమెరికన్ ప్రెసిడెంట్‌ని కాదు నేను.

పారదర్శకత ముసుగులో..!



కరణ్ థాపర్

ఎలక్టోరల్ బాండ్ స్కీమ్‌కి చెందిన తాజా వివరాల ప్రకటనతో, రాజకీయ విరాళాలను ప్రక్షాళన చేయడానికి కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ చేపట్టిన చర్యలు తీవ్రమైన, విరుద్ధ స్పందనలను చూరగొన్నాయి. ఇది దీర్ఘకాలిక ప్రయోజనం కల్గించే పథకంలో తొలి చర్య అని జైట్లీ అభిమానులు పేర్కొనగా, జైట్లీ అసలు సమస్యను ఏమార్చుతున్నారని విమర్శకులు ఆరోపించారు.

కాబట్టి నిజం ఎక్కడ దాగినట్లు? జైట్లీ చర్యలను రెండు విధాలుగా పరీక్షించినట్లయితే, ఈ ప్రశ్నకు సమాధానం చెప్పడం సులభం. మొదటిది, ఆ చర్యలు రాజకీయ విరాళాలను ప్రక్షాళన చేస్తాయా? మరోలా చెప్పాలంటే, చట్టబద్ధమైన, పన్ను చెల్లించిన విరాళాలే అధిక నిష్పత్తిలో ఉంటాయా? ఇక రెండోది. రాజకీయ విరాళాలను ఇవి మరింత పారదర్శకంగా చేస్తాయా? అంటే వాటి గురించిన వివరాలు మనందరికీ సమగ్రంగా తెలుపుతారా?

ఎక్కడినుంచైనా, ఎవరినుంచైనా సరే రాజకీయ పార్టీ నగదు రూపంలో తీసుకునే విరాళాలను రూ. 20,000ల నుంచి రూ. 2,000కు తగ్గించాలని తీసుకున్న నిర్ణయం ఏరకంగా చూసినా రాజకీయ విరాళాలను ప్రక్షాళన చేసే కీలక చర్యే అవుతుంది. సరిగ్గా ఎన్నికల కమిషన్ కూడా అడిగింది ఇదే. అయితే జాగ్రత్తగా ఆలోచించండి. అప్పుడు మీకు తట్టే సమాధానం కాస్త భిన్నంగా ఉండవచ్చు. రాజకీయ పార్టీలు ఇప్పటికీ రూ. 2,000ల వరకు విరాళాలను తీసుకోవచ్చు, పైగా అవి గుప్తంగానే ఉంటాయి. విరాళాలు ఇచ్చిన వారి పేర్లు ప్రకటించరు. కాబట్టి ఇకపై రాజకీయ పార్టీలకు నగదు రూపంలో పెద్ద మొత్తాల్లో విరాళాలు వచ్చినట్లయితే, అవి రూ. 2,000లకంటే తక్కువ మొత్తంలోనే వచ్చాయని ప్రకటించవలసిన అవసరముంది.

ఎందుకంటే నగదురూపంలోని విరాళాలను చట్టవిరుద్ధంగా ప్రకటించలేదు. పైగా విరాళాలు ఇచ్చిన వారి పేర్లు బయటపెట్టరు కాబట్టి నగదురూపంలో స్వీకరించిన మొత్తం మారకుండా అలాగే ఉంటుంది. ఆ విరాళాలు రూ. 2,000ల కంటే తక్కువ మొత్తంలోనే వచ్చాయని ఇకనుంచి రాజకీయ పార్టీలు ప్రకటించవచ్చు. ఇందులో రాజకీయ విరాళాలను ప్రక్షాళన చేయడమూ లేదు. దీనిలో ఎలాంటి పారదర్శకతా లేదు. జైట్లీ ప్రకటించిన రెండో అతిపెద్ద చర్య, ఎలక్టోరల్ బాండ్‌ల రూపకల్పన. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలు జారీ చేసే ఈ బాండ్‌లు చెక్ లేదా డిజిటల్ పేమెంట్ రూపంలో ఉంటాయి. వీటిని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ఖాతాలకు చెల్లించడానికి వీలుంటుంది. దీంట్లో కూడా విరాళాలు ఇచ్చిన వారి పేర్లు వెల్లడించరు. మొదట చూడగానే ఇది గొప్ప ఆలోచన అనిపిస్తుంది. కాని ఇది నిజమేనా?

మొదట, నిజాయితీగా చెప్పాలంటే, రాజకీయ విరాళాలను నూటికి నూరుపాళ్లు ప్రక్షాళన చేయవచ్చని జైట్లీ హామీ ఇచ్చారు. ఎందుకంటే బాండ్లను చెక్ లేదా డిజిటల్ చెల్లింపు ద్వారా తీసుకుంటారు. అయితే ఇవి నల్లధనంతో కాకుండా పన్ను చెల్లించిన రూపంలోనే ఉంటాయి. అయ్యో, ఈ కథనం రెండో సగం మరీ భిన్నమైనది. ఎందుకంటే విరాళాలు ఇచ్చేవారి పేర్లు గుప్తంగా

ఆదిత్య హృదయం



ఉంచేటట్టు హామీ ఇచ్చారు. దీంట్లో పారదర్శకతే ఉండదు. పైగా, ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలకు విరాళాలు ఎవరిస్తున్నారు, ఎంతమొత్తం ఇస్తున్నారు అని తెలుసుకునే హక్కును ఇది సూత్రబద్ధంగానే ఉల్లంఘిస్తోంది.

విషాదకరమైన సత్యం ఏమిటంటే, ఇలాంటి చర్య చేపట్టడం ద్వారా అరుణ్ జైట్లీ వాస్తవానికి ఇప్పటివరకు ఉన్న పారదర్శకతను కూడా తొలగించేశారు. ఇంతవరకు రూ. 20,000లకు పైబడిన విరాళాలు అన్నింటినీ పార్టీలు బహిరంగపర్చాల్సి ఉంటుంది. అంటే ఈ విరాళాలు ఇచ్చిన వారి పేర్లను వెల్లడించాల్సి ఉంటుంది. ఇప్పుడు వ్యక్తులు లేక కంపెనీలు ఇచ్చే విరాళాలను (రూ.2,000 లేక 20 లక్షలు, రూ. 20 లక్షలు లేక 200 కోట్లు అయినా సరే) బయటకు వెల్లడించరు. ఇది నిస్సందేహంగా ప్రమాదకరమైన తిరోగమన ఫలితమే అవుతుంది.

ఇక్కడ మరొక ఘోరమైన అంశం ఉంది. అరుణ్ జైట్లీ కార్పొరేట్ విరాళాలు, పారిశ్రామిక వేత్తల విరాళాలపై పన్నును ఎత్తివేయడంతో భారీ మొత్తాలను గుప్తంగానే ఇవి రాజకీయ పార్టీలకు చెల్లించే అవకాశం ఉంది. దీనికి ప్రతిగా ఇక్కడే క్విడ్ ప్రొ కో (నీకిది నాకిది) దాగి ఉంది. ఒక విషయం గుర్తుంచుకోండి. భారత దేశంలో రాజకీయ పార్టీలకు విరాళాల వంటివి ఇచ్చి ప్రతిఫలం పొందుతున్న ఘటనల్లో ఏ ఒక్కదాన్నీ ఎవరూ రుజువు చేయలేరు. అంటే వాస్తవానికి జైట్లీ ప్రకటించిన చర్యలు మరింత అవినీతిని పెంచి పోషిస్తాయి తప్పితే తగ్గించలేవు.

అత్యంత సందేహాస్పదమైన విషయం ఏమిటంటే, ఇవి జైట్లీ అనుకోకుండా విస్మరించి, ఉపేక్షించిన విషయాలు కావు. జైట్లీ వాస్తవ ఉద్దేశం ఇదేనని నమ్మడానికి విశ్వసనీయ ఆధారాలు కూడా ఉన్నాయి. 2017 బడ్జెట్ సమావేశంలో జైట్లీ చెప్పారు. ''తమ ఉనికిని బయటపెడతాయి కాబట్టి చెక్ లేదా ఇతర పారదర్శక విధానాల ద్వారా విరాళాలు ఇవ్వడానికి విరాళకర్తలు విముఖత వ్యక్తం చేశారు'' అంటే పారదర్శకతను పణంగా పెట్టి విరాళకర్తల ఉనికిని కాపాడటానికే జైట్లీ ఈ విధానాన్ని ఎంచుకున్నట్లు కనబడుతోంది.

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయులు
ఈ-మెయిల్ : karanthapar@itvindia.net

భీకర రికార్డులు - ఘోర పరాజయాలు

స్వదేశంలో ప్రపంచ రికార్డులనే బద్దలు చేసి పడేసే మన బ్యాట్స్‌మెన్ విదేశాల్లో బౌన్సీ వికెట్ల ముందు సాగిలపడిపోతుంటారు. కారణం మనం బ్యాటింగ్ పిచ్‌లను రూపొందించుకోవడమే. మేటి బ్యాట్స్‌మెన్‌లకు నెలవుగా ఉండే భారత జట్టు మేటి బౌలర్ల విషయంలో వెనుక చూపు చూస్తుండటం తెలిసిందే. రెండో తరగతి పౌరులుగా దిగజార్చివేసినప్పటికీ, మన బౌలర్లు చక్కటి ప్రదర్శన చేసినప్పుడే మనకు విదేశీ విజయాలు లభిస్తుంటాయి. బలహీన బౌలింగ్ పరిస్థితిని మార్చాలంటే మన మౌలిక వ్యవస్థలో మార్పుతోటే ప్రారంభించాల్సి ఉంది.

అవలోకనం



ఆకార్ పటేల్

దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టెస్టు మ్యాచ్‌ను నేను అంత ఎక్కువగా చూడలేకపోయాను. అది ఒకందుకు మంచిదే అయింది. నేను క్రికెట్ ప్రేమికుడిలా నటిస్తుంటాను కానీ నా జాతీయవాదమే నన్ను ఆటను చూసేలా చేస్తుంటుంది. భారత్ ఓడిపోతున్నప్పుడు నేను ఆటను చూడలేను. మన జట్టు ఇప్పుడు అంత బలహీనమైన జట్టేమీ కాదు. జట్టు పని తీరుకు ఏమాత్రం తగని విధంగా జాతీయ జట్టుకు మనం పూర్తి మద్దతు ఇచ్చిన రోజులు నాకు గుర్తున్నాయి. ఇప్పుడు అలాంటి స్థితి లేదు.

తొలి టెస్టు మ్యాచ్‌లో నాలుగో రోజు ఆటలో కొన్ని సందర్భాల్లో మనమే గెలిచినట్లు కనిపించిది. కానీ బౌన్సీ వికెట్ ముందు మన బ్యాట్స్‌మెన్ తలవంచారు. దక్షిణాఫ్రికాలో బౌన్సీ వికెట్ ఉండటం కొత్తేమీ కాదు. రెండో టెస్టు కూడా ప్రారంభమైనందున కొన్ని అంశాలను పరిశీలిద్దాం. అతి ముఖ్యమైన విషయం ఏమిటంటే భారత్ ఎల్లప్పుడూ బ్యాటింగ్ ప్రాతిపదిక గల జట్టుగానే ఉంటూ వచ్చింది.

మన మేటి క్రికెటర్ల పేర్లు చెప్పాల్సి వస్తే, గవాస్కర్, టెండూల్కర్, కోహ్లీ లను ప్రస్తావించాలి. పాకిస్తానీయులు కూడా ఇమ్రాన్, వసీమ్, వకార్ గురించి చెప్పుకుంటారు. కానీ గొప్ప బ్యాట్స్‌మెన్‌తో పోలిస్తే గొప్ప బౌలర్లు అరుదుగానే ఉంటారు. ఆయా దేశాల జట్లకు చెందిన 11మంది ఆల్‌టైమ్ ఆటగాళ్ల జాబితాను రూపొందించడానికి ప్రయత్నించినప్పుడు ఇది స్పష్టమవుతుంది. ఉపఖండానికి పరిమితమైతే.. నేను పాక్ జట్టును ఇలా చూస్తాను: హనీఫ్ ముహమ్మద్, సయీద్ అన్వర్, జహీర్ అబ్బాస్, జావిద్ మియాందాద్, ఇంజమామ్ ఉల్ హక్, యూనిస్ ఖాన్, రషీద్ లతీఫ్, ఇమ్రాన్ ఖాన్, వసీమ్ అక్రమ్, వకార్ యూనిస్, షోయబ్ అక్తర్. ఇక భారత్ జట్టు కూర్పును నేను ఇలా చూస్తాను: గవాస్కర్, సెహ్వాగ్, కోహ్లీ, టెండూల్కర్, ద్రావిడ్, గంగూలీ, ధోనీ, కపిల్ దేవ్, కుంబ్లే, శ్రీనాథ్, జహీర్.

ఈ రెండు జట్లలో మరింత సమతుల్యతతో, ఆడేందుకు కష్టమైన జట్టు ఏది? (కనీసం కాగితంమీద అయినా) మనది మాత్రం కాదు. రెండు జట్ల మధ్య తేడా ఏమిటంటే, మన బౌలింగ్ బలహీనమైనది. భారత్‌లో బ్యాట్స్‌మెన్ కంటే శ్రమించే బౌలర్లు తక్కువగా ఉంటారు. ఇక్కడ ఆట ఆడే విషయంలో రెండో అంశం కూడా ఉంది. ఎందుకంటే మనది బ్యాటింగ్ ప్రధాన జట్టు. మనం బ్యాట్స్‌మెన్‌కి అనుకూలమైన వికెట్లను, పిచ్‌ని తయారు చేస్తాము. 2009లో క్రిక్‌ఇన్ఫో వెబ్‌సైట్ కోసం రాసిన వ్యాసంలో ఎస్. రాజేష్ మన వికెట్లు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించవంటూ



గణాంకాలతో సహా వివరించారు. భారత్‌లో 40 శాతం టెస్టులు డ్రాగా ముగుస్తాయి. కాగా, దక్షిణాఫ్రికాలో మాత్రం 7 శాతం టెస్టులు మాత్రమే డ్రాగా ముగుస్తాయి. ఆస్ట్రేలియాలో చూసినా డ్రాలు 11 శాతం మాత్రమే.

భారత్‌లో భారీ స్కోర్లు అసాధారణం కాదు. దక్షిణాఫ్రికాతో తొలి టెస్టులో రెండు పక్షాలూ తమ తొలి ఇన్నింగ్స్‌లో తలొక 200 పరుగులు చేశాయి. మన గడ్డపై తొలి ఇన్నింగ్స్‌లో ఇలాంటిది ఎన్నడూ సంభవించదు. మన మైదానాల్లో బౌలర్లు ఇలాంటి ఫలితాన్ని సాధించే అవకాశమే ఉండదు. అందుకే తొలి టెస్టులో మనం ఓడిపోయిన తరహా పిచ్‌లను స్పోర్టింగ్ వికెట్లు అంటుంటారు. బౌలర్లకు కూడా ఫలితాలు చూపే అవకాశం ఇస్తాయి కాబట్టే వాటిని స్పోర్టింగ్ వికెట్లు అంటుంటారు. ఉదాహరణకు 2000-2010 మధ్య దశాబ్ద కాలంలో టెస్టులలో బౌలర్లకు చక్కగా ఉపయోగపడిన 10 మైదానాలను లెక్కించినట్లయితే, వీటిలో ఒక్కటంటే ఒక్క భారతీయ మైదానం కూడా లేదు. మరోవైపున, తొలి ఇనింగ్స్‌లో సగటున భారీ స్కోరు సాధించిన 10 మైదానాల్లో భారత్‌కి చెందినవి మూడు ఉన్నాయి: కోల్‌కతా, బెంగళూరు, మొహాలీ.

ఈ పరిస్థితులే భారత జాతీయ జట్టును బౌలింగ్‌లో బలహీనంగానూ, బ్యాటింగులో బలమైన జట్టుగానూ రూపొందించాయి. కానీ ఆ బ్యాటింగ్ బలం కూడా సొంత మైదానాల్లోనే ఉంటుంది. భారతీయులలో అనేకమంది స్పిన్నర్లను, మందకొడి వికెట్లను చూసేందుకు ఇష్టపడరని చెప్పగలను. కానీ నాతోపాటు చాలామందిని తొలి సెషన్ పూర్తిగా, ఆ తర్వాత కూడా బౌన్సీ వికెట్‌పై దూసుకొచ్చే బంతులను చూస్తుండటమే బాగా ఉద్వేగపరుస్తుంటుంది.

మరొక అంశమేదంటే, నిజమైన ఫాస్ట్ బౌలర్ మంచి బ్యాట్స్‌మెన్‌ని ఇబ్బంది పెడుతుండటం. శ్రీలంక లేదా భారత్‌లో మ్యాచ్‌ను చూడటం కంటే ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికాల్లో ప్రమాదకరంగా ఉండే బౌన్సీ వికెట్‌ను చూడటం పూర్తి భిన్నంగా ఉంటుంది. బ్యాట్స్‌మెన్ గాయపడటాన్ని నేను చూడాలనుకోను ఆటలో ఉద్వేగం తీసుకొచ్చేది ఇదే. కానీ భారత్‌లో ఇలాంటిది అస్సలు కనబడదు. ఒక అంశంలో మనం నిజాయితీగా ఉందాం. భారత్‌లో టెస్టు క్రికెట్ చూడటం విసుగ్గానూ, చాలా వరకు చూడటానికి అననుకూలంగానూ ఉంటుంది.

ఈ పరిస్థితిని మార్చాలంటే మన మౌలిక వ్యవస్థలో మార్పుతోటే ప్రారంభించాలి. బీసీసీఐ ప్రపంచంలోనే అతి సంపన్నమైన సంస్థ అయినప్పటికీ దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌తో పోలిస్తే మన స్టేడియంలు పరమ చికాకును కలిగిస్తాయి. ఢిల్లీలోని ఫిరోజ్ షా కోట్లా గ్రౌండ్ అయితే ప్రపంచంలో అత్యంత భయంకరమైన స్టేడియం. ఇది పూర్తిగా సిమెంట్ దూలాలతో ఉండటమే కాకుండా ప్రతిచోటా ప్రకటనలే కనిపిస్తుంటాయి. మనకు ఎలాంటి క్రికెట్ కావాలో వికెట్లే నిర్ణయిస్తుంటాయి. మనం మీడియం పేస్ బౌలర్లు లేక స్పిన్నర్లను కోరుకుంటున్నామా లేక ఊపిరిని బిగబట్టేలా చేసే ఫాస్ట్ బౌలర్లను కోరుకుంటున్నామా లేక వాంఖడే, ఈడెన్ గార్డెన్స్‌లో రికార్డులను భీకరంగా బద్దలు చేస్తూనే, దక్షిణాఫ్రికా బౌలింగ్‌లో కొన్ని ఓవర్లను కూడా తట్టుకోలేని బ్యాట్స్‌మెన్‌ను కోరుకుంటున్నామా?

మొదటే చెప్పినట్లుగా, నేను భారత క్రికెట్ జట్టు ప్రేమికుడినే కాని క్రికెట్ ఆట ప్రేమికుడిని కాదు కాబట్టే నేను క్రికెట్ ఆటను చూస్తుంటానని నా అనుమానం. ఏదేమైనా ఇప్పుడు జరుగుతున్న రెండో టెస్టును, అలాగే సిరీస్‌ను కూడా మనం గెలుచుకుంటామని ఆశిస్తాను. కానీ అలా గెలిచినప్పటికీ, అదెలా సాధ్యపడుతుందంటే, రెండో తరగతి పౌరులుగా దిగజార్చివేసినప్పటికీ, మన బౌలర్లు చక్కగా ఆడినందుకే అయి ఉంటుంది.

వ్యాసకర్త కాలమిస్టు, రచయిత I a

ట్రంప్ లీలలు

డొనాల్డ్ ట్రంప్‌ను ఇరుకున పెట్టే వార్తలు అమెరికా పత్రికలు ఇప్పటికీ వడ్డిస్తూనే ఉన్నాయి. వాల్‌స్ట్రీట్ జర్నల్ పత్రికలో రెండురోజుల క్రితం వచ్చిన వార్త కూడా అలాంటి హాట్ కేక్ కిందే లెక్క. అయితే యథావిధిగా ఈ వార్తను కూడా డొనాల్డ్ ట్రంప్ వర్గం తీవ్ర స్వరంతో ఖండించడం జరిగింది. 2016 అధ్యక్ష ఎన్నికల సమయంలో ట్రంప్‌ను ఇరకాటంలో పెట్టకుండా ఉండేందుకు నీలి చిత్రాలలో నటించే ఒక స్టార్‌కు డాలర్లు ముట్టాయని వాల్‌స్ట్రీట్ ఆరోపించింది. మైఖేల్ కోహెన్ అనే తన లాయర్ చేత ట్రంప్ గారు స్టీఫైన్ క్లిఫోర్డ్ అనే ఆ 'పోర్న్ స్టార్'కు ఆ మొత్తం అందచేసే ఏర్పాటు చేశాడని ఆ వార్త సారాంశం. ఈ డబ్బు క్లిఫోర్డ్ అకౌంట్‌లోకి ఎలా వెళ్లిందో మాత్రం ఇంకా తేలలేదు. ఎందుకంటే ఆ బ్యాంక్ నుంచి వివరాలు అందడం లేదు. ఆ స్టార్‌ను ట్రంప్ 2006లో కలుసుకున్నారని చెబుతున్నారు.

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం
దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్య మాసం
తిథి బ.త్రయోదశి రా.2.48 వరకు, తదుపరి
చతుర్దశి, నక్షత్రం జ్యేష్ఠ ప.2.10 వరకు, తదుపరి
మూల, వర్జ్యం రా.11.01 నుంచి 12.47 వరకు
దుర్ముహూర్తం సా.4.10 నుంచి 4.55 వరకు
అమృతఘడియలు... లేవు, భోగి పండుగ.

నమాజ్ వేళలు

ఫజర్	:	5.33
జొహర్	:	12.25
అసర్	:	4.25
మగ్రీబ్	:	6.01
ఇషా	:	7.17

సూర్యోదయం : 6.38
సూర్యాస్తమయం : 5.40
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 270 1083

సాక్షి
రాష్ట్రీయం
వైఎస్ఆర్ జిల్లా
ఆదివారం | జనవరి | 14 | 2018
www.sakshi.com


రోబో కారు వచ్చేస్తోంది!





వైర్‌లెస్ ఫోన్లు.. ట్యూబ్‌లెస్ టైర్లు.. డ్రైవర్‌లెస్ కార్లు.. ఇవన్నీ ఇప్పటికే వీటి గురించి వినే ఉంటాం. ఇప్పుడు కొత్త రకం కార్లు అందుబాటులోకి రానున్నాయి. అవే స్టీరింగ్ లెస్.. పెడల్ లెస్ కార్లు.. అదేనండి స్టీరింగ్.. పెడల్స్.. లేని కార్లన్న మాట. పూర్తి ఆటోమేటిక్‌గా ఈ కారు రయ్‌మని దూసుకుపోతుందన్న మాట. అమెరికాకు చెందిన జనరల్స్ మోటార్స్ అనే కంపెనీ స్టీరింగ్ లెస్ కార్లను భారీగా తయారు చేస్తోందని ప్రకటించింది. వచ్చే ఏడాది వీటిని రోడ్లపై తిప్పేందుకు అనుమతివ్వాలంటూ అమెరికా ప్రభుత్వానికి అర్జీ కూడా పెట్టుకుంది. క్రూజ్ ఏవీ అని పిలిచే ఈ కార్లలో సకల సదుపాయాలున్నాయని సదరు కంపెనీ చెబుతోంది. ఇది డ్రైవర్‌తో సంబంధం లేకుండా ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుస్తుందట. డ్రైవర్ సీటులో కూడా ప్రయాణికుడు కూర్చుని ఎంచక్కా వెళ్లిపోవచ్చన్న మాట. ఆఖరికి ప్యాసింజర్ కోరుకుంటే కారు అద్దాలను కూడా ఆటోమేటిక్‌గా తీస్తుందని కంపెనీ ప్రెసిడెంట్ డ్యాన్ అమ్మాన్ వివరించారు.

5 సుప్రీం కోర్టు భవనం మధ్య భాగంలో ప్రధానన్యాయమూర్తి చాంబర్స్ ఉంటాయి. కుడివైపు అటార్నీ జనరల్, న్యాయాధికారుల కార్యాలయాలుంటాయి. ఎడమవైపు కోర్టుకు సంబంధించిన కార్యాలయాలు ఉంటాయి.



పోలీసులకు సంక్రాంతి సెలవుల్లేవ్

సాక్షి, అమరావతి: పోలీసులకు సంక్రాంతి పండుగ మూడు రోజులు సెలవుల్లేవని, ఇప్పటికే సెలవులో ఉన్నవారు కూడా విధులకు హాజరుకావాల్సిందేనని జిల్లా ఎస్పీల ఆదేశాలతో పోలీసులు కలత చెందుతున్నారు. కోడిపందాల నేపథ్యంలో రాష్ట్రంలో 13 జిల్లాల్లోని పోలీసులకు సెలవులు రద్దు చేస్తూ పోలీస్ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. భోగి, సంక్రాంతి, కనుమ మూడు రోజులు సెలవులు పెట్టడానికి వీలులేదని శుక్ర, శనివారం అన్ని జిల్లాల ఎస్పీలు సెట్ (వైర్‌లెస్) కాన్ఫరెన్స్‌లో ఆదేశాలు జారీ చేయడంతోపాటు నోటీసులు కూడా ఇచ్చారు. కొత్త అల్లుళ్లకు తొలి పండుగైన సంకాంత్రికి అందుబాటులో లేకుండా విధుల్లో పాల్గొనాల్సిందేనని చెప్పడంతో వారు ఆవేదనకు లోనవుతున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో సిక్ లీవ్‌లో ఉన్న పోలీసులు కూడా శనివారం విధుల్లో చేరినట్టు తెలిసింది. సంక్రాంతి పెద్ద పండుగని, అందరూ బంధుమిత్రులతో ఆనందంగా గడుపుతారని తాము మాత్రం కోడిపందాలు, బందోబస్తు పేరుతో రోడ్డుపై ఉండాలని కానిస్టేబుళ్లు వాపోతున్నారు.

ఇష్టపడి చదివితేనే లక్ష్యాన్ని సాధిస్తారు

విజయవాడ మున్సిపల్ కమిషనర్ జె.నివాస్



సాక్షి, అమరావతి: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితేనే అనుకున్న లక్ష్యాలను చేరుకుంటారని విజయవాడ మున్సిపల్ కమిషనర్ జె.నివాస్ చెప్పారు. అమరావతిలోని వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (విట్)లో స్వచ్ సర్వేక్షన్–2018పై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తాను కూడా విట్ కాలేజీలోనే విద్యనభ్యసించినట్లు చెప్పారు. ఇష్టపడి చదవడం వల్లే తాను ఐఏఎస్ అయ్యాయని పేర్కొన్నారు. విట్‌లో చదువుకొని తిరిగి అదే కాలేజీకి ఐఏఎస్‌గా రావటం ఆనందంగా ఉందన్నారు. విజయవాడను అందమైన నగరంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విట్ ఏపీ రిజిస్ట్రార్ సీఎల్వీ శివకుమార్ పాల్గొన్నారు.

బరిలో కోడ్ఢీ

- కోర్టు ఆదేశాలు, పోలీసుల ఆంక్షలు బేఖాతరు
- పలుచోట్ల తెలుగుదేశం నేతల నేతృత్వం
- కృష్ణా జిల్లాలో టీడీపీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్, ఎమ్మెల్సీ వైవీబీ సమక్షంలో ప్రారంభం
- మద్యం విక్రయాలకు, గుండాటకు జోరుగా ఏర్పాట్లు



గొడవర్రులో కోడిపందేలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ వైవీబీ, జెడ్పీటీసీ సభ్యుడు గొంది శివరామకృష్ణప్రసాద్

ఏలూరు టౌన్, అమలాపురం, కంకిపాడు(పెనమలూరు): పోటీలకు పందెం కోడి కత్తులు దూస్తోంది! పశ్చిమ, తూర్పు గోదావరి, కృష్ణా, గుంటూరు తదితర జిల్లాల్లో బరులు సిద్ధమయ్యాయి. న్యాయస్థానం ఆదేశాలు, పోలీస్ ఆంక్షలను ధిక్కరిస్తూ కృష్ణా జిల్లాలో టీడీపీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్, ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ పండుగకు ఒకరోజు ముందే కోడి పందేలకు అంకురార్పణ చేశారు. భారీగా డబ్బులు చేతులు మారటంతో బరులు పందెంరాయుళ్లతో నిండిపోయాయి. మరోవైపు ఉప ముఖ్యమంత్రి, హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప సొంత నియోజకవర్గంలోనూ కోడి పందేలకు ఏర్పాట్లు జోరందుకున్నాయి.

- పశ్చిమ గోదావరి జిల్లా ఉండి నియోజకవర్గంలోని కాళ్ళ, ఉండి, పాలకోడేరు, ఆకివీడులో మూడురోజుల పాటు కోడి పందేలు నిర్వహించేందుకు రంగం సిద్ధమయ్యింది.
- తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో సుమారు 22 బరులు పోటీలకు సిద్ధం చేశారు.
- చింతలపూడి, పోలవరం, గోపాలపురం, పాలకొల్లు, నిడదవోలు నియోజకవర్గాల్లోనూ బరులలో కోలాహలం నెలకొంది.
- తూర్పు గోదావరి జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్లలో ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు కనుసన్నలో పందేలు నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేశారు. కోడిపందేల కోసం మైదానాన్ని తీర్చిదిద్దడంతోపాటు గ్యాలరీ, ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేశారు. ప్రేక్షకుల కోసం ఏకంగా ఎల్సీడీ టీవీలు అమర్చటం గమనార్హం.
- ఉప ముఖ్యమంత్రి, హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప సొంత నియోజకవర్గం పెద్దాపురం మండలం వేట్లపాలెంలో కోడిపందేల నిర్వహణకు పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు.
- అల్లవరం మండలం గోడి, మలికిపురం, లక్కవరం, రాజనగరం మండలం రాజానగరంలో పుణ్యక్షేత్రం, దివాన్ చెరువు ప్రాంతాల్లో రూ.కోటి వరకు పందేలు కాసేందుకు సిద్ధపడుతున్నారు.
- అనపర్తి సమీపంలోని ముక్కినాడల వద్ద పందేల్లో రోజుకు కోటి వరకు జూదం జరగనుంది. మురమళ్ల లాంటి ప్రాంతాల్లో పందేనికి రూ.50 లక్షల వరకు కాసేవారున్నారు. మురమళ్లలో కోడిపందేలు జరిగే ప్రాంతానికి సమీపంలో గుండాట నిర్వహించేందుకు ఓ వ్యక్తి రూ.50 లక్షలకు వేలం పాట పాడాడు.
- వేట్లపాలెం, పుణ్యక్షేత్రం తదితరచోట్ల రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు వేలం జరిగిందని సమాచారం.
- తాత్కాలికంగా ఏర్పాటు చేసే మద్యం బెల్ట్‌షాపుల ద్వారా కూడా పెద్ద ఎత్తున డబ్బు సంపాదించేందుకు నిర్వాహకులు సిద్ధమయ్యారు.
- గుంటూరు జిల్లాలో బాపట్ల నియోజకవర్గం కర్లపాలెం, రేపల్లె నియోజకవర్గం చెరుకుపల్లిలో కోడి పందేల కోసం ఏర్పాట్లు చేస్తున్నారు.



ఈడుపుగల్లులో ఏసీపీ రమణమూర్తితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పందేలు కాసినా, కత్తులు కట్టినా కేసులు తప్పవు: ప.గో ఎస్పీ

బరిలోకి దించితే పందెంకోళ్లను స్వాధీనం చేసుకుంటామని. బెట్టింగ్‌లు కడితే అరెస్టులు చేస్తామని పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ ఎం.రవిప్రకాష్ హెచ్చరించారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కోడిపందేలు నిర్వహించవచ్చని సర్వోన్నత న్యాయస్థానం ఎక్కడా అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. కోళ్ల పెంపకందారులు, రైతులను అరెస్ట్ చేయవద్దని, కోళ్ల పెంచే ప్రాంతాల్లోకి పోలీసులు వెళ్ళవద్దని కోర్టు చెప్పిందన్నారు. కానీ పందేలు కాసినా, కత్తులు కట్టినా, జూదమాడినా కేసులు పెడతామని హెచ్చరించారు. 55 బరులకు సంబంధించి నోటీసులు జారీ చేశామని తెలిపారు. బరులను గుర్తించేందుకు 60 సంయుక్త బృందాలు తనిఖీలు చేస్తున్నాయని చెప్పారు. జిల్లాలో కనీసం డింకీ పందాలకు కూడా అనుమతులు లేవన్నారు. తమపై ఏవిధమైన రాజకీయ ఒత్తిడి లేదని స్పష్టం చేశారు.

పెనమలూరులో 'తొలిపందెం'!

కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గంలో కోర్టు ఉత్తర్వులు, పోలీసుల ఆదేశాలను పక్కనపెట్టిన అధికార పార్టీ ప్రజాప్రతినిధులు కోడిపందేలు నిర్వహించి పంతం నెగ్గించుకున్నారు. శనివారం ఈడుపుగల్లులో టీడీపీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సమక్షంలో పందేలు జరిగాయి. గొడవర్రులో ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ లాంఛనంగా కోడిపందేలను ప్రారంభించారు. ముందు కత్తులు లేకుండా పందేలను ప్రారంభించి తరువాత కోళ్లకు కత్తులు కట్టి పందేలను కొనసాగించారు. ఈ సందర్భంగా భారీగా పందేలు కాయటంతో రూ.లక్షల్లో నగదు చేతులు మారింది.

న్యాయవ్యవస్థ సంక్షోభానికి మోదీనే కారణం

సుప్రీం జడ్జీల ఆరోపణలపై విచారణకు నారాయణ డిమాండ్



సాక్షి, అమరావతి: న్యాయవ్యవస్థలో ఏర్పడిన సంక్షోభానికి ప్రధాని నరేంద్రమోదీ కారణమని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ధ్వజమెత్తారు. దేశచరిత్రలో మొదటిసారిగా న్యాయవ్యవస్థలో తిరుగుబాటు రావడం దురదృష్టకరమేనని, అయితే పరిణతి కలిగిన నలుగురు న్యాయమూర్తులు తమ పరిధిని దాటి ఆవేదన వ్యక్తం చేయడం వెనుక కారణాలు తెలుసుకునేందుకు ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. శనివారం విజయవాడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జస్టిస్ చలమేశ్వర్‌సహా నలుగురు న్యాయమూర్తులు ఏకంగా చీఫ్ జస్టిస్‌పై రాతపూర్వకంగా, మీడియాద్వారా తమ ధిక్కార స్వరాన్ని వినిపించడం లీగల్‌గా, టెక్నికల్‌గా సరికాదన్నారు. అయితే ఎంతగానో ఆవేదన చెందినందువల్లనే అగ్నిగోళం బద్దలైనట్టు తమ బాధను వ్యక్తం చేశారన్నారు. సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసును చేపట్టిన సీబీఐ స్పెషల్ జడ్జి లోయా మరణం మిస్టరీగా మార్చేయడం వెనుక అమిత్‌షా హస్తముందన్నారు.

మోదీతో సీఎం భేటీ వివరాలను పీఎంఓ వెల్లడించాలి: రామకృష్ణ

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీతో సీఎం చంద్రబాబు భేటీ వివరాలను ప్రధానమంత్రి కార్యాలయం(పీఎంఓ) వెల్లడించాలని కోరారు. సీఎం చంద్రబాబు ప్రధానిని ఏం కోరారో చెప్పారే తప్ప ప్రధాని ఏం ఇస్తానని హామీ ఇచ్చారో చెప్పలేదని, వీటిపై పీఎంఓ వివరాలు వెల్లడించాలన్నారు.

నింగీ నేలను కలుపుతూ..

అట్టహాసంగా ప్రారంభమైన కైట్ ఫెస్టివల్



సాక్షి, హైదరాబాద్: రంగు రంగుల పతంగులు రకరకాల ఆకృతులతో నింగీ నేలను కలుపుతూ రివ్వున ఎగిరాయి.. ఆకాశానికి నిచ్చెన వేశారా అనిపించేలా గాలి పటాలు దూసుకుపోయాయి.. వందలాది పతంగులు ఒకేసారి గాలిలోకి ఎగిరి అద్భుతాన్ని ఆవిష్కరించాయి. శనివారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రారంభమైన అంతర్జాతీయ పతంగుల పండుగ సందర్భంగా కనిపించిన దృశ్యాలివీ. ఉదయం ప్రారంభమైన ఈ కైట్ ఫెస్టివల్ రాత్రి వరకు కొనసాగగా.. తొలిరోజు దాదాపు 50 వేల మంది నగరవాసులు తిలకించారు. దేశ విదేశాల నుంచి వచ్చిన పతంగుల పోటీదారులతో పరేడ్ మైదానమంతా కోలాహలంగా మారింది.





రామచంద్రాపురం వద్ద వైఎస్.జగన్ అడుగులో అడుగేస్తున్న అశేష జనవాహిని. అభివాదం చేస్తున్న జగన్

ప్రజాసంకల్ప యాత్ర



61 రోజు

ఇప్పటి వరకూ నడిచిన దూరం **841.7** కి.మీ

61 వ రోజు నడిచిన దూరం **11.7** కి.మీ

ప్రారంభం: ఉ. 8.30 గంటలకు, కుప్పంబాదూరు నుంచి

ముగింపు

సా. 6 గంటలకు, నెన్నూరు

ముఖ్యాంశాలు

- కుప్పంబాదూరు, ఒడ్డుకాల్వ, సూరావారిపల్లి క్రాస్, బలిజపల్లి, పీవీ పురం, రామిరెడ్డిపల్లి, గంగిరెడ్డిపల్లిక్రాస్, కమ్మకండ్రిగ, లక్ష్మీనగర్, నడవలూరు, పాతకందులవారిపల్లిల్లో పాదయాత్ర, జనంతో మమేకం.
- రామచంద్రాపురంలో బహిరంగసభ

నేటి పాదయాత్ర షెడ్యూల్

ప్రారంభం: ఉ. 8.30 గంటలకు, నెన్నూరు బస నుంచి

ముఖ్యాంశాలు

నెన్నూరు, శెట్టివారిపల్లి క్రాస్, కట్టకింద వెంకటాపురం, వెంకటాపురం క్రాస్, చల్లావారిపల్లి, సొరకాయలపాలెం క్రాస్, మద్దూరుపల్లి, పులికుంట, కమ్మపల్లి క్రాస్, దేశూరికండ్రిగ, రావిళ్లవారిపల్లి, పారకాల్వక్రాస్ గ్రామాల్లో పాదయాత్ర, జనంతో మమేకం.



ఒడ్డుకాలువ వద్ద అవ్వ సాలెమ్మను ఆప్యాయంగా పలకరిస్తున్న జగన్



పాత కందులవారిపల్లె వద్ద విద్యుత్ దీపాలంకరణతో ఏర్పాటు చేసిన వైఎస్సార్, జగన్ చిత్రాలు

పింఛన్లు ఇప్పుడు గుర్తుకొచ్చాయా?

▶ మొదటి పేజీ తరువాయి

భారీ బహిరంగ సభలో జగన్ ప్రసంగించారు. చెడిపోయిన రాజకీయ వ్యవస్థలో విశ్వసనీయత, నిజాయతీని తీసుకొచ్చేందుకు తాను తలపెట్టిన పాదయాత్రకు ప్రజలందరి ఆశీర్వాదం కావాలని కోరారు. వైఎస్ జగన్ ఇంకా ఏం మాట్లాడారంటే.. పాదయాత్రలో వేలాది మంది ప్రజలు, అభిమానులు నాతో అడుగులో అడుగు వేస్తున్నారు. తమ సమస్యలు, బాధలు చెప్పుకుంటున్నారు. అర్జీలు అందజేస్తున్నారు. మరోవైపు నా భుజం తట్టి, అన్నా.. మేమంతా నీ వెనుకే ఉన్నామంటూ భరోసా ఇస్తున్నారు. భరోసా ఇవ్వడానికి వచ్చిన నాకే జనం భరోసా ఇస్తుండడం సంతోషం కలిగిస్తోంది. దాదాపు నాలుగేళ్లుగా చంద్రబాబు నాయుడి పాలనను మనమంతా చూస్తున్నాం. ఈ నాలుగేళ్లలో మీలో ఏ ఒక్కరైనా సంతోషంగా ఉన్నారా? అని అడుగుతున్నా. ఎవరూ సంతోషంగా లేని పరిస్థితులు కనిపిస్తున్నాయి. రైతన్నలు, అక్కాచెల్లెమ్మలు, అవ్వాతాతలు, చదవుకుంటున్న పిల్లలు, నిరుద్యోగులు.. ఇలా ఒక్కరు కూడా సంతోషంగా లేరు.

మంత్రిగా ఉండి ఓడిపోయారు

చంద్రగిరి నియోజకవర్గానికి ఒక ప్రత్యేకత ఉంది. చంద్రబాబు నాయుడు ఈ నియోజకవర్గంలోనే పుట్టారు. 1978లో ఆయన ఇక్కడి నుంచే పోటీ చేశారు. కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2,500 ఓట్ల మెజారిటీతో గెలిచారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి చలవ వల్ల కాంగ్రెస్ ప్రభుత్వంలో చంద్రబాబు మంత్రి అయ్యారు. ఐదేళ్లు పదవిలో కొనసాగారు. మళ్లీ 1983లో ఎన్నికలు జరిగితే 17,500 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ఐదేళ్లు మంత్రి పదవిలో ఉన్న ఈ పెద్దమనిషి (చంద్రబాబు) దారుణంగా ఓడిపోయారు. ఆయన పరిపాలనా దక్షత ఏపాటిదో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. సొంత నియోజకవర్గం, పుట్టిన గడ్డపై ఎవరికైనా సహజంగానే ప్రేమ ఉంటుంది. ప్రవాస భారతీయులు సైతం తమ సొంత గ్రామాలకు ఏదైనా మేలు చేయాలని తపిస్తుంటారు. చంద్రబాబు వ్యవహారం మాత్రం ఇంకోలా ఉంది. ఆయన చదివిన పాఠశాల పేరు శేషాపురం స్కూల్. బాబు సొంతూరు నారావారిపల్లె పక్కనే ఈ స్కూల్ ఉంది. ఇప్పుడు కూడా ఆ బడిలో చాలామంది పిల్లలు చదువుకుంటున్నారు. గట్టిగా తుమ్మితే పడిపోయే పరిస్థితుల్లో ఇప్పుడా స్కూల్ ఉంది. చంద్రబాబు గతంలో తొమ్మిదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నారు. ప్రస్తుతం నాలుగేళ్లుగా పదవిలో కొనసాగుతున్నారు. ఆయన చిన్నప్పుడు చదువుకున్న బడి పరిస్థితే అలా ఉంటే, ఇక రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల దుస్థితి ఎలా ఉందో మీరే ఊహించుకోవచ్చు.

తాగునీరు లేదు.. సాగునీరు లేదు

నాన్నగారు వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చంద్రగిరి నియోజకవర్గానికి 100 పడకల ఆసుపత్రిని మంజూరు చేశారు. ఆసుపత్రి నిర్మాణానికి జీవో కూడా ఇచ్చారు. ఇప్పటికి కూడా ఆ జీవో ఉంది. మహానేత మరణించాక ఆసుపత్రి అతీగతీ లేకుండాపోయింది. నాలుగేళ్లుగా సీఎం పదవిలో ఉంటున్న చంద్రబాబు 100 పడకల ఆసుపత్రి నిర్మాణం గురించి పట్టించుకోవడం మానేశారు. చంద్రగిరి నియోజకవర్గంలో 138 పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 70 శాతం గ్రామాల్లో ఇప్పటికీ

> **"అధికారంలోకి వచ్చి నాలుగేళ్లయిన తర్వాత చంద్రబాబుకు ఇప్పుడు పెన్షన్లు గుర్తుకొచ్చాయట! మరో ఏడాదిలో ఎన్నికలు వస్తున్నాయి గనుక గుర్తుకొచ్చాయి. ఆరోగ్యశ్రీ పథకం హైదరాబాద్‌లో వర్తించడం లేదన్న సంగతి కూడా చంద్రబాబుకు ఇప్పడే గుర్తుకొచ్చింది. ఇలాంటి మోసాలు ఇంకెంత కాలం? ఈ పాలన మనకొద్దు. ఇది ముగియాలి"**
>
> **"మనం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి పేదకూ ఇల్లు కట్టిస్తా. వైఎస్సార్ హయాం నాటి సువర్ణ పాలన గుర్తుకు తెచ్చేలా చేస్తా. ఈ మహా ప్రయత్నానికి బయలుదేరిన మీ బిడ్డగా నాకు అండగా నిలవండి, ఆశీర్వదించండి. తోడ్పాటునివ్వండి"**

తాగునీరు లేదు, సాగునీరు లేదు. చంద్రబాబు పరిపాలన ఎలా ఉందో దీన్నిబట్టే అర్థం చేసుకోవచ్చు. చంద్రగిరి, చిన్నగొట్టిగల్లు, యర్రావారిపాలెం ప్రాంతాల్లో ప్రతిఏటా ఏనుగులు బీభత్సం సృష్టిస్తున్నాయి. పంటలను నాశనం చేస్తున్నాయి. చంద్రబాబును ఒక్కటే అడుగుతున్నా. పంట నష్టపోయిన రైతన్నలకు ఈ నాలుగేళ్లలో ఒక్కసారైనా దమ్మిడీ అయినా సాయం చేశారా?

బాబు సీఎం అయితే ఫ్యాక్టరీలు మూతే

చిత్తూరు జిల్లా మామిడి పంటకు ప్రసిద్ధి గాంచింది. మన ఖర్మ ఏమిటంటే రైతుల దగ్గర మామిడి ఉన్నంతకాలం ప్రైవేట్ వ్యాపారులంతా ఒక్కటవుతారు. ధర భారీగా పడిపోయేలా చేస్తారు. పంట వ్యాపారుల చేతుల్లోకి రాగానే ధర అమాంతం పెరిగిపోతుంది. ఈ జిల్లాలో రైతులు చెరుకు ఎక్కువగా సాగు చేస్తారు. సహకార రంగాన్ని ప్రభుత్వం నిర్వీర్యం చేయడంతో చెరుకు రైతుల పరిస్థితి దారుణంగా మారింది. సహకార రంగంలో చిత్తూరు, రేణిగుంటలో రెండు చక్కెర ఫ్యాక్టరీలు, ప్రైవేట్ రంగంలో 4 ఫ్యాక్టరీలు ఉన్నాయి. చంద్రబాబు ముఖ్యమంత్రి అయినప్పుడల్లా సహకార రంగంలోని చక్కెర ఫ్యాక్టరీలు మూతపడతాయి, ప్రైవేట్ రంగంలోనివి లాభపడతాయని ఇక్కడి రైతులు నాతో చెప్పారు. గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్న 9 ఏళ్లల్లో చిత్తూరు జిల్లాలోని రెండు చక్కెర ఫ్యాక్టరీలు మూతపడగా, వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక రూ.51 కోట్లు ఇచ్చి నిలబెట్టారని, పదేళ్ల పాటు లబ్ధి పొందామని రైతులు అన్నారు. చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి అయ్యారు, రెండు సహకార చక్కెర ఫ్యాక్టరీలు మళ్లీ మూతపడ్డాయని చెబుతున్నారు. సహకార చక్కెర ఫ్యాక్టరీలు బాగా పని చేస్తే రైతులకు గిట్టుబాటు ధర ఇస్తాయి. ప్రైవేట్ ఫ్యాక్టరీలు కూడా అదే రేటు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ, చంద్రబాబు మాత్రం సహకార చక్కెర ఫ్యాక్టరీలను దగ్గరుండి మరీ మూసి వేయించారు. విచిత్రం ఏమిటంటే ప్రైవేట్ రంగంలోని నాలుగు చక్కెర ఫ్యాక్టరీలు లాభాల మీద లాభాలు ఆర్జిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో బెల్లం తయారీకి పూనుకుంటే దానిపైనా ప్రభుత్వం ఆంక్షలు విధించింది. నల్లబెల్లం తయారు చేయకూడదని ఆంక్షలు పెట్టింది. అలాంటప్పుడు తామేం చేయాలని రైతులు అడుగుతున్నారు. ఇక్కడి భూములు అటువంటివి, ఇక్కడ పండే పంట అటువంటిది.. నల్లబెల్లమో, తెల్లబెల్లమో మా చేతుల్లో ఉంటుందా? అని వాపోతున్నారు. సహకార రంగంలోని ఫ్యాక్టరీలు లాభాల బాటలో నడిస్తే ప్రైవేట్ చక్కెర ఫ్యాక్టరీలకు చెరుకు ఇచ్చే వాళ్లు ఉండరని, నల్లబెల్లంపై ఆంక్షలు విధించి ధర లేకుండా చేసింది చంద్రబాబు కాదా? అని ప్రశ్నిస్తున్నా.

నీళ్లు రూ.20.. పాలు రూ.22

నేను ఇక్కడికి వచ్చేటప్పుడు నా దగ్గరకు పాడి రైతు అయిన ఓ మహిళ వచ్చింది. ఒక చేతిలో నీళ్ల సీసా, మరో చేతిలో పాల సీసా ఉంది. లీటర్ నీళ్లు రూ.20, లీటర్ పాలు రూ.22 అని చెప్పింది. ఇలాగైతే మేం ఎలా బతకాలన్నా అని అడిగింది. చంద్రబాబు చేసిన పనేంటో తెలుసా? రైతులపై తనకు ఎంతో ప్రేమ ఉందంటూ హెరిటేజ్‌ను స్థాపించి, పాల వ్యాపారంలోకి అడుగుపెట్టారు. చిత్తూరు డెయిరీని మూసి వేయించారు. తానే దళారి అయి రైతుల నుంచి తక్కువ ధరకు పాలు కొంటున్న చరిత్ర బాబుది.

పెట్రోల్, డీజిల్ బాదుడుకు అంతే లేదా?

రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ ధరల బాదుడుకు అంతే లేకుండా పోయింది. చిత్తూరు జిల్లా వాళ్లు తమిళనాడు సరిహద్దుల్లోకి పోయి పెట్రోల్, డీజిల్ పోయించుకుంటే మన రాష్ట్రం కంటే 7 రూపాయలు తక్కువ. అదే కర్ణాటక సరిహద్దుకు వెళితే 5 రూపాయలు తక్కువ. మన రాష్ట్రంలో మాత్రం బాదుడే బాదుడు.

పైన ఆయన.. కింద జన్మభూమి కమిటీలు

చంద్రబాబు అవినీతి, అక్రమాలకు ఏవీ మినహాయింపు కాదు. ఇసుక, మట్టి, బొగ్గు, కరెంటు, చివరకు గుళ్లు, గుడి భూములు.. ఇలా ప్రతి ఒక్కటీ అవినీతిమయమే. చంద్రబాబు పైన తింటుంటే, గ్రామాల్లో తినడానికి జన్మభూమి కమిటీలను వదిలారు. పింఛన్లు, రేషన్ కార్డులు, చివరకు మరుగుదొడ్లు కావాలన్నా లంచాలు ఇవ్వాల్సిందేనట!

రాష్ట్రాన్ని మాఫియాగా మార్చారు

మన రాష్ట్రాన్ని మాఫియా ముఠాగా మార్చేశారు. ఈ ప్రభుత్వం అన్యాయాలు, మోసాలు, అవినీతికి పరాకాష్టగా తయారైంది. అందుకే రాజకీయాల్లో విశ్వసనీయత, నిజాయితీ కోసం పాదయాత్ర తలపెట్టా. ఎవరైనా రాజకీయ నాయకుడు మైకు పట్టుకుని ఒక మాట చెప్పారంటే దాన్ని కచ్చితంగా అమలు చేసే పరిస్థితి ఉండాలి. అలా చేయకపోతే తన పదవికి రాజీనామా చేసి పోవాలి. చెడిపోయిన రాజకీయ వ్యవస్థను మార్చకపోతే అబద్ధాలకు, మోసాలకు హద్దూ పద్దూ ఉండదు. చిన్న చిన్నవి చెబితే నమ్మరని చంద్రబాబు అధికారం కోసం ఇంకా పెద్దపెద్దవి చెబుతారు. ప్రతి ఇంటికీ కిలో బంగారం, బెంజ్ కారు ఇస్తామంటారు. వీటిని ప్రశ్నించకపోతే ముమ్ముందు మరింత అన్యాయం, మోసం చేస్తారు. రాజకీయాల్లో విశ్వసనీయత, నిజాయతీ రావాలి. అది నా ఒక్కడి వల్లే కాదు. మీ అందరి సహాయ సహకారాలు కావాలి. మీరంతా నాకు తోడూ నీడగా ఉండడంతోపాటు మీ ఆశీర్వాదాలు అవసరం. అప్పుడే ఈ చెడిపోయిన రాజకీయ వ్యవస్థ బాధ తొలగిపోతుంది.

బాబు మోసాలు ఎన్నెన్నో..

- కరెంటు బిల్లులు షాక్ కొడుతున్నాయి, అధికారంలోకి రాగానే వాటిని తగ్గిస్తాను చంద్రబాబు ఎన్నికల ముందు అన్నారు. కానీ, అధికారంలోకి వచ్చాక ఇప్పటికే మూడుసార్లు కరెంటు చార్జీలు పెంచేశారు. వినియోగదారులకు షాక్‌ల మీద షాక్ ఇస్తున్నారు.
- ప్రతి పేదకూ 3 సెంట్ల స్థలంలో ఇల్లు కట్టిస్తానన్నారు. అధికారంలోకి వచ్చిన ఈ నాలుగేళ్లలో ఒక్కటంటే ఒక్కటి కూడా కట్టించలేదు.
- నాలుగేళ్ల కిందట రేషన్ షాపుల్లో రకరకాల సరుకులు వచ్చేవి. ఇప్పుడు బియ్యం తప్ప మరేమీ రావడం లేదు. ఒక్కొక్కటిగా ఊడగొట్టారు.
- రూ.87,612 కోట్ల పంట రుణాలను పూర్తిగా, భేషరతుగా మాఫీ చేస్తానన్నారు, బ్యాంకుల్లో తాకట్టు పెట్టిన బంగారాన్ని ఇంటికి తెప్పిస్తానన్నారు. కానీ, ఇప్పుడు బంగారం ఇంటికి రాకపోగా బ్యాంకుల నుంచి వేలం నోటీసులు వస్తున్నాయి. రుణమాఫీ కింద చంద్రబాబు ఇచ్చిన సొమ్ము కనీసం వడ్డీలకు కూడా సరిపోలేదు
- జాబు రావాలంటే బాబు రావాలన్నారు. అది రాకపోతే ప్రతి ఇంటికీ నెలకు రూ.2 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. అధికారంలోకి వచ్చాక ఆ ఊసే ఎత్తడం మర్చిపోయారు. నెలకు రూ.2 వేల చొప్పున ప్రతి ఇంటికీ 45 నెలల కాలానికి చంద్రబాబు రూ.90 వేలు బాకీ పడ్డారు. ఆయన ఎక్కడైనా కనిపిస్తే గట్టిగా నిలదీసి అడగండి. రూ.90 వేలు ఎప్పుడిస్తావు బాబూ అని ప్రశ్నించండి.
- పొదుపు సంఘాలకు రుణమాఫీ చేస్తామన్నారు. అధికారంలోకి వచ్చాక మాఫీ కాదు, మోసం చేశారు.
- ఇంటి పన్నులను ఇష్టానుసారంగా బాదేస్తున్నారు. పేదలను నరకయాతనకు గురిచేస్తున్నారు.
- కరెంటు చార్జీలు, ఆర్టీసీ చార్జీలను ఇప్పటికే మూడుసార్లు పెంచేశారు.

మన ప్రభుత్వం వస్తే...

- 4 కత్తెర్లు, 4 ఇస్త్రీ పెట్టెలు ఇచ్చేసి చేతులు దులుపుకుంటే బీసీలపై, పేదలపై ప్రేమ ఉన్నట్లు కాదు. దేవుడి దయ, ప్రజలందరి ఆశీస్సులతో మన ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేదల బతుకులను మార్చే కార్యక్రమాలను అమలు చేస్తుంది.
- మన పిల్లలు ఇంజినీరింగ్, మెడిసిన్ వంటి పెద్ద చదువులు చదువుకోవాలంటే ఇల్లో, పొలమో అమ్ముకోవాల్సిన పరిస్థితి రాకూడదు. పిల్లల చదువులకు ఎంత ఖర్చయినా సరే మన ప్రభుత్వమే భరిస్తుంది. ఎంత వరకు చదువుకుంటే అంత వరకూ చదివిస్తాం. ఈ విషయంలో నాన్నగారు ఒక అడుగు ముందుకేస్తే ఆయన కుమారుడిగా నేను రెండడుగులు ముందుకేస్తా. పేదలకు నేను ఇస్తున్న భరోసా ఇది.
- ప్రస్తుతం ఇంజినీరింగ్ కోర్సు ఫీజు ఏడాదికి రూ.లక్ష. చంద్రబాబు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.30 వేలో, రూ.35 వేలో ముష్టి వేసినట్లు వేస్తోంది. మిగతా డబ్బును పేదలు ఎక్కడి నుంచి తేవాలి? అందుకే పెద్ద చదువులకు ఎన్ని రూ.లక్షలు ఖర్చయినా నేను భరిస్తా.
- హాస్టల్ ఖర్చుల కోసం ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.20 వేలు ఇస్తాం.
- చిన్న పిల్లల చదువులే భవిష్యత్తుకు పునాదులు. వాళ్లు పెద్ద చదువులు చదివితే పేదల బతుకులు మారుతాయి.
- పిల్లలను బడికి పంపే ప్రతి తల్లికీ ఏడాదికి రూ.15 వేలు ఇస్తాం. ఏ బడికి పంపినా ఫర్వాలేదు.
- అవ్వా తాతలకు పింఛన్లు ఇవ్వడానికి చంద్రబాబుకు చేతులు రావడం లేదు. అదే కాంట్రాక్టర్లకు అయితే రేట్లు పెంచడానికి సిద్ధపడతారు. ఎందుకో తెలుసు కదా. కాంట్రాక్టర్లయితే కమీషన్లు ఇస్తారు. పేదలు ఇవ్వలేరు కదా! మన ప్రభుత్వం వచ్చిన తర్వాత పెన్షన్ వయసును 65 ఏళ్ల నుంచి 60 ఏళ్లకు తగ్గిస్తాం. నెలకు రూ.2 వేల చొప్పున పెన్షన్ అందజేస్తాం.
- రెక్కాడితే గానీ డొక్కాడని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల మహిళలకు 45 ఏళ్లకే పెన్షన్ ఇస్తాం.



సురావారిపల్లె వద్ద జగన్‌కు పెరుగన్నం తినిపిస్తున్న అవ్వ



కమ్మకండ్రిగలో వైఎస్ జగన్‌ను చూసిన ఆనందంలో ఈల వేస్తున్న ఓ సోదరి



రామచంద్రాపురం సభలో ప్రసంగిస్తున్న ప్రతిపక్ష నేత జగన్, చిత్రంలో ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, నారాయణస్వామి తదితరులు



బలిజపల్లె వద్ద జై జగన్ అంటూ బస్సులోంచి నినాదం చేస్తున్న మహిళ



రాయలచెరువు వద్ద జగన్‌తో సెల్ఫీ దిగుతున్న ఆంజనేయస్వామి వేషధారి



కుప్పంబాదూరు వద్ద అవ్వను ఆప్యాయంగా పలకరిస్తున్న వైఎస్ జగన్

ఉప్పొంగిన ఉత్సాహం

చంద్రగిరి నియోజకవర్గంలోని రామచంద్రపురం మండలంలో శనివారం ప్రజాసంకల్ప యాత్రతో ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో ఉత్సాహం ఉప్పొంగింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అడుగడుగునా అపూర్వ స్వాగతం లభించింది. వైఎస్సార్‌సీపీ జెండాలతో కార్యకర్తలు ముందు నడవగా దారి పొడవునా మహిళలు, వృద్ధులు, యువకులు, చిన్నారులు ఎదురొచ్చి జగన్‌తో కలిసి అడుగులో అడుగేశారు. కోలాటం బృందాలు, రామారం చెక్కభజనలు, చంద్రగిరి కళాకారులు, కేరళ డప్పు వాయిద్యాలు, కోయంబత్తూరు బుట్టబొమ్మలు ఆకట్టుకున్నాయి. రామచంద్రాపురంలో జరిగిన బహిరంగ సభకు జనం పోటెత్తారు. సభలో తొలుత ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రసంగిస్తూ సీఎం చంద్రబాబు తీరును ఎండగట్టారు. వైఎస్ పాలనలో చంద్రగిరి ప్రాంత రైతులు స్వర్ణయుగాన్ని చూశారని కొనియాడారు.

జగనన్న అడుగులో అడుగేస్తున్నా..

ప్రజా సంకల్పయాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరుకు చెందిన కొల్లాటి రాధాకృష్ణ, వైఎస్ జగన్ పాదయాత్రకు సంబంధించిన ప్లకార్డు పట్టుకుని ప్రజా సంకల్ప యాత్రలో పాల్గొంటూ అందరినీ ఆకట్టుకుంటున్నాడు. ఇడుపులపాయ నుంచి జగన్ వెంటే నడుస్తున్న ఆ యువకుడిని చిత్తూరు జిల్లాలో 'సాక్షి' పలుకరించగా.. మత్స్యకార కుటుంబానికి చెందిన తమకు వైఎస్సార్ ఎన్నో మేళ్లు చేశారని గుర్తు చేసుకున్నాడు. వైఎస్ ఆశయాలను అమలు చేసేందుకు పాదయాత్ర చేపట్టిన జగన్‌కు అండగా ఉండాలనే తానూ జగనన్న అడుగులో అడుగేస్తున్నట్లు చెప్పాడు.



సాక్షి పెళ్ళిచూపులు

ఆదివారం 14-1-2018

వధువు కావలెను



క్రిస్టియన్ మాల / C.Govt. Job/ 44,000/– PM / MBA / 5'8" ఎత్తు/29 సం॥ అబ్బాయికి Any Govt. అమ్మాయి కావలెను. 9642728299 [H-684609]

SC-42 Age, 5'6 H, Edu-Deg., 30 వేల జీతం కలిగిన వరుడికి ఏ బాదరబంధీ లేని చక్కటి ఆదర్శణీయమైన నడవడిక కలిగిన విడో / డైవర్స్ వధువు కావలెను. (శెట్టిబలిజ-గౌడ, వాల్మీకి) డైరెక్ట్ కాల్ : 91217 08591 [R-857945]

Christian/41 yrs/5'.6"/Medium Clour/ B.Com/ Business, Seek Bride. Contact Cell: 9581297603. [T-5905]

★★

డైరెక్ట్‌: కుల, మత పట్టింపులేదు/ 56 Yrs/ M.Sc, M.D. Acu/ ఎటువంటి ఆస్తులు లేని ఒంటరి పురుషునికి 40 సం.లు దాటిన ఒంటరి స్త్రీ తోడు కావలెను. ఇల్లరికం OK, డైరెక్ట్. 7329989195. [T-5906]

మునూరు కాపు విడో 45 yrs, "5.6", తెలుపు రంగు సొంత ఇండస్ట్రీస్ గల మంచి ఆదాయం వరుడికి విడో లేదా డైవర్స్ వధువు 35 yrs పైన, తెలుపు, P.G., పిల్లలున్ననూ OK కుల ప్రసక్తి లేదు. T.P.T. S.V. మ్యారేజ్ సర్వీస్, డై॥ 9885464268. [C-699332]

సున్ని, ముస్లిం / షేక్ : 28 / 5.6 / BDS డాక్టర్ / సొంత ఇల్లు, హాస్పిటల్ & 2 డెంటల్ క్లినిక్‌లు గల ఏకైక వరునికి MBBS కాని, MD, MS, PG వధువు కావలెను. sgmsubhan99999@gmail.com. 63000 07879. కర్నూలు. [L- 688086]

వరుడు కావలెను



రెడ్డి/విడో/కుల పట్టింపు లేదు/30/ 5'2"/MBA / మంచి ఆస్తి/ ఆదాయం కలిగిన అందమైన వధువుకు మంచి వరుడు కావలెను. 9581690158 [H-695940]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Cont: K.C. Reddy, Address: 106, A K Enclave, Phase II, 8-2-350, Road No. 3, Banjara Hills (Near Furniture Mall), Hyderabad. Ph: 9849321309 / 9347807015
Email: kcreddy43@gmail.com

వధువు కావలెను

Reddy/ B.Tech (IIT) M.Tech (IIT) SWE/ Bang/30/5'7"/35L/ Yr/ 15 (Prop) * Cont: K.C. Reddy Mar Bur, Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/ B.Tech (IIT) / M.Tech (IIT) / PhD/ USA/300k/ 32/6'/ 10 Cr * VIT/ GMAT/ MBA (USA) (KELLY) 30/5'11"/180K * Cont: K.C. Reddy, Hyd. Ph: 9849321309 / 9347807015

Reddy/ USA Green Card / B.Tech / MS/ 27/5'9"/95K / 30 Cr (Prop) Hyd * Cont: K.C. Reddy Mar Bur, Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/ MBBS/ Res-Doc-USA/ 28/6'/ (Surgeon) / 50 Cr + (Prop) / Father - Doc-USA * Cont: K.C. Reddy Mar Bur, Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/ Business / B.Tech /MBA *32/6'/ 400 Cr * 28/5'10"/200 cr * 31/5'9"/200 Cr * 29/5'8"/200 Cr * 30/5'10"/200 Cr * Cont: K.C. Reddy, Hyd. Ph: 9849321309

Reddy/ B.Tech / MBA/ USA/26/ 5'9"/75 Cr * BS/USA/25/6'/150 Cr* MS/ 24/6'/40 Cr * Cont: K.C. Reddy Mar Bur, Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/ B.Tech /MS/H1/USA*28/6'/200 Cr * 28/5'11"/60 Cr * 34/5'10"/ 70 Cr * 30/5'7"/150K / 70 Cr*28/5'8"/100K / 30 Cr* Cont: K.C. Reddy, Hyd. Ph: 9849321309/ 9347807015.

Reddy/ PG-Doc/MS (Optha) Both Partents Govt. Doc/30/5'10"/ V. Smart / 10 Cr (Prop)* Cont: K.C.Reddy, Ph: 9849321309 / 9347807015

Reddy/ MBBS /MS (Sur) / DM/ Both Parents - Doc/ Own Hospital / Hyd/ 29/5'11"/80 Cr * Cont: K.C. Reddy, Hyd. Ph: 9849321309 / 9347807015

Reddy/ BSc (Statistics) / MSc (Actuary) / 25L / Yr /15 Cr (Prop) / 29/5'11"* Cont: K.C. Reddy, Hyd. Ph: 9849321309 / 9347807015

వరుడు కావలెను

Reddy/B.Tech /MS/26/5'3"/150 Cr * 26/5'3 1/2" / 40 Cr * 28/5'5"/40 Cr * 26/5'7"/30 Cr * 28/5'4"/ 30 Cr * 27/5'6"/100 Cr * Cont: K.C. Reddy , Ph: 9849321309 / 9347807015

Reddy/B.Tech (IIT)/MS/USA * 30/5'5"/ 200K/ 15 Cr * 29/5'4"/180K * 27/5'4" * 26/5'7"/30 Cr * 27/5'2"/5 Cr * 27/5'5" * Cont: K.C.Reddy, Hyd. Ph: 9849321309 / 9347807015

Reddy/MBBS / Res-Doc-USA*26/5'7"/ 50 Cr * 26/5'4"/120 Cr * 27/5'7"/10 Cr * 29/5'3" * 29/5'5"/10 Cr * 30/5'4" * Cont: K.C.Reddy, Hyd. Ph: 9849321309 / 9347807015

Reddy/MBBS /PG * 28/5'3" (Sur) / 27/5'6"/GM/ 29/5'3"/ (RAD) * 30/5'6"/ (DER) * 28/5'8"/GM * 29/5'4"/GM * 28/5'4"/ENT * 26/5'5" (Path)* Cont: K.C.Reddy, Hyd. Ph: 9849321309

Reddy/ Rich /B.Tech / 27/5'6"/100Cr * 30/5 '2 1/2" / 100 Cr * 28/5'7"/50 Cr * 28/5'3"/20 Cr * 28/5'5"/40 Cr* 29/5'3"/30 Cr * Cont: K.C.Reddy, Hyd. Ph: 9347807015

Reddy/ (Rich) / B.Tech/ 26/5'5"/10 Cr * 27/ 5'5"/25 Cr * 27/5'2"/20 Cr * 27/5'5"/ 20 Cr * 28/5'3"/20 Cr * 26/5'6"/30 Cr * 20/5'8"/30 Cr * Cont: K.C.Reddy, Ph: 9849321309 / 9347807015

Reddy/ MSc/ 28/5'4"/Own Schools and Other Business / 10 Cr+ (Prop) * Cont: K.C.Reddy Mar Bur, Hyd. Ph: 9849321309 / 9347807015

Reddy/ (Divercee) / Most Beautiful / 26/5'3"/BBA/. 10 Cr *32/5'6"/M.Tech/ 20 Cr * 28/5'6"/25 Cr * B.Tech / 31/5'2 1/2"/ 10 Cr* Cont: K.C.Reddy, Hyd. Ph: 9849321309

Reddy/B.Tech / 21/5'5"/10 Cr * 20/5'8"/30 Cr * 24/5'4"/50 Cr * BDS / 30/5'3"/100 Cr * Cont: K.C. Reddy Mar Bur, Hyd. Ph: 9849321309/ 9347807015.

Reddy/ Catholic / B.Tech / Most Beautiful / 24/5'5"/ 25 Cr * 26/5'7"/30 Cr * Cont: K.C. Reddy Mar Bur, Hyd. Ph: 9849321309/ 9347807015.

[D-052]

ముస్లిం / నూర్‌బాషా - Dr. P.G. డిప్లొమా – అనస్థీషియా, 5.2', 29 సం॥. అమ్మాయికి, Dr. M.D (or) M.S చేసిన, 30–34 సం॥, 5.5' గల అబ్బాయి కావలెను. Cont: 9666955006. [A-3949]

రెడ్డి 'విడో' 29 Years' B.Tech' 22 కోట్ల ప్రాపర్టీ కల్గి పిల్లలు లేని అందమైన ఒంటరి వధువుకి వరుడు కావలెను. (ఆస్తి, కుల, వయస్సు ప్రసక్తి లేదు) మీ ఫొటో Details Whatsappలో Send చేయండి. సంప్ర : 81211 13560. [V- 599986]

కుల పట్టింపులేని వారికి 2వ/లేట్ సంబంధాలకు ప్రతి ఆదివారం 2 PM - 5 PM పరిచయ వేదిక జరుగును. 1000 మంది వధూవరుల లిస్ట్ ఇవ్వబడును. కుదర్చబడును. 8712456779 [HA-8541]

Bandan Matrimony. అన్ని కులముల వివాహ సంబంధాలకై సంప్ర: తిరుపతి, బెంగళూరు,9848711871, 80506 10900 www.bandanmatrimony.com [T-3076]



★★

క్రిస్టియన్ మాల/Govt / Asst. Manager / ఆంధ్రా బ్యాంక్ /40,000/–PM / B.Tech / 5'5" ఎత్తు/25 సం॥ అమ్మాయికి తగిన అబ్బాయి కావలెను. 9642728299 [H-684610]

చౌదరి /విడో/30 సం॥ / 5'5" ఎత్తు/ BSc BEd / Govt. టీచర్/50,000/–PM /7 Cr ప్రాపర్టీ/ ఈమధ్యనే భర్తను కోల్పోయిన వధువు కుల, ఆస్తి, ప్రసక్తిలేని ఇల్లరికం వరుడు కావలెను. 9603394837 [H-695963]

మాల, 22, వెరీ ఫెయిర్, డిగ్రీ(B.Sc) 18 కోట్ల ఆస్తి ఉన్న వధువుకి వరుడు కావలెను. క్రిష్టియన్స్ మాత్రమే. 7075844177. e-mail:aradhanamatrimony.111@gmail.com [G-673]

www.amityalliances.com ప్రపంచవ్యాప్త, తెలుగు తెలిసిన హిందూ, క్రిస్టియన్, ముస్లింల అభిమాన వివాహ పరిచయ Website సందర్శించండి. రిజిస్ట్రేషను Free. [V- 5438]

నేడు క్రైస్తవ వివాహ పరిచయ వేదిక. 10 వేలు ప్రొఫైల్స్‌తో (ఆల్, కన్వర్టెడ్) రాజమండ్రి, వైజాగ్ : 83282 39499 / 93943 99750, విజయవాడ: 88854 79555, 88850 73555. [V- 688787]

వేదికలు



కావ్యశ్రీ మ్యారేజ్ బ్యూరో: 1వ, 2వ, లేట్ మ్యారేజెస్/ అన్ని కులముల వారికి డైవర్సీస్/ విడోస్/ విడోవర్స్, పెన్షనర్స్‌కు సంబంధములు త్వరగా కుదర్చబడును. (స్త్రీలకు ఫ్రీ రిజి॥) ఫోన్: 7286931144 [H-684124]

శ్రీ మ్యారేజ్ బ్యూరో. 1వ, 2వ, తోడు మరియు మంచి సంబంధాల కొరకు సంప్రదించండి. ఫోన్: 9160901008 [H-694044]

★★

విశ్వబ్రాహ్మణ వివాహ సమాచార కేంద్రం బ్రహ్మముడి, గుంటూరు ఇది విశ్వ బ్రాహ్మణ పెళ్ళి సంబంధాల ప్రత్యేక వేదిక 0863–2261898, 94911 25725 [G-676568]

క్రిస్టియన్ వివాహ పరిచయ వేదిక. మీ అమ్మాయికి/అబ్బాయికి సంబంధం కావాలా? డాక్టర్స్, ఇంజనీర్స్, పీజీ, డిగ్రీ సంబంధాలు చాలా కలవు. www.sweethomemarriage.com ఫోన్ : 0891–2739003, 98490 72372. [V- 688852]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు

సాక్షి పెళ్ళిచూపులు

Combined :	1430/- for 4 Lines 385/- Extra Line
Telangana : (Incl. Hyd)	880/- for 4 Lines 240/- Extra Line
Andhra Pradesh: (Incl. Hyd)	990/- for 4 Lines 275/- Extra Line

* Color 25% Extra

గమనిక : ఇకపై మీరు ఇచ్చే అన్ని ప్రకటనలపై 5% GST అదనం.

సంప్రదించండి

తిరుపతి	9912220584
కడప	9951602932
అనంతపూర్	9912220718
కర్నూల్	9912220575
శ్రీకాకుళం	9912220343
విశాఖపట్నం	9912220550
తాడేపల్లి గూడెం	9912220558
రాజమండ్రి	9912220358
విజయవాడ	9912225442
గుంటూరు	9912220349
ఒంగోలు	9912225431
నెల్లూరు	9912220736

మరియు మీ దగ్గరలోని సాక్షి ప్రాంతీయ కార్యాలయములలో

సాక్షి
6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1 బంజారాహిల్స్, హైదరాబాద్ - 34
Ph: 040-23256000 Ext: 6230/ 6235 Cell: 9912225456.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహవేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

సంప్రదాయ పడవల పోటీలు ప్రారంభం

నాగాయలంక తీరంలో సంక్రాంతి సందడి



కోలపడవల విభాగంలో పోటీ పడుతున్న పడవలు

అవనిగడ్డ/నాగాయలంక: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కృష్ణా జిల్లా నాగాయలంకలో రాష్ట్ర స్థాయి సంప్రదాయ పడవల పోటీలు కన్నుల పండువగా సాగాయి. రాష్ట్ర పర్యాటక శాఖ, భాషా సాంస్కృతి శాఖ, స్వచ్ఛ నాగాయలంక సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన ఈ పోటీలను మంత్రి కొల్లు రవీంద్ర శనివారం ప్రారంభించారు. కోల పడవలు, మెడ్డుడు పడవలు, డ్రాగన్ పడవల విభాగాల్లో రెండు రోజుల పాటు పోటీలు నిర్వహిస్తారు. తొలిరోజు కోలపడవల పోటీ జరిగింది. కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల నుంచి మొత్తం 27 జట్లు పోటీ పడ్డాయి. ఈ పోటీలను తిలకించేందుకు పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావడంతో నాగాయలంకలోని కృష్ణాతీరం కిక్కిరిసిపోయింది. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. కేరళ తరహాలో సంప్రదాయ పడవల పోటీలు నిర్వహించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, శాసనసభ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్, రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎల్వీ సుబ్రహ్మణ్యం, రాష్ట్ర పర్యాటకశాఖ సీఈఓ హిమాన్షు శుక్లా, ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు పాల్గొన్నారు.

జల క్రీడల శిక్షణ కేంద్రానికి శంకుస్థాపన

రాష్ట్రంలో తొలిసారిగా కృష్ణా జిల్లా నాగాయలంకలో చేపట్టిన జల క్రీడల శిక్షణ కేంద్రం నిర్మాణానికి మంత్రి కొల్లు రవీంద్ర శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎనిమిది నెలల్లో ఈ కేంద్రాన్ని అందుబాటులోకి తెస్తామని ప్రకటించారు. గ్రామీణ క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు ఈ కేంద్రం దోహదం చేస్తుందన్నారు.

ప్రజల్లో సేవాభావం పెరగాలి

ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



వైద్యశిబిరంలో మాట్లాడుతున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

వెంకటాచలం: దేశ ప్రజల్లో సేవాభావం పెరగాల్సిన అవసరముందని ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏ రంగంలోనైనా కష్టపడి పనిచేస్తేనే గుర్తింపు లభిస్తుందన్నారు. ఒకరికొకరు సాయపడే మనస్తత్వాన్ని అలవరుచుకొని ముందుకు సాగాలని సూచించారు. అవినీతి రహిత సమాజాన్ని సృష్టించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. వైద్యం ఖరీదు అయిపోవడంతో పేదలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విషయం వాస్తవమేనన్నారు. ఇది చాలా బాధాకరమన్నారు. స్వర్ణభారత్ లాంటి స్వచ్ఛంద సంస్థలు దేశవ్యాప్తంగా విస్తరించి సేవా కార్యక్రమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమాజ సేవ చేయడంలో లభించే సంతృప్తి.. ఎందులోనూ లభించదన్నారు. పారిశ్రామికవేత్తలు, ప్రముఖులు తమతమ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కాగా, ఈ వైద్య శిబిరంలో గ్లోబల్ హాస్పిటల్ అధినేత డాక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డితో పాటు పలువురు ప్రముఖ వైద్యులు పాల్గొని రోగులకు ఉచిత సేవలందించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు, జేసీ ఇంతియాజ్ అహ్మద్, స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ ఐ.దీపావెంకట్ పాల్గొన్నారు.

లక్ష్యాన్ని చేరుకునేందుకు

చర్యలు తీసుకోండి: హైకోర్టు

పెండింగ్ కేసులపై ఇరు రాష్ట్రాల న్యాయాధికారులకు స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది మార్చి 31 నాటికి 2012కు ముందు దాఖలైన కేసులను జీరోకి తీసుకురావడానికి పెట్టుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు తగిన ప్రయత్నాలు చేయాలని ఉభయ రాష్ట్రాల్లోని న్యాయాధికారులకు ఉమ్మడి హైకోర్టు స్పష్టం చేసింది. ఈ విషయంలో ఆయా కోర్టుల్లో పనిచేస్తున్న న్యాయాధికారులకు తగిన సూచనలు చేయాలని జిల్లా ప్రధాన న్యాయాధికారులకు తేల్చి చెప్పింది. ఈ మేరకు హైకోర్టు ఓ సర్క్యులర్ జారీ చేసింది. 2012కు ముందు దాఖలైన కేసుల పరిష్కారం విషయంలో గతేడాది చెప్పుకోదగిన రీతిలో పురోగతి సాధించినట్లు అందులో పేర్కొంది. పెండింగ్ కేసుల సంఖ్య బాగా తగ్గిందని వెల్లడించింది.

రాష్ట్రవ్యాప్తంగా బెల్టు షాపులపై దాడులు

127 కేసులు నమోదు.. ఆరు మద్యం షాపుల సీజ్

సాక్షి, అమరావతి: ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు శనివారం రాష్ట్ర వ్యాప్తంగా బెల్టు షాపులపై దాడులు నిర్వహించారు. అన్ని జిల్లాల్లో 125 బెల్టు షాపులను గుర్తించి కేసులు నమోదు చేశారు. ఆరు మద్యం షాపులను సీజ్ చేశామని ఎక్సైజ్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. బెల్టు షాపులు రాష్ట్రంలో లేవని మంత్రి కేఎస్ జవహర్ చెబుతుండగా, మరోవైపు ఎక్సైజ్ శాఖ నిర్వహిస్తున్న దాడుల్లో వందల సంఖ్యలో బెల్టు షాపులు వెలుగు చూస్తున్నాయి. బెల్టు షాపుల నిర్మూలన అంటూ కొద్ది రోజులు హడావుడి చేసిన ప్రభుత్వం తర్వాత అధికార పార్టీ ముఖ్య నేతల ఒత్తిడితో బెల్టు షాపుల జోలికెళ్లవద్దని మౌఖిక ఆదేశాలు జారీ చేసింది. దాంతో రాష్ట్రంలో బెల్టు షాపుల జోరు పెరిగింది. గుంటూరు, నెల్లూరు, చిత్తూరు, కర్నూలు, వైఎస్సార్, ఉభయగోదావరి, శ్రీకాకుళం, విశాఖ, విజయనగరం జిల్లాల్లో బెల్టు షాపులు పెరిగాయి. బార్ల నిర్వాహకులు బెల్టు షాపులతో వ్యాపారం నిర్వహిస్తున్నారన్న ఫిర్యాదులు వెల్లువెత్తాయి. గతేడాది బెల్టు షాపులపై టోల్ ఫ్రీ నంబర్ నిర్వహించిన ప్రభుత్వం కొద్ది రోజులకు ఫిర్యాదులను పట్టించుకోలేదు.

తీరప్రాంతాల్లో పొగమంచుకు ఆస్కారం

భారత వాతావరణ విభాగం వెల్లడి

విశాఖ సిటీ: మారుతున్న వాతావరణ పరిస్థితుల కారణంగా కోస్తాంధ్రలోని తీర ప్రాంతాల్లో అక్కడక్కడా ఆదివారం దట్టమైన పొగమంచు అలుముకునే వీలుందని భారత వాతావరణ విభాగం(ఐఎండీ) శనివారం రాత్రి పేర్కొంది. ఈ మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. కాగా, ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రస్తుతం అండమాన్ నికోబార్ దీవుల వైపు నుంచి భూమధ్య రేఖ గుండా హిందూ మహాసముద్రం మీదుగా కదులుతున్నదని తెలిపింది. ఇదిలా ఉంటే.. రాష్ట్రవ్యాప్తంగా ఉత్తర గాలులు తగ్గుముఖం పట్టడంతో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి.

నియామక పరీక్షలన్నీ ఆన్‌లైన్‌లోనే..

యూపీఎస్సీ చైర్మన్ డేవిడ్ ఆర్.సిమిలేహ్

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగ నియామకాలకు సంబంధించి నిర్వహించే పరీక్షలను పూర్తిగా ఆన్‌లైన్‌లోనే నిర్వహించాలని యూపీఎస్సీ చైర్మన్ ప్రొఫెసర్ డేవిడ్ ఆర్.సిమిలేహ్ పేర్కొన్నారు. సమాచార సాంకేతిక విజ్ఞానాన్ని అన్ని రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్లు అందిపుచ్చుకోవాలని సూచించారు. గోవాలోని తాజ్‌వివాంతాలో జరుగుతున్న యూపీఎస్సీ జాతీయ కాన్ఫరెన్స్ ముగింపు వేడుకల్లో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఇప్పటికే నూరు శాతం ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. టీఎస్‌పీఎస్సీ సీబీఆర్‌టీ విధానాన్ని అమలు చేస్తోందని, డిజిటల్ ఎవాల్యుయేషన్ చేపడుతోందని చెప్పారు.

15 టీఎంసీల కావేరి నీరు వదలండి

కర్ణాటక సీఎంకు తమిళనాడు ముఖ్యమంత్రి లేఖ

సాక్షి, బెంగళూరు: కావేరి జలాల్లో 15 టీఎంసీలను తమకు విడుదల చేయాలని తమిళనాడు ముఖ్యమంత్రి పళనిస్వామి శనివారం కర్ణాటక సీఎం సిద్ధరామయ్యకు లేఖ రాశారు. ఈ ఖరీఫ్, రబీలో తక్కువ వర్షపాతం వల్ల తమిళనాడులో వ్యవసాయానికి తీవ్ర నీటి కొరత ఉందని, కాబట్టి కావేరి నీటిని విడుదల చేయాలని కోరారు. తమిళనాడు ముఖ్యమంత్రి విజ్ఞప్తిని సీఎం సిద్ధరామయ్య తోసిపుచ్చారు. వేసవి రానుండడంతో పాటు తమ రాష్ట్రంలో రబీ సీజన్ దృష్ట్యా నీటిని ఇవ్వలేమని శనివారం స్పష్టం చేశారు. కేఆర్ఎస్ డ్యాంలో 49 టీఎంసీలే ఉన్నాయని, అవి తమ అవసరాలకే సరిపోతాయని చెప్పారు.

ఇంటి పన్నుల మోత

▶ మొదటి పేజీ తరువాయి

వెలువడే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

మార్చిలోగా వసూలు చేసేందుకు సిద్ధం

2017 –18 ఇంటి పన్ను వసూలు నోటీసులను గత ఏడాది ఏప్రిల్ నుంచి జారీ చేయాల్సి ఉంది. పన్ను పెంచాలన్న ఉద్దేశంతోనే ఒకవైపు ఆర్థిక ఏడాది ముగియటానికి వస్తున్నా 11 జిల్లాలో ఇంకా పన్ను డిమాండ్ నోటీసులు జారీ చేయలేదని సమాచారం. పన్ను పెంపు ప్రక్రియను పూర్తి చేసి వచ్చే మార్చి ఆఖరులోగా నిర్ణయించిన మొత్తాన్ని వసూలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఉభయ గోదావరి జిల్లాల్లో మాత్రం గత ఏడాది నిర్ణయించిన పన్ను రేటు ఆధారంగా చెల్లించాల్సి ఉంటుంది.

పెరిగిన భూమి ధరల ఆధారంగా పన్ను

1996 నాటి భూముల ధరల ఆధారంగా ప్రస్తుతం గ్రామాల్లో ఇంటి పన్నులు వసూలు చేస్తున్నారు. ఇల్లు ఉన్న భూమి విలువ, నిర్మాణ వ్యయం కలిపి వందకు పన్నెండున్నర పైసల నుంచి ఒక రూపాయి వరకు గ్రామ పంచాయితీలు ఇంటి పన్ను వసూలు చేసుకునేలా అధికారం కల్పించారు. 2001 తర్వాత పాత పన్నునే అప్పుడప్పుడూ ఐదు శాతం మేర పెంచుకుంటూ పోతున్నారు.

ఇళ్ల సర్వే అందుకోసమే...

ఇంటి పన్నులను పెంచేందుకు సిద్ధమైన ప్రభుత్వం కొద్దిరోజుల క్రితం రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల సర్వే నిర్వహించింది. ప్రతి ఇంటి వివరాలు సేకరించి కంప్యూటరీకరించింది. మొత్తం విస్తీర్ణం, నిర్మాణ విస్తీర్ణాలను నమోదు చేసి గ్రామంలో రిజిస్ట్రేషన్ శాఖ నిర్ణయించిన ధరల ప్రకారం అనుసంధానం చేసింది. ఉభయ గోదావరి జిల్లాల్లో ఈ ప్రక్రియ ప్రకారంమే పన్నులు పెంచారు. ఇదే విధానాన్ని రాష్ట్రమంతా వర్తింపచేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది.

పెంపుపై సీలింగ్

గత ఇరవై ఏళ్లలో పట్టణాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ భూముల ధరలు పెరిగాయి. 1996 నాటి రిజిస్ట్రేషన్ ధరల ప్రకారం పది వేల రూపాయలు ఉండే ఓ ఇల్లు భూమి ధర ప్రస్తుతం లక్ష రూపాయలకు పైబడి పెరిగిందని అధికారుల పరిశీలనలో తేలింది. నిర్మాణ వ్యయం సైతం మూడు నాలుగు రెట్ల మేర పెరిగింది. అయితే పెరిగిన ధరల ప్రకారం ఇంటి పన్ను నిర్ణయిస్తే ఐదారు రెట్లు పెరిగే అవకాశం ఉన్నందున పన్ను పెంపుపై పరిమితి విధించే యోచనలో ఉన్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం చెల్లిస్తున్న ఇంటి పన్నును గరిష్టంగా 50– 100 శాతానికి మించి పెంచే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం తీసుకునే తుది నిర్ణయం ఆధారంగా సీలింగ్ పరిమితి ఆధారపడి ఉంటుందని పేర్కొంటున్నారు. నిరుపేదలను పన్ను నుంచి మినహాయించేందుకు వీలుగా ఇంటి ఖరీదు నిర్దిష్ట పరిమితి దాటిన నివాసాలకు మాత్రమే పన్ను విధించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

కొత్తగా 20 లక్షల ఇళ్లపై పన్ను భారం

గ్రామీణ ప్రాంతాల్లో ఇటీవల చేసిన ఇళ్ల సర్వే ద్వారా 81.95 లక్షల నివాసాలు ఇంటి పన్ను పరిధిలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. 2014 నాటికి 61 లక్షల ఇళ్లు మాత్రమే పన్ను పరిధిలో ఉన్నట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో దాదాపు 20 లక్షల ఇళ్లు కొత్తగా పన్నుల పరిధిలోకి వస్తాయని అంచనా వేస్తున్నారు.



గ్రామాల్లో ఇంటి పన్ను వసూలు లక్ష్యం

ఆర్థిక ఏడాది	లక్ష్యం (రూ. కోట్లలో)
2014-15	301.76
2016-17	755.78
2017-18	1050-1250 (అంచనా లక్ష్యం)

ఇంటి పన్ను పరిధిలో ఇళ్ల సంఖ్య

2014	61 లక్షలు
2018	20 లక్షలు (కొత్తగా గుర్తించిన నివాసాలు)
ఇంటి పన్ను పరిధిలోకి వచ్చే మొత్తం ఇళ్లు:	81 లక్షలు

రాష్ట్రంలో స్టాంపులకు కటకట!

- రెండు నెలలుగా అన్ని జిల్లాల్లోనూ కొరత
- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న ప్రజలు
- అధిక ధరలకు విక్రయిస్తున్న వెండర్లు
- రుణగ్రహీతలకు తప్పని తిప్పలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో స్టాంపుల కొరత తీవ్రంగా ఉంది. నాన్ జ్యుడీషియల్, స్పెషల్ అడ్హెసివ్ స్టాంపుల కోసం ప్రజలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మరోవైపు స్టాంపుల కొరతను బూచిగా చూపించి వెండర్లు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అనంతపురం, వైఎస్సార్, చిత్తూరు, విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరుతో పాటు అన్ని జిల్లాల్లోనూ ఈ పరిస్థితి ఉంది. రెండు నెలల నుంచి స్టాంపుల కొరత ఉందని ఆయా జిల్లాల్లో సబ్ రిజిస్ట్రార్లు అంటున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెబుతున్నారు.

తనఖా రుణాల కోసం చిక్కులు

బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి రుణాలు తీసుకునేవారు స్పెషల్ అడ్హెసివ్ స్టాంపుల కొరత వల్ల ఇబ్బంది పడుతున్నారు. కొన్ని రెవెన్యూ డివిజన్లలో కూడా దొరక్కపోవడంతో జిల్లా కేంద్రాలకు వెళ్లి అధిక ధర వెచ్చించి వెండర్ల దగ్గర కొనుగోలు చేస్తున్నారు. అనంతపురం జిల్లా పెరవళికి చెందిన వెంకటప్ప నాయుడు ట్రాక్టర్ కొనుగోలు రుణం కోసం బ్యాంక్‌కు వెళ్లి భూమిని తాకట్టు పెట్టుకుని రూ.ఆరు లక్షల రుణం మంజూరు చేయాలని మేనేజర్‌ను కోరారు. ఈ రుణానికి రూ.6000 వేలకు స్పెషల్ అడ్హెసివ్ స్టాంపులు తీసుకురావాలని బ్యాంక్ మేనేజర్ సూచించారు. దీంతో వెంకటప్ప నాయుడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్టాంపులు లభించకపోవడంతో అనంతపురం వెళ్లి రూ.వెయ్యి అధికంగా వెచ్చించి స్టాంపులు కొనుగోలు చేయాల్సి వచ్చింది. బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి రుణం కావాలంటే అడ్హెసివ్ స్టాంపులు అంటించిన పేపర్లపై ఒప్పందం తప్పనిసరని, అందువల్ల ఎల్లప్పుడూ వీటికి డిమాండ్ ఉంటుందని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు తెలిపారు.

నాన్ జ్యుడీషియల్ స్టాంపులు దొరక్క ఇక్కట్లు

భూములు, ఇళ్లు, స్థలాలు విక్రయ ఒప్పందాలు, తనఖా, రిజిస్ట్రేషన్ల కోసం నాన్ జ్యుడీషియల్ స్టాంపులు వినియోగిస్తారు. రూ.10, రూ.20, రూ.50, రూ.100 డినామినేషన్లలో ఈ స్టాంపులు ఉంటాయి. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా వీటికి కొరత ఉంది. దీంతో అధిక ధరలకు కొనుగోలు చేయక తప్పడం లేదు. నాన్ జ్యుడీషియల్, రెవెన్యూ స్టాంపుల కొరత ఉందని, త్వరగా పంపాలంటూ ఉన్నతాధికారులకు ఇండెంట్ పంపించామని ఒక జిల్లా రిజిస్ట్రార్ తెలిపారు. స్టాంపుల కొరత వాస్తవమేనని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారులు సైతం అంగీకరించారు. అన్ని రకాల స్టాంపుల కోసం ప్రభుత్వ సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్‌కు ఆర్డర్ పంపించామని చెప్పారు.

రూ.10, రూ.20 స్టాంపులు వచ్చాయి

'రూ.10, రూ.20 నాన్ జ్యుడీషియల్ స్టాంపులు, కోర్టు ఫీజు స్టాంపులు హైదరాబాద్ మింట్ కాంపౌండ్‌లోని ప్రభుత్వ సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్ నుంచి విజయవాడలోని ఐజీ కార్యాలయానికి వచ్చాయని కర్నూలు జిల్లాకు చెందిన ఒక సబ్ రిజిస్ట్రార్ తెలిపారు. అక్కడ నుంచి జిల్లాలకు తీసుకొచ్చామని ఇంకా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు పంపిణీ కాలేదని చెప్పారు. కాగా, రూ.50, రూ.100 జ్యుడీషియల్, కోర్టు ఫీజు స్టాంపులు, అన్ని డినామినేషన్ల స్పెషల్ అడ్హెసివ్ స్టాంపులు నాసిక్‌లోని ప్రభుత్వ సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్ నుంచి రావాల్సి ఉంది. ఇక్కడ కొరత ఉన్న విషయం అక్కడి అధికారులకు తెలిపామని సంక్రాంతి తర్వాత స్టాకును భద్రతా ఏర్పాట్ల మధ్య పంపుతామని వారు చెప్పారని ఐజీ కార్యాలయానికి చెందిన ఉన్నతాధికారి ఒకరు పేర్కొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి



శ్రీవారి ఆలయం వద్ద జస్టిస్ సీతారామమూర్తి తదితరులు

సాక్షి, తిరుమల/మంగళగిరిరూరల్/ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమం): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.సీతారామమూర్తి శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

నృసింహస్వామి సన్నిధిలో జస్టిస్ పి.కేశవరావు

మంగళగిరి పట్టణ పరిధిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఎగువ, దిగువ సన్నిధులలో స్వామివారిని హైకోర్టు న్యాయమూర్తి పి.కేశవరావు శనివారం దర్శించుకున్నారు. స్వామివారి ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన కుటుంబసభ్యులతో కలిసి జస్టిస్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వహణాధికారి పానకాలరావు స్వామివారి చిత్రపటాన్ని జస్టిస్ కేశవరావుకు బహూకరించారు. కార్యక్రమంలో మంగళగిరి సీనియర్ సివిల్ జడ్జి వేముల భవాని, అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ రాహుల్ అంబేడ్కర్, ప్రొటోకాల్ అసిస్టెంట్, సీనియర్ సివిల్ జడ్జి రవికుమార్ పాల్గొన్నారు.

దుర్గమ్మ సేవలో జస్టిస్ అమర్‌నాథ్‌గౌడ్

విజయవాడలో కొలువైన దుర్గమ్మను తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అమర్‌నాథ్‌గౌడ్ శనివారం దర్శించుకున్నారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో చేరుకున్న అనంతరం జస్టిస్ అమర్‌నాథ్‌గౌడ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జస్టిస్‌కు వేదపండితులు ఆశీర్వచనాలు ఇవ్వగా, ఆలయ ఏఈఓ అచ్యుతరామయ్య అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

రైళ్లలో దివ్యాంగులకు మరిన్ని సదుపాయాలు

- గుంటూరు–వికారాబాద్ పల్నాడు ఎక్స్‌ప్రెస్‌తో ప్రారంభం
- ఈ నెల 18 నుంచి అమల్లోకి..

సాక్షి, హైదరాబాద్: దివ్యాంగులు, వయోధికుల కోసం దక్షిణమధ్య రైల్వే మరిన్ని సదుపాయాలను అందుబాటులోకి తెచ్చింది. ప్రస్తుతం రైల్వేస్టేషన్లలో వీల్‌చైర్లే వినియోగంలో ఉన్నాయి. ట్రైన్ దిగిన తరువాత స్టేషన్ బయటకు వెళ్లేందుకు, స్టేషన్ నుంచి ట్రైన్ వద్దకు వెళ్లేందుకు మాత్రమే ఇవి సౌకర్యంగా ఉన్నాయి. ఇక నుంచి నేరుగా ట్రైన్‌లోకి వెళ్లేందుకు వీలైన ఫోల్డింగ్ వీల్‌చైర్లను దివ్యాంగులైన ప్రయాణికుల కోసం వినియోగంలోకి తేనున్నారు. గుంటూరు–వికారాబాద్ పల్నాడు ఎక్స్‌ప్రెస్‌లో మొట్టమొదట ఈ నెల 18 నుంచి ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తేనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో ఎం.ఉమాశంకర్ కుమార్ తెలిపారు. ట్రైన్ డోర్ నుంచి నేరుగా లోపలికి వెళ్లేందుకు, ట్రైన్‌లోంచి నేరుగా బయటకు వచ్చేందుకు వీలుగా ఇవి పనిచేస్తాయి. మొదట పల్నాడు ఎక్స్‌ప్రెస్‌లోని థర్డ్ ఏసీ బోగీలో వీటిని వినియోగిస్తారు. ఆ తరువాత దశలవారీగా అన్ని రైళ్లకూ విస్తరించనున్నారు.

సాక్షి
జాతీయం / అంతర్జాతీయం
వైఎస్‌ఆర్ జిల్లా
ఆదివారం । జనవరి । 14 । 2018
8

ఢిల్లీలోని ఐఐటీలో కృత్రిమ మేధపై కోర్సును కొత్తగా ఈ ఏడాది జులైలో ప్రారంభించనున్నారు. ఈ కోర్సులో 20 మంది విద్యార్థులను చేర్చుకుంటారు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి.



'సంక్షోభం' సమసేందుకు!



నేడు ఆ నలుగురు జడ్జీలతో సీజేఐ భేటీ అయ్యే అవకాశం

- కొనసాగుతున్న తెరవెనుక సంప్రదింపులు
- పర్యవేక్షిస్తున్న జైట్లీ, రవిశంకర్, అటార్నీ జనరల్
- బయటివారి జోక్యం వద్దు.. త్వరలోనే పరిష్కారం: జస్టిస్ కురియన్
- ఎవరితోనూ వ్యక్తిగత భేదాభిప్రాయాల్లేవని స్పష్టీకరణ
- చర్చల కోసం ఏడుగురితో కమిటీ నియమించిన బార్ కౌన్సిల్
- సీజేఐ అపాయింట్‌మెంట్ కోసం వేచి చూసిన ప్రధాని ముఖ్య కార్యదర్శి
- మోదీ సమాధానం చెప్పాలని కాంగ్రెస్ డిమాండ్



ఢిల్లీలో సీజేఐ నివాసం నుంచి వెనుదిరుగుతున్న నృపేంద్ర మిశ్రా

న్యూఢిల్లీ

సుప్రీంకోర్టు సంక్షోభానికి వీలైనంత త్వరగా ముగింపు పలికేందుకు చర్యలు వేగవంతమయ్యాయి. కేంద్ర మంత్రులు అరుణ్ జైట్లీ, రవిశంకర్ ప్రసాద్, అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్‌ల పర్యవేక్షణలో ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ), మిగిలిన నలుగురు న్యాయమూర్తుల మధ్య సంప్రదింపుల ప్రక్రియ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. సుప్రీం న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు ఈ సంప్రదింపుల్లో చురుగ్గా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. సీజేఐ జస్టిస్ దీపక్ మిశ్రా కూడా ఆ నలుగురితో ఆదివారం సమావేశమయ్యే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి అధికారిక ప్రకటన వెలువడకపోయినా.. జస్టిస్ జోసెఫ్ కురియన్, జస్టిస్ రంజన్ గొగోయ్‌లు వేర్వేరు వేదికలపై చేసిన వ్యాఖ్యలు సమస్య త్వరితగతిన పరిష్కారమవుతుందనే సంకేతాలనిచ్చాయి. జస్టిస్ జాస్తి చలమేశ్వర్ మినహా మిగిలిన ముగ్గురు న్యాయమూర్తులు ఢిల్లీలో అందుబాటులో లేకపోవటంతో.. వీరంతా ఆదివారం రాజధానికి చేరుకున్న తర్వాత సీజేఐ వీరితో మాట్లాడనున్నట్లు సమాచారం. కాగా, ఇది న్యాయవ్యవస్థ అంతర్గత వివాదమని.. ఇందులో బయటివారి జోక్యం అవసరం లేదని జస్టిస్ కురియన్ పేర్కొన్నారు. అటు, అందరు సుప్రీం న్యాయమూర్తులతో సమావేశమై సమస్యను పరిష్కరించేందుకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఏడుగురు సభ్యుల బృందాన్ని ఏర్పాటు చేసింది. కేసుల కేటాయింపులో సీజేఐ తీరును నలుగురు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు నిరసించిన సంగతి తెలిసిందే.

రంగంలోకి బార్ కౌన్సిల్

మరోవైపు సమస్య పరిష్కారంలో చొరవతీసుకోవాలని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) నిర్ణయించింది. న్యాయమూర్తులతో చర్చించేందుకు ఏడుగురు సభ్యుల కమిటీని ఏర్పాటుచేసింది. ఈ బృందం ఆదివారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులందరినీ కలిసి వీలైనంత త్వరగా వివాదం సమసిపోయేందుకు వారితో చర్చిస్తుందని బీసీఐ అధ్యక్షుడు మనన్ మిశ్రా వెల్లడించారు. 'మేం మధ్యవర్తిత్వానికి సిద్ధంగా ఉన్నాం' అని ఆయన పేర్కొన్నారు. ఈ వివాదాన్ని రాజకీయం చేయాల్సిన పనిలేదని, రాజకీయ పార్టీలేమీ ఈ వివాదంలో జోక్యం చేసుకోవాల్సిన పనిలేదని (పరోక్షంగా రాహుల్ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ) ఆయన హెచ్చరించారు. 'ఈ వివాదంలో జోక్యం చేసుకోబోమని న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ పేర్కొన్నారు. ఆయన నిర్ణయాన్ని మేం స్వాగతిస్తున్నాం. అంతర్గత సమావేశాల ద్వారానే ఈ వివాదం పరిష్కారమవుతుంది' అని మనన్ మిశ్రా తెలిపారు. అటు, ఈ వివాద పరిష్కారంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులంతా చొరవతీసుకోవాలని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌సీబీఏ) తీర్మానం చేసింది. జనవరి 15న విచారణకు రానున్న ప్రజాప్రయోజన వ్యాజ్యాలను సీజేఐ నేతృత్వంలోని బెంచ్ లేదా కొలీజియం సభ్యులున్న ఇతర ధర్మాసనాలకు బదిలీ చేయాలని కోరింది.

సీజేఐ ఇంటికి మోదీ దూత!

అటు, ప్రధాని నరేంద్ర మోదీ ప్రధాన కార్యదర్శి నృపేంద్ర మిశ్రా శనివారం ఉదయం సీజేఐ జస్టిస్ దీపక్ మిశ్రాను కలిసేందుకు ఆయన ఇంటికి వెళ్లారు. అయితే సీజేఐ ఇంటిగేటు తెరవకపోవటంతో తన కారులోనే కాసేపు వేచి ఉండి.. అనంతరం తిరిగి వెళ్లినట్లు టీవీ కెమెరాల్లో రికార్డయింది. దీనిపై కాంగ్రెస్ విమర్శలు చేసింది. ప్రధాని తన వ్యక్తిగత కార్యదర్శిని ప్రత్యేక దూతగా సీజేఐ వద్దకు పంపేందుకు ప్రయత్నించారని విమర్శించింది. దీనికి ప్రధాని సమాధానం చెప్పాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. వివాదానికి కారణమైన వ్యక్తులే చొరవతీసుకుని సమస్యను పరిష్కరించుకోలేని నేపథ్యంలో రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలని డీఎంకే వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంకే స్టాలిన్ కోరారు. అయితే.. నలుగురు న్యాయమూర్తులు ధైర్యమైన నిర్ణయాన్ని తీసుకున్నారని శివసేన చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే పేర్కొన్నారు. న్యాయవ్యవస్థను చెవిటి, మూగ వ్యవస్థగా మార్చేందుకు ప్రయత్నాలు జరిగాయన్నారు. కాగా, కేబినెట్ మంత్రులు కూడా సుప్రీంకోర్టు న్యాయమూర్తుల్లా బయటకొచ్చి మాట్లాడాలని.. వారిలో నెలకొన్న భయాన్ని పక్కనపెట్టాలని కేంద్ర మాజీ మంత్రి యశ్వంత్ సిన్హా సూచించారు.

'దురుద్దేశంతోనే పిటిషన్'

సీబీఐ ప్రత్యేక కోర్టు జడ్జి బీహెచ్ లోయా మృతిపై సమగ్ర విచారణ జరపాలంటూ దురుద్దేశంతోనే సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైందని బాంబే లాయర్ల అసోసియేషన్(బీఎల్‌ఏ) ఆరోపించింది. ఈ విషయంపై తాము బాంబే హైకోర్టులో వేసిన పిటిషన్ విచారణను అడ్డుకోవడానికే జర్నలిస్టు బీఆర్ లోనె సుప్రీంకోర్టులో ఆ పిటిషన్ దాఖలుచేసినట్లు పేర్కొంది. కేసుల కేటాయింపులో సీజేఐ మిశ్రా అనుచితంగా వ్యవహరిస్తున్నారంటూ నలుగురు జడ్జీలు గళమెత్తిన నేపథ్యంలో బీఎల్‌ఏ అధ్యక్షుడు అహ్మద్ అబ్ది శనివారం ప్రెస్‌మీట్ నిర్వహించారు. జనవరి 4న తాము బాంబే హైకోర్టులో పిటిషన్ వేసిన తరువాతే లోనె సుప్రీంకోర్టును ఆశ్రయించారని అహ్మద్ వెల్లడించారు. అత్యున్నత న్యాయస్థానం పరిధికి చేరిన విషయాన్ని బాంబే హైకోర్టు విచారణకు చేపట్టకుండా చూసేందుకు దురుద్దేశంతోనే ఇలా చేశారని ఆరోపించారు.

10 నుంచి కర్ణాటకలో రాహుల్ పర్యటన



న్యూఢిల్లీ: కర్ణాటకలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ ఫిబ్రవరి 10 నుంచి 12వ తేదీ వరకు తమ రాష్ట్రంలో పర్యటిస్తారని కర్ణాటక కాంగ్రెస్ అధ్యక్షుడు పరమేశ్వర తెలిపారు. రాహుల్ ప్రచారం బెంగళూరు నుంచి ప్రారంభమవుతుందన్నారు. ఈ పర్యటనలో ఆయన రైతులు, మేధావులు, విద్యార్థులతో పాటు వివిధ రంగాల వారిని కలుసుకుని మాట్లాడతారన్నారు. కర్ణాటక అసెంబ్లీకి మార్చి లేదా ఏప్రిల్‌లో ఎన్నికలు జరగనున్నాయి.

ఆసియాన్ సదస్సులో రామాయణ కథలు!



సాక్షి ప్రతినిధి, న్యూఢిల్లీ: మహాకావ్యం రామాయణానికి ఒక్క భారత్‌తోనే కాదు ఆసియాన్ దేశాలతోనూ విడదీయరాని బంధముంది. చరిత్ర, నాగరికతల పరంగా భారత్‌ను ఆసియాన్ దేశాలతో మమేకం చేసింది ఈ ఇతిహాసమే. ఈ విశేషాలు ప్రస్ఫుటించేలా 25–26న ఢిల్లీలో జరిగే భారత్–ఆసియాన్ సదస్సులో ఆయా దేశాలకు చెందిన కళాకారులు రామాయణంలోని కొన్ని ఘట్టాలను ప్రదర్శించనున్నారు. ఆసియాన్ దేశాల(ఇండోనేసియా, సింగపూర్, ఫిలిప్పైన్స్, మలేసియా, థాయిలాండ్, కాంబోడియా, వియత్నాం, బ్రూనై, మయన్మార్, లావోస్) అధినేతలు ఈ కార్యక్రమాల్ని తిలకించనున్నారు. భారత్–ఆసియాన్ సంబంధాలకు పాతికేళ్లు పూర్తయిన సందర్భంగా ఈసారి జరిగే గణతంత్ర వేడుకలకు ఆ దేశాల అధినేతలను ముఖ్య అతిథులుగా ఆహ్వానించారు. ఆసియాన్ దేశాలతో దౌత్య సంబంధాలు మెరుగుపరచుకోవడంలోనూ రామాయణం దోహదపడింది.

సమస్య పరిష్కారమైనట్లే: జస్టిస్ కురియన్



సుప్రీంకోర్టులో రాజ్యాంగ సంక్షోభమేమీ లేదని.. తాము లేవనెత్తిన సమస్యలకు సామరస్యపూర్వక పరిష్కారం లభిస్తుందని జస్టిస్ కురియన్ కొచ్చిలో వెల్లడించారు. 'రాజ్యాంగ సంక్షోభమేమీ లేదు. విధానంలోని లోపాలను సరిదిద్దాలనేదే మా అభిమతం. సీజేఐకి ఇచ్చిన లేఖలో ప్రతి అంశాన్నీ పేర్కొన్నాం. ఈ లేఖను రెండు నెలల క్రితమే ఆయనకు ఇచ్చాం' అని తెలిపారు. రాష్ట్రపతి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని నియమించేందుకు మాత్రమే అధికారమున్నందున ఆయనకు ఈ విషయాన్ని వెల్లడించలేదన్నారు. 'మేం ఓ కారణం కోసం దీన్ని లేవనెత్తాం. ఈ సమస్య త్వరగానే పరిష్కారమవుతుందని భావిస్తున్నాం. ఇది ఎవరికీ వ్యతిరేకంగా చేస్తున్నది కాదు. మాకు వ్యక్తిగత విభేదాలేమీ లేవు. పారదర్శకత ఉండాలనేదే మా అభిప్రాయం' అని జస్టిస్ కురియన్ పేర్కొన్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం బయటివారు చొరవతీసుకోవాల్సిన పనేం లేదని జస్టిస్ కురియన్ పేర్కొన్నారు. 'విషయాన్ని లేవనెత్తాం. సంబంధించిన వాళ్లు దీన్ని విన్నారు. ఇలాంటివి భవిష్యత్తులో జరగకూడదు. సమస్య పరిష్కారమైందని నేను భావిస్తున్నాను. న్యాయవ్యవస్థ అంతర్గతంగా నెలకొన్న వివాదమిది. దీనిలో వేరే వ్యక్తుల జోక్యం అవసరం లేదు. వ్యవస్థే ఇందుకు అవసరమైన చర్యలు తీసుకుంటుంది' అని ఆయన తెలిపారు. 'సీజేఐ తరపునుంచి ఎలాంటి రాజ్యాంగపరమైన పొరపాటు జరగలేదు. కానీ ఆయన బాధ్యతల నిర్వహణలో సంప్రదాయ విధివిధానాలను అనుసరించాల్సింది. ఇదే విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లాం. మార్పు చేసుకోవటం ద్వారా ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. మేం న్యాయం కోసం నిలబడ్డాం' అని ఆయన పేర్కొన్నారు. కోల్‌కతాలో జరిగిన ఓ న్యాయసేవ కార్యక్రమంలో పాల్గొన్న మరో న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ కూడా సంక్షోభమేమీ లేదని వెల్లడించారు. కాగా, ఈ వివాదం సోమవారం కల్లా పరిష్కారమవుతుందని అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ ధీమాగా చెప్పారు. 'సోమవారానికల్లా న్యాయమూర్తుల మధ్య ఐక్యత నెలకొంటుంది. న్యాయవ్యవస్థ ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకుని సమస్యకు పరిష్కారం లభిస్తుంది. న్యాయమూర్తులు మేధావులు, అనుభవజ్ఞులు, రాజనీతిజ్ఞత గలవారు. వివాదాన్ని మరింత పెద్దది చేయాలని వారను కోరు' అని వేణుగోపాల్ పేర్కొన్నారు.

17 నుంచి 8 కీలక కేసులపై విచారణ



ఒకవైపు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, నలుగురు సీనియరు న్యాయమూర్తుల మధ్య వివాదం కొనసాగుతుండగా.. మరోవైపు జనవరి 17 నుంచి ఐదుగురు సభ్యుల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనాలు 8 కీలక అంశాలపై విచారణ చేపట్టనున్నాయి. సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో వెల్లడించిన వివరాల ప్రకారం.. రాజ్యాంగ పరంగా ఆధార్ చెల్లుబాటు అవుతుందా? లేదా? అన్న అంశాన్ని తేల్చడంతో పాటు 2013లో స్వలింగ సంపర్కం కేసులో తానిచ్చిన తీర్పును ఈ రాజ్యాంగ ధర్మాసనాలు పునః పరిశీలిస్తాయి. వివాదాస్పద అంశమైన కేరళలోని శబరిమల ఆలయంలోకి 10 నుంచి 50 ఏళ్లలోపు వయసున్న మహిళలకు ప్రవేశంపై నిషేధంతో పాటు, వేరే మతస్తుడిని పార్సీ మహిళ పెళ్లి చేసుకుంటే తన మత గుర్తింపును కోల్పోతుందా? అన్న విషయాన్ని కూడా ఈ రాజ్యాంగ ధర్మాసనాలు విచారించనున్నాయి. వ్యభిచారం కేసుల్లో ఐపీసీ సెక్షన్ చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన కేసును కూడా సుప్రీంకోర్టు చేపట్టనుంది. వివాహేతర సంబంధం కేసుల్లో కేవలం పురుషుడినే శిక్షించేందుకు అవకాశమిస్తోన్న ఈ ఐపీసీ సెక్షన్ చెల్లుబాటును రాజ్యాంగ ధర్మాసనం విచారించనుంది. అలాగే చట్టసభ్యులు ఎప్పుడు క్రిమినల్ విచారణ ఎదుర్కొంటారు.. వారి అనర్హతకు సంబంధించిన పిటిషన్ కూడా విచారణకు రానుంది. ఈ అంశాల్ని ఇంతకముందే విచారించిన సుప్రీంకోర్టు ధర్మాసనాలు.. కీలక అంశాలు కావడంతో రాజ్యాంగ ధర్మాసనాలకు సిఫార్సు చేశాయి.



ముంబైలోని ములుంద్ ప్రాంతంలో ఓ ఇంట్లో నక్కిన చిరుతకు మత్తు మందు ఇంజెక్షన్ ఇస్తున్న అటవీ సిబ్బంది. ఈ చిరుత శుక్రవారం రాత్రి ఇంట్లోకి ప్రవేశించి ఏడుగురిని గాయపరిచింది.

ప్రైవేట్ లాకర్లలో రూ. 85 కోట్ల నల్లధనం!

న్యూఢిల్లీ: ఆదాయ పన్ను శాఖ అధికారులు ఢిల్లీలో రహస్య ప్రైవేట్ లాకర్ల నుంచి భారీగా నగదు, ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నల్లధన వ్యతిరేక చర్యల్లో భాగంగా సౌత్ ఎక్స్‌టెన్షన్ ప్రాంతంలో చేపట్టిన తనిఖీల్లో బయటపడ్డ వీటి విలువ సుమారు రూ.85 కోట్లని తెలిసింది. గత వారం రోజుల్లో ఇక్కడి ప్రైవేట్ లాకర్ల నుంచి రూ.61 కోట్ల విలువైన ఆస్తులను ఐటీ అధికారులు జప్తుచేశారు. తాజాగా వెలుగుచూసిన రహస్య సొమ్ములో రూ.77 కోట్ల విలువైన బంగారు నగలు, బిస్కెట్లు, వజ్రాలు, రూ.8 కోట్ల నగదు ఉన్నట్లు ఐటీ అధికార వర్గాలు తెలిపాయి. ఈ సంపద ఢిల్లీలోని బిల్డర్, గుట్కా వ్యాపారి, ఇతర వ్యాపారులకు చెందినదని భావిస్తున్నారు.

ఆ 277 ఎకరాలు మావే: నిజాం వారసులు

ఔరంగాబాద్: ఏడో నిజాం నవాబ్ మీర్ ఉస్మాన్ అలీఖాన్‌కు ఔరంగాబాద్‌లో 277 ఎకరాల భూములున్నాయని, వాటిని తమకు అప్పగించాలంటూ ఆయన వారసులు మహారాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శనివారం నవాబ్ మనవడు జనాఫ్ అలీఖాన్ మీడియాతో మాట్లాడారు. ఔరంగాబాద్‌లోని మొత్తం 277 ఎకరాల్లో హిమాయత్‌బాగ్‌లో 160 ఎకరాలు, అహ్మద్‌బాగ్‌లో 94 ఎకరాలు, నవ్‌ఖండా ప్యాలెస్ ప్రాంతంలో మిగతాది ఉందని తెలిపారు. ఇవి ఏడో నిజాంకు చెందినవని చెప్పే ఆధారాలు తమ వద్ద ఉన్నాయని వివరించారు. 1950లో కేంద్ర ప్రభుత్వంతో నిజాంకు కుదిరిన ఒప్పందంలో ఈ స్థిరాస్తుల వివరాలున్నాయని తెలిపారు.

పడవ మునిగి ముగ్గురు విద్యార్థినుల మృతి

ముంబై: మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలో సముద్ర తీరానికి 20 మైళ్ల దూరంలో జరిగిన పడవ ప్రమాదంలో ముగ్గురు విద్యార్థినులు మరణించారు. మరో ఐదుగురి ఆచూకీ గల్లంతయ్యింది. 32 మంది విద్యార్థులను తీర ప్రాంత రక్షణ విభాగం సిబ్బంది, స్థానిక జాలరులు రక్షించారు. పాల్ఘర్ జిల్లా దహను పట్టణంలోని పొండా స్కూల్ అండ్ జూనియర్ కాలేజ్‌కు చెందిన 40 మంది విద్యార్థులు ఓ ప్రైవేటు పడవలో శనివారం సముద్రంలోకి విహారయాత్రకు వెళ్లారు. ఉదయం సమయంలో అనూహ్యంగా పడవ మునిగిపోవడంతో ఈ దుర్ఘటన జరిగింది. సహాయక చర్యల కోసం తీరప్రాంత రక్షణ దళం తన నౌకలను, విమానాన్ని వినియోగిస్తున్నారు.

నాణేల ముద్రణను పునరుద్ధరించండి: కేంద్రం

కోల్‌కతా: నాణేల ముద్రణ నిలిపేయాలంటూ దేశంలోని నాలుగు నాణేల ముద్రణ కేంద్రాలకు జారీ చేసిన ఆదేశాలపై కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. నాణేల ముద్రణను తిరిగి ప్రారంభించాలని, అయితే ముద్రణ వేగాన్ని తగ్గించాలని సూచించింది. ఈ మేరకు సెక్యూరిటీ ప్రింటింగ్ అండ్ మింటింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎస్పీఎంసీఐఎల్)కు కేంద్రం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఎస్పీఎంసీఐఎల్ పరిధిలో ఉన్న 4 ముద్రణా కేంద్రాల్లో గతంలో లాగా 2 షిఫ్టుల్లో కాకుండా ఒక్క షిఫ్టులోనే ముద్రణ కొనసాగించాలని తెలిపింది. 2017–18కి గాను 7,712 మిలియన్ల నాణేలు ముద్రించాల్సిందిగా రిజర్వ్ బ్యాంకు తమకు జారీ చేసిన ఇండెంట్‌లో పేర్కొంది. బ్యాంకుల్లో స్థలం లేనికారణంగా నాణేల ముద్రణ నిలిపేయాలంటూ ఈ నెల 9న కేంద్రం ఎస్పీఎంసీఐఎల్‌కు ఆదేశాలిచ్చింది.

విమానాలకు భోగి మంటల సెగ

- చెన్నైని కప్పేసిన పొగమంచు
- 40 విమాన సర్వీసులపై ప్రభావం



శనివారం చెన్నైలో దట్టంగా కమ్మిన పొగమంచు

చెన్నై: సంక్రాంతి భోగి మంటలు విమానాలు, రైళ్లకు పెద్ద సమస్య తెచ్చిపెట్టాయి. వాటి ద్వారా వ్యాపించిన దట్టమైన పొగతో చెన్నైలో రాకపోకలు స్తంభించాయి. శనివారం ఉదయం చెన్నై విమానాశ్రయాన్ని భారీ పొగమంచు కప్పేయడంతో 40 వరకు జాతీయ, అంతర్జాతీయ సర్వీసులపై తీవ్ర ప్రభావం పడింది. మరికొన్ని ఆలస్యంగా నడిచాయి. కువైట్, షార్జా, ఢిల్లీ నుంచి చెన్నైకి రావాల్సిన 18 విమానాలను హైదరాబాద్, బెంగళూరు వైపు దారి మళ్లించారు. పొగమంచు దట్టంగా కప్పేయడంతో వేకువజామున 4 గంటల నుంచి బయలుదేరాల్సి న, రావాల్సిన విమాన సర్వీసులకు అంతరాయం కలిగిందని విమానాశ్రయ అధికారులు తెలిపారు. షార్జా, దోహా వెళ్లాల్సిన రెండు విమానాలు రద్దవడంతో ప్రయాణికులకు నగరంలో వసతి కల్పించామన్నారు. ఉదయం 9.30 గంటల తర్వాత విమానాల రాకపోకలు యథాతథంగా కొనసాగుతున్నట్లు వెల్లడించారు. మరోవైపు పొగమంచు వల్ల అంతర్రాష్ట్ర రైలు సర్వీసులు 30–40 నిమిషాలు ఆలస్యంగా నడిచాయని, సబర్బన్ సర్వీసులూ ఆలస్యమయ్యాయని దక్షిణ రైల్వే అధికారులు చెప్పారు. 9 గంటల తర్వాత కార్యకలాపాలు సాధారణ స్థాయికి చేరుకున్నాయన్నారు. ఆదివారం సంక్రాంతి నేపథ్యంలో శనివారం స్థానికులు భోగి మంటలు వేశారు. పాత వస్తువులకు నిప్పు పెట్టడంతో దట్టమైన పొగ కమ్ముకుంది.

కార్తీ ఇళ్లపై ఐటీ దాడులు



ఢిల్లీలో తన ఇంటి వద్ద చిదంబరం

సాక్షి, చెన్నై/న్యూఢిల్లీ: ఎయిర్‌సెల్–మాక్సిస్ మనీలాండరింగ్ కేసు విచారణలో భాగంగా ఈడీ అధికారులు శనివారం ఉదయం మాజీ కేంద్రమంత్రి చిదంబరం, ఆయన కుమారుడు కార్తీకి చెందిన 10 ప్రాంతాల్లో సోదాలు చేపట్టారు. ఢిల్లీలోని చిదంబరం నివాసం, చెన్నైలోని కార్తీ నివాసం, కార్తీ చార్టెర్డ్ అకౌంటెంట్, అతని వ్యక్తిగత సహాయకుడి ఇళ్లు తదితర చోట్ల తనిఖీలు జరిగాయి. దక్షిణ ఢిల్లీ జోర్‌బాగ్‌లో ఉన్న తన నివాసంలోకి వచ్చిన ఈడీ అధికారులు కార్తీ ఇంట్లో సోదా చేయటానికి వచ్చినట్లు చిదంబరం మీడియాతో చెప్పారు. అయితే, తన కుమారుడు కార్తీ చెన్నైలో ఉంటారని, ఇది తన నివాసమని వారికి తెలిపానన్నారు. ప్రభుత్వ ప్రోద్బలంతోనే ఈడీ ఈ సోదాలు చేపట్టిందన్నారు. ఈడీ దాడులను 'నగుబాటు చర్యలు'గా ఆయన అభివర్ణించారు. ఐఎన్‌ఎక్స్ మీడియాలో విదేశీ పెట్టుబడుల వ్యవహారం కేసులో కార్తీ పాత్రపైనా విచారిస్తున్నామని ఈడీ పేర్కొంది. గత ఏడాది డిసెంబర్ ఒకటో తేదీన కూడా కార్తీతోపాటు ఆయన బంధువుల ఇళ్లపై ఈడీ సోదాలు జరిపింది. సుప్రీంకోర్టు జడ్జీల అంశంపై నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే బీజేపీ ప్రభుత్వం చిదంబరం, కార్తీ ఇళ్లపై ఈడీ దాడులు చేయించిందని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ ఆరోపించారు.

డిఫాల్టర్లకు చైనా ప్రభుత్వం చుక్కలు!

బీజింగ్: ఇచ్చిన రుణాలను వసూలు చేసుకోవడానికే భారత్‌లో నానా కష్టాలు పడుతుంటే చైనా ప్రభుత్వం అక్కడి డిఫాల్టర్లకు చుక్కలు చూపిస్తోంది. 2017 చివరినాటికి రుణాల ఎగవేతకు పాల్పడిన 95.9 లక్షల మంది ప్రజల్ని కోర్టులు నిషేధిత జాబితాలో చేర్చినట్లు సుప్రీం పీపుల్స్ కోర్టు(ఎస్పీసీ) తెలిపింది. డిఫాల్టర్ల రూ.1.76 లక్షల కోట్ల(27.7 బిలియన్ డాలర్లు) డిపాజిట్లను జప్తు చేశారు. పాస్‌పోర్టులు, గుర్తింపు కార్డుల ఆధారంగా విమానాలు, హైస్పీడ్ రైళ్లలో టికెట్లు కొనకుండా అడ్డుకున్నారు. డిఫాల్టర్లు దాఖలు చేసే రుణ, క్రెడిట్ కార్డ్ దరఖాస్తుల్ని తిరస్కరించేందుకు బ్యాంకులతో కలిసి పనిచేశారు. నిషేధిత జాబితాలోని వ్యక్తులు కార్పొరేట్ సంస్థల ప్రతినిధులుగా ఇకపై ఉండలేరు.

ముంబై తీరంలో కూలిన హెలికాప్టర్

ఐదుగురు దుర్మరణం.. ఇద్దరు గల్లంతు



సముద్రజలాల్లో గాలింపు దృశ్యం

సాక్షి, ముంబై: ముంబై తీరంలో పవన్‌హన్స్ సంస్థకు చెందిన హెలికాప్టర్ కుప్పకూలిన ఘటనలో ఐదుగురు మృతి చెందగా.. ఇద్దరు గల్లంతయ్యారు. ప్రభుత్వ రంగ చమురు సంస్థ ఓఎన్‌జీసీకి చెందిన ఐదుగురు అధికారులు, ఇద్దరు పైలట్లు సహా ఏడుగురితో ప్రయాణిస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. జుహూలోని పవన్ హన్స్ విమానాశ్రయం నుంచి శనివారం ఉదయం 10.20 గంటలకు ఓఎన్‌జీసీకి చెందిన డీజీఎం స్థాయి అధికారులు సహా ఐదుగురు సిబ్బంది, ఇద్దరు పైలట్లతో హెలికాప్టర్ టేకాఫ్ అయ్యింది. 10.30 గంటల సమయంలో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్(ఏటీసీ)తో సంబంధాలు తెగిపోయాయి. వెంటనే ఓఎన్‌జీసీ, కోస్ట్‌గార్డ్, నేవీ బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. గాలింపు చర్యల అనంతరం దహాణు సమీపంలో హెలికాప్టర్ అవశేషాలను గుర్తించారు. ఐదు మృతదేహాలను వెలికితీశారు. గల్లంతైన ఇద్దరి కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. కాగా, ఓఎన్‌జీసీకి ముంబై తీరంలో కీలకమైన చమురు నిక్షేపాలు ఉన్నాయి.

శృంగార తారతో ట్రంప్ ఒప్పందం!

- వాల్ స్ట్రీట్ జర్నల్ పత్రిక కథనం
- పాత కథనాన్నే వండి వార్చారు..
- ఈ ఆరోపణల్ని గతంలోనే ట్రంప్ తిరస్కరించారు: వైట్ హౌస్



స్టెఫానీ క్లిఫోర్డ్



ట్రంప్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శృంగార లీలలు మరోసారి వెలుగులోకి వచ్చాయి. పోర్న్ స్టార్ స్టెఫానీ క్లిఫోర్డ్‌తో లైంగిక వ్యవహారం వెలుగులోకి రాకుండా.. అధ్యక్ష ఎన్నికలకు ముందు ఆమెకు నెలకు దాదాపు రూ. 85 లక్షలు ఇచ్చేలా ట్రంప్ ఒప్పందం కుదుర్చుకున్నారని వాల్ స్ట్రీట్ జర్నల్ పత్రిక పేర్కొంది. స్టార్మీ డేనియల్స్ పేరుతో పోర్న్ సినిమాల్లో నటించిన క్లిఫోర్డ్‌తో 2006లో ఒక గోల్ఫ్ కార్యక్రమం సందర్భంగా ట్రంప్‌కు పరిచయం ఏర్పడింది. 2016 అమెరికా అధ్యక్ష ఎన్నికల సమయంలో ట్రంప్‌తో సంబంధాన్ని బయట పెట్టేందుకు 'ఏబీసీ న్యూస్'ను క్లిఫోర్డ్ సంప్రదించారని, అయితే భారీ మొత్తంలో డబ్బు ఇచ్చేలా ట్రంప్ న్యాయవాది మైకేల్ కోహెన్ మధ్యవర్తిత్వం వహించడంతో ఆమె వెనక్కి తగ్గారని వాల్ స్ట్రీట్ జర్నల్ తెలిపింది. 2005లో మెలానియాను ట్రంప్ వివాహం చేసుకున్నారు. అయితే క్లిఫోర్డ్‌తో ఎలాంటి సంబంధం లేదని ట్రంప్ ఇప్పటికే స్పష్టం చేశారని.. డబ్బులు తీసుకున్నట్లు వచ్చిన వార్తల్లో నిజం లేదని క్లిఫోర్డ్ కూడా చెప్పారని పేర్కొంటూ ట్రంప్ న్యాయవాది కోహెన్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఇవి దిగజారుడు ఆరోపణలని ఆయన పేర్కొన్నారు. కాగా తనకు ట్రంప్‌కు సంబంధం లేదని క్లిఫోర్డ్ చెప్పడం గమనార్హం. ఈ వ్యవహారంపై వైట్ హౌస్ స్పందిస్తూ.. పాత కథనాన్ని మళ్లీ వండి వర్చారని.. ఈ ఆరోపణల్ని గతంలోనే ట్రంప్ తిరస్కరించారని తెలిపింది. కాగా 'స్లేట్' అనే ఆన్‌లైన్ పత్రికను కూడా క్లిఫోర్డ్ సంప్రదించారని న్యూయార్క్ టైమ్స్ పత్రిక తన కథనంలో పేర్కొంది.

ట్రంప్ ఆరోగ్యం భేష్: వ్యక్తిగత వైద్యుడు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పూర్తి ఆరోగ్యంతో ఉన్నారని ఆయన వ్యక్తిగత వైద్యుడు రోనీ జాక్సన్ వెల్లడించారు. అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ట్రంప్ తొలిసారి పూర్తి స్థాయి వైద్య పరీక్షలకు హాజరయ్యారు. వాల్టర్ రీడ్ నేషనల్ మిలట్రీ వైద్య కేంద్రంలో ట్రంప్‌కు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, కొలెస్ట్రాల్, మధుమేహం, బరువు చెక్ చేయడంతో గుండె పరీక్షలు నిర్వహించామని, పరీక్షలన్నీ సజావుగా సాగాయని జాక్సన్ తెలిపారు. గత దశాబ్దకాలానికి పైగా ఆయన అధ్యక్షుడి వ్యక్తిగత వైద్యుడిగా కొనసాగుతున్నారు. ట్రంప్ వైద్య పరీక్షలకు సంబంధించి పూర్తి వివరాలను జనవరి 16న మీడియాకు ఆయన వివరిస్తారు. ట్రంప్ ఆరోగ్యంపై పలువురు రాజకీయ ప్రత్యర్థులు సందేహాలు లేవనెత్తిన నేపథ్యంలో ఈ వైద్య పరీక్షలపై ఆసక్తి నెలకొంది. తన ఆరోగ్యంపై వస్తున్న ఊహాగానాల్ని ఇప్పటికే ట్రంప్ ఖండించారు. 6.2 అడుగులు ఉన్న ట్రంప్ బరువు 107 కిలోలు కాగా.. బీఎంఐ 29కి పైనే ఉండడంతో అధిక బరువుండే వారి కేటగిరీలో కొనసాగుతున్నారు. కాగా ప్రతీ ఏడాది అధ్యక్షుడికి వైద్య పరీక్షలు నిర్వహించడం రివాజు.

సాక్షి
రౌండప్
వైఎస్ఆర్ జిల్లా
ఆదివారం । జనవరి । 14 । 2018
www.sakshi.com
9

దేశంలోని హైకోర్టుల్లోకెల్లా పురాతనమైనది కోల్‌కతాలోని హైకోర్టు. దీన్ని 1862 జూలై 1న ప్రారంభించారు.



- పాడైపోయిన పైకప్పు, వర్షం వస్తే తీవ్ర ఇక్కట్లు
- అందుబాటులో ఒకే ఒక్క గది
- స్కూల్ అభివృద్ధిని పట్టించుకోని చంద్రబాబు

ఇది.. సీఎం చదివిన స్కూల్

మోడల్ స్కూల్ హామీ ఇచ్చి ఏడాది గడిచినా ఫలితం శూన్యం



శిథిలావస్థలో పాఠశాల



శేషాపురంలో శిథిలావస్థకు చేరుకున్న సీఎం చంద్రబాబు నాయుడు చదివిన ప్రాథమిక పాఠశాల



తరగతి గదిలో పై భాగం పెచ్చులూడిన దృశ్యం



తరగతి గదిలో అపరిశుభ్ర వాతావరణం

చంద్రగిరి: పుట్టిన ఊరు, చదివిన బడిని ఎవరూ మరిచిపోరు. జీవితంలో ఒక స్థాయికి వచ్చిన తర్వాత వాటి అభివృద్ధికి పాటుపడటం కనీస ధర్మం. అయితే సామాన్య రైతు కుటుంబంలో జన్మించి నేడు ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగిన నారా చంద్రబాబు నాయుడు దీన్ని విస్మరించారు. చిత్తూరు జిల్లా చంద్రగిరి మండల పరిధిలోని నారావారిపల్లెకు కూతవేటు దూరంలో ఉన్న శేషాపురం ప్రాథమిక పాఠశాల ఒకప్పుడు విద్యార్థులతో కళకళలాడుతూ ఉండేది. ఇక్కడ చదివిన విద్యార్థులు నేడు దేశవ్యాప్తంగా ఉన్నత స్థానాల్లో ఉన్నారు. చంద్రబాబు కూడా ఇదే పాఠశాల్లో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు విద్యనభ్యసించారు. కాగా, ప్రతిపక్ష నేత, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా చంద్రగిరి నియోజకవర్గంలోని దామలచెరువులో ఈ నెల 7న మాట్లాడుతూ సీఎం చంద్రబాబు చదివిన పాఠశాల దీనావస్థకు చేరిందని, చదువుకున్న పాఠశాలపైన, ఊరిపైనా ఆయనకు ఏ మాత్రం ప్రేమలేదని విమర్శించారు. ఈ నేపథ్యంలో 'సాక్షి' శేషాపురం పాఠశాలకు వెళ్లి పరిశీలించగా పాఠశాల దారుణ పరిస్థితుల్లో ఉన్నట్లు వెల్లడైంది.

సాక్షాత్తూ సీఎం చదువుకున్న ఈ పాఠశాల పైకప్పు పూర్తిగా పాడైపోయింది. అందుబాటులో ఉన్న ఒకే ఒక్క గది వాన కురిస్తే వర్షపు నీటితో తడిసిముద్దవుతుంది. క్రీడా మైదానం, కంప్యూటర్ ల్యాబ్, తాగు నీరు తదితర కనీస వసతులు, సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాను చదువుకున్న పాఠశాలను అభివృద్ధి చేయాలనే ఆలోచన అటు ముఖ్యమంత్రికి, ఇటు జిల్లా అధికారులకు లేకపోవడంతో పాఠశాల శిథిలావస్థకు చేరింది. గతంలో వందల సంఖ్యలో శేషాపురం పాఠశాలలో విద్యార్థులు చదువుకునేవారు. నేడు ఇద్దరు ఉపాధ్యాయులు, కేవలం 20 మంది విద్యార్థులకు మాత్రమే పరిమితమైంది. ప్రస్తుత ప్రభుత్వం సర్కారీ పాఠశాలలను విస్మరించి, ప్రైవేటు పాఠశాలలను ప్రోత్సహిస్తోందనడానికి ఇది ఒక ఉదాహరణగా నిలిచిపోతోంది. శేషాపురంలో 100 మందికి పైగా విద్యార్థులున్నారు. దళిత కుటుంబాలకు చెందినవారు మినహా, మిగిలిన వారందరూ ప్రైవేటు స్కూళ్ల బాట పట్టారు. దీనిపై స్థానిక సర్పంచ్, గ్రామస్తులు పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మోడల్ స్కూల్ హామీకి దిక్కు లేదు

నారావారిపల్లె పంచాయతీని ఆనుకుని శేషాపురం, చిన్నరామాపురం, బీమవరం, యల్లంపల్లి పంచాయతీలు ఉన్నాయి. ఇవన్నీ మారుమూల గ్రామాలు కావడంతో అక్కడి చిన్నారులకు నాణ్యమైన విద్య అందని ద్రాక్షగా మారింది. గతేడాది సంక్రాంతికి సీఎం నారావారిపల్లె వచ్చే ముందు శేషాపురం పాఠశాలను సందర్శించిన అప్పటి కలెక్టర్ సిద్ధార్థజైన్ నారావారిపల్లెలో సుమారు 5 ఎకరాల్లో హాస్టల్‌తోపాటు కార్పొరేట్ స్థాయి మోడల్ పాఠశాలను ఏర్పాటు చేస్తామని, ఆరు పంచాయతీల పిల్లలకు ఉత్తమ విద్యనందిస్తామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర నిధులతో జిల్లాకే తలమానికంగా నిలిచేలా పాఠశాలను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. అయితే అది ఇంతవరకు ఆచరణలోకి రాలేదు. దీంతో ఈ నెల 5న జరిగిన జన్మభూమి కార్యక్రమంలో నారావారిపల్లె సర్పంచ్ చంద్రకుమార్ నాయుడు అధికారులను నిలదీసినా వారి నుంచి స్పందన కరువైంది.

శ్రీశైలంలో అన్యమత ప్రచారం



పాస్టర్లను విచారణ చేస్తున్న శ్రీశైలం పోలీసులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం పరిధిలో అన్యమత ప్రచారం జరుగుతుండటాన్ని శనివారం సాయంత్రం దేవస్థానం అడ్వొకేట్ గిరిధర్ గుర్తించారు. వీరిని పట్టుకొని పోలీసులకు సమాచారమిచ్చారు. వీరిని ఆళ్లగడ్డకు చెందిన పాస్టర్లుగా పోలీసులు గుర్తించి స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు. కాగా, దేవాదాయ చట్టం ప్రకారం శ్రీశైల దేవస్థానం పరిధిలో అన్యమత ప్రచారం చేయకూడదు. అన్యమతానికి చెందిన వారు తరుచూ శ్రీశైలం వచ్చి ప్రచారం నిర్వహిస్తుండడంతో దేవస్థానం అధికారులు నిఘా ఏర్పాటు చేశారు.

టీడీపీ మహిళా సర్పంచ్ ఆత్మహత్య

గుంటూరు జిల్లా నారాకోడూరులో విషాదం



లక్ష్మీ దుర్గ(ఫైల్)

చేబ్రోలు(పొన్నూరు): అధికార టీడీపీకి చెందిన ఓ మహిళా సర్పంచ్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన గుంటూరు జిల్లాలోని చేబ్రోలు మండలం నారాకోడూరులో శనివారం చోటు చేసుకుంది. సంక్రాంతి పండుగ వేళ జరిగిన ఈ సంఘటన స్థానికంగా సంచలనం కలిగించింది. నారాకోడూరుకు చెందిన మునగా కోటేశ్వరరావు మూడో కుమార్తె లక్ష్మీదుర్గ(32) పదమూడేళ్లక్రితం ఇదే గ్రామానికి చెందిన జాలాది భానును ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. తెలుగుదేశం పార్టీకి చెందిన లక్ష్మీదుర్గ గత పంచాయతీ ఎన్నికల్లో నారాకోడూరు గ్రామ సర్పంచ్‌గా పోటీ చేసి గెలుపొందారు. ఆమె ఉన్నట్టుండీ శనివారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతురాలికి భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. లక్ష్మీదుర్గ మృతి పట్ల కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎస్ఐ వి.బాబూరావు సంఘటనాస్థలానికి చేరుకుని మృతికి గల కారణాలను విచారిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. సంఘటన గురించి తెలియగానే.. పొన్నూరు, తెనాలి ఎమ్మెల్యేలు డి.నరేంద్రకుమార్, ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లు గ్రామానికి చేరుకుని లక్ష్మీదుర్గ మృతదేహం వద్ద నివాళి అర్పించారు. కుటుంబసభ్యుల్ని పరామర్శించారు.

ఐటీ హబ్‌గా తిరుపతి

సీఎం చంద్రబాబు



రేణిగుంట/సాక్షి, తిరుపతి: తిరుపతిని ఐటీ హబ్‌గా తీర్చిదిద్దుతానని సీఎం చంద్రబాబు తెలిపారు. శనివారం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ఆయన అక్కడ జోహో సాఫ్ట్‌వేర్ కంపెనీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తాము ఐటీ కంపెనీలతో పోటీపడుతూ టైం గవర్నెన్స్ చేస్తూ మార్చి నెలాఖరుకల్లా పేపర్‌లెస్ కార్యాలయాలను తయారు చేస్తామన్నారు. జోహో కంపెనీ తిరుపతిలో నెలకొల్పడం సంతోషకరమన్నారు. మౌళిక వసతులను అభివృద్ధి చేసుకునేందుకు ఎంతభూమి, ఎక్కడ అవసరమో చెప్పాలని, ఆ మేరకు వెంటనే ఇస్తామని వారికి హామీ ఇచ్చారు. అమెరికాలో సిలికాన్‌వ్యాలీ లాగా విశాఖ నుంచి అనంతపురం వరకు ఆంధ్రావ్యాలీగా అభివృద్ధి చేస్తామన్నారు. తర్వాత సీఎం తిరుపతి మంగళం వద్ద ఐటీ టెక్‌హబ్ ఏజీఎస్ హెల్త్ ఐటీ కేంద్రాన్ని సీఎం ప్రారంభించారు.

ఎంపీ శివప్రసాద్‌కు అవమానం!

జోహో సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రారంభసభలో తొలుత మంత్రి అమర్‌నాథ్‌రెడ్డితో మాట్లాడించిన సీఎం చంద్రబాబు అనంతరం లోకేశ్‌తో మాట్లాడించారు. తర్వాత చంద్రబాబు సుదీర్ఘ ప్రసంగం చేశారు. చాలా సేపు వేచిచూసిన ఎంపీ శివప్రసాద్.. ఇక మాట్లాడేందుకు తనను ఆహ్వానించరని గ్రహించి వేదిక దిగి మౌనంగా వెలుపలికి వెళ్లిపోయారు. ఈ హఠాత్పరిణామాన్ని సీఎం, మంత్రులు చూస్తూ ఉండిపోయారు. కాగా, కార్యక్రమానికి మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి గైర్హాజరయ్యారు.

స్వలాభం కోసమే మోదీతో భేటీ

- ప్రధానితో ఏం చర్చించారో చంద్రబాబు బహిర్గతం చేయాలి
- వైఎస్సార్‌సీపీ నేత బొత్స సత్యనారాయణ డిమాండ్



సాక్షి, హైదరాబాద్: ప్రధాని మోదీతో సీఎం చంద్రబాబు 45 నిమిషాలపాటు ఏయే అంశాలను చర్చించారో వెల్లడించాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. బొత్స సత్యనారాయణ శనివారం పార్టీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. విశాఖ రైల్వేజోన్, కడప ఉక్కు ఫ్యాక్టరీ, దుగరాజపట్నం పోర్టు, రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వంటి పాత అంశాలే తప్ప కొత్తగా అడిగిందేమీ లేదని విమర్శించారు. మోదీ వేటికి ఆమోదం తెలిపారో కూడా చంద్రబాబు చెప్పలేదన్నారు. దేశంలో అందరి కంటే సీనియర్ ముఖ్యమంత్రినని పదేపదే చెప్పుకునే చంద్రబాబు నాలుగేళ్లుగా నుంచి కేంద్రం నుంచి సాధించిందేమిటో బయటపెట్టాలని బొత్స డిమాండ్ చేశారు. దుగరాజపట్నం పోర్టుకు బదులుగా రెండు ఎకనామిక్ జోన్లు ఇవ్వాలని కోరే హక్కు చంద్రబాబుకు ఎక్కడిదని నిలదీశారు. ప్రధానిని కలిసింది స్వార్థ రాజకీయాల కోసమేనా? అని ప్రశ్నించారు. చంద్రబాబు ఢిల్లీకి వెళ్లి కోరిందేమిటో తెలిస్తే రాష్ట్ర ప్రజల కడుపు మండిపోతుందన్నారు. 'ప్రజలు ఓట్లేసిన పాపానికి మీ స్వార్థానికి రాష్ట్రాన్ని తాకట్టు పెడతారా? ఇదేనా చంద్రబాబు రాజకీయ చతురత'' అని బొత్స ధ్వజమెత్తారు. సీఎం ప్రధానిని కలిసింది స్వార్థం, స్వలాభం కోసమేనని దుయ్యబట్టారు. విశాఖకు రైల్వే జోన్ సాధించలేకపోయారు, ఇదేనా మీ అనుభవం? అని ప్రశ్నించారు.

చలితో ముగ్గురు వృద్ధులు మృతి

మృతులంతా ఒకే గ్రామానికి చెందిన వారు

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం జిల్లాలో చలిని తట్టుకోలేక ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు వృద్ధులు కన్నుమూశారు. పొన్నాం గ్రామ వాసి అయిన కొర్ను ఎర్రప్పడు (85) శుక్రవారం అర్ధరాత్రి చలితో చనిపోయినట్లు కుటుంబీకులు తెలిపారు. గురుగు తవుడు (90) శనివారం తెల్లవారు జామున చనిపోగా, బమ్మిడి తమ్మయ్య (85) అనే వృద్ధుడు అక్కడికి కొద్ది గంటల వ్యవధిలోనే తనువు చాలించాడు. గంటల వ్యవధిలోనే ముగ్గురు చనిపోవడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

ప్రేమికుల కారును వెంబడించిన బంధువులు

వేగంగా వెళ్తూ.. చెట్టుకు ఢీ ● ఒకరు మృతి

ఖమ్మం అర్బన్: ప్రేమికులు ముందు కారులో వెళ్తుండగా.. వెనుక అమ్మాయి తరపున బంధువులు వెంటాడటం.. చాలా సినిమాల్లో కనిపించే దృశ్యమే. ఇలాంటి సంఘటనే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు– కొత్తగూడెం రోడ్డులో శనివారం చోటు చేసుకోగా.. వేగంగా వెళ్తున్న కారు చెట్టును ఢీకొని కారు డ్రైవర్ మృతి చెందాడు. ప్రేమికులతో పాటు స్నేహితుడికి తీవ్రగాయాలయ్యాయి. జిల్లాలోని ఇల్లెందుకు చెందిన శ్రీపతి సుమన్ గాంధీ వాటర్ సప్లయ్ వ్యాపారం చేస్తున్నాడు. డిగ్రీ చదివే ఎండీ శహనా.. సుమన్ గాంధీ ప్రేమించుకుంటున్నారు. వీరి ప్రేమను పెద్దలు అంగీకరించకపోవటంతో స్నేహితుల సహాయంతో వీరిద్దరు మహబూబాబాద్ జిల్లా అనంతారంలో వివాహం చేసుకున్నారు. శనివారం ఇల్లెందుకు వచ్చి పోలీసులను ఆశ్రయించారు. తమ కుటుంబసభ్యుల నుంచి హాని ఉందని భావించిన వీరు అద్దెకారులో హైదరాబాద్ వెళ్లేందుకు సిద్ధమయ్యారు. స్నేహితులు తరుణ్, రవితో కలసి కొత్తగూడెం వైపు బయలు దేరారు. గమనించిన శహనా కుటుంబ సభ్యులు మరో కారులో వీరి కారును వెంబడించారు. సినిమాల్లో ఛేజింగ్ సీన్‌ను తలపించేలా రెండు కార్లు వేగంగా కొత్తగూడెం వైపు దూసుకువెళ్లాయి. ఈ క్రమంలో వెనుక నుంచి ప్రేమికులు వెళ్తున్న కారును ఢీకొట్టే ప్రయత్నం చేశారు. దీంతో డ్రైవర్ టేకులపల్లికి చెందిన ఎం. రాజు(23) కారును పక్కకు మళ్లించగా, వేగంగా వెళ్తూ చెట్టును ఢీ కొట్టింది. దీంతో రాజు అక్కడికక్కడే మృతి చెందగా, కారు నుజ్జునుజ్జు అయ్యింది. ఈ ప్రమాదంలో సుమన్ గాంధీ, శహనా, తరుణ్, ముత్యాల రవిలు తీవ్రంగా గాయపడ్డారు. ఇందులో తరుణ్ పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొడుకులతో సహా హోంగార్డు ఆత్మహత్య



ఇద్దరు కొడుకులు, భార్యతో కాశీవిశ్వనాథ్(ఫైల్)

ఖమ్మం క్రైం: ఓ హోంగార్డు తన ఇద్దరు కొడుకులతో కలిసి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం ఖమ్మంలో జరిగింది. ఏపీలోని కృష్ణా జిల్లా తిరువూరుకు చెందిన నేరెళ్ల పెద్ద ఆంజనేయులు, లక్ష్మీల పెద్ద కుమారుడు కాశీవిశ్వనాథ్(38)కు 14 ఏళ్ల క్రితం సరితతో వివాహం జరిగింది. వీరికి జయంత్(13), అజయ్(11) జన్మించారు. ఖమ్మం జిల్లా కల్లూరుకు పదేళ్ల క్రితం కుటుంబంతో వచ్చిన కాశీవిశ్వనాథ్ అంబేడ్కర్ కాలనీ సమీపంలోని మెయిన్ రోడ్ పక్కనే గణేష్ సూపర్ మార్కెట్(కిరాణ) నిర్వహిస్తూనే.. భద్రాద్రి కొత్తగూడెంలో హోంగార్డుగా పనిచేస్తున్నాడు. అతడు విధులకు వెళ్లిన సమయంలో భార్య షాపు నిర్వహిస్తుంది. ఈ క్రమంలో సంక్రాంతి పండగకు పిల్లలకు కొత్త బట్టలు కొనిస్తానని చెప్పి ఉదయాన్నే పిల్లలను తీసుకుని ఖమ్మం వెళ్లాడు. పిల్లలతో కలిసి తానూ వెంకటగిరి గేటు ప్రాంతంలో రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య సరితను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదాల్లో 17 మంది దుర్మరణం



గుంటూరు జిల్లాలో వేర్వేరు ప్రమాధాల్లో మరణించిన పైర్ల నాగేశ్వరరావు(ఫైల్), పాలడుగు శివరామకృష్ణ (ఫైల్)



కర్ణాటకలో బోల్తాపడిన బస్సు

సాక్షి,నెట్‌వర్క్: వివిధ రోడ్డు ప్రమాదాల్లో శనివారం 17 మంది ప్రాణాలు కోల్పోయారు. బెంగళూరు నుంచి ధర్మస్థలకు 44 మంది ప్రయాణికులతో కేఎస్ఆర్టీసీ బస్సు శుక్రవారం రాత్రి 11 గంటలకు బయలుదేరింది. శనివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో హాసన్ జిల్లా శాంతిగ్రామ్ వద్ద బ్రిడ్జిని ఢీకొని పక్కనే ఉన్న ఎండిపోయిన కాల్వలోకి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, కండక్టర్ సహా 8 మంది ప్రయాణికులు అక్కడికక్కడే మృతిచెందారు.

పండుగకు స్వగ్రామానికి వెళ్తూ..

సంక్రాంతి పండుగకు స్వగ్రామానికి వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై తమిళనాడులో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. తిరువణ్ణామలై జిల్లా శాతంబట్టు గ్రామానికి చెందిన వేలు(45) చెన్నైలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. సంక్రాంతి పండుగ జరుపుకునేందుకు భార్య సెల్వి, కుమార్తె ప్రియాంక, స్నేహితుడు నితీశ్, బంధువు సంతోష్ కుమార్‌తో కలిసి కారులో స్వగ్రామానికి శుక్రవారం రాత్రి బయలుదేరారు. వేలు కుమారుడు ప్రసన్నకుమార్, మరో కుమార్తె గాయత్రి బైక్‌లో కారు వెనుక బయలుదేరారు. ఈ క్రమంలో రాత్రి 11 గంటల సమయంలో వెంకుంద్ర వద్ద కారు అదుపు తప్పి లారీని ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు అక్కడికక్కడే మృతిచెందారు.

గుంటూరు జిల్లాలో నలుగురి మృతి

గుంటూరు జిల్లాలో శనివారం మూడు వేర్వేరు చోట్ల చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాల్లో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు యువకులు మృతిచెందారు. మాచర్లలోని శ్రీశైలం రోడ్డులో శనివారం ఈ ఘటన జరిగింది. మాచర్ల రూరల్ మండలం చెంచుకాలనీకి చెందిన మండ్లి వెంకటరావు (29), శీలం పాపారావు (25) మాచర్లలోని తమ బంధువుల ఇంటికి వచ్చి బైక్‌పై తిరిగి వెళ్తుండగా ఆర్టీసీ బస్సు వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో వీరు అక్కడికక్కడే మృతిచెందారు. అలాగే శావల్యాపురం మండలం పోట్లూరుకు చెందిన పాలడుగు శివరామకృష్ణ (31) చెన్నైలో ఉద్యోగం చేస్తున్నాడు. బంధువులను చూసేందుకు శనివారం కారులో వెళ్తుండగా ఫిరంగిపురం మండలం నుదురుపాడు వద్ద లారీ ఢీకొనడంతో శివరామకృష్ణ అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ఘటనలో పెదకూరపాడు మండలం బలుసుపాడుకు చెందిన 9 మంది శుక్రవారం రాత్రి పెదకూరపాడులో సినిమా చూసి వెళ్తుండగా ఆటో అదుపు తప్పి పక్కనున్న గోతిలో పడింది. ఈ ఘటనలో పైర్ల నాగేశ్వరరావు (22) అక్కడికక్కడే మరణించాడు.

ఆర్టీసీ ఎండీ ఆకస్మిక తనిఖీలు

సాక్షి, అమరావతి: సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణికులకు ఆర్టీసీ చేసిన ఏర్పాట్లపై డీజీపీ, ఆర్టీసీ ఎండీ మాలకొండయ్య ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. శనివారం తెల్లవారుజామునే విజయవాడ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్‌లో పర్యటించి ప్రయాణికుల నుంచి స్పెషల్ బస్సుల సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నైకి అదనపు సర్వీసులు ఏర్పాటు చేయాలన్నారు. విధుల్లో ఉండాల్సిన సెక్యూరిటీ సిబ్బంది లేకపోవడంపై అధికారులను మందలించారు. పార్శిల్ కౌంటర్ వద్ద ప్రయాణికుల రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు.

మైనార్టీలపై టీడీపీ వర్గీయుల దాడి


- నలుగురికి గాయాలు.. ఒకరి పరిస్థితి ఆందోళనకరం
- గుంటూరు జిల్లా జానపాడులో సంఘటన



ఆందోళన చేస్తున్న వారితో చర్చిస్తున్న డీఎస్పీ

పిడుగురాళ్ల రూరల్: మైనారిటీ వర్గానికి చెందినవారిపై అధికార టీడీపీకి చెందిన 50 మంది అగ్రకుల యువకులు దాడి చేసి గాయపరిచిన సంఘటన గుంటూరు జిల్లా పిడుగురాళ్ల సమీపంలోని జానపాడులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఈ సంఘటనలో మైనార్టీ వర్గానికి చెందిన నలుగురు గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. జానపాడులోని ప్రభుత్వ పాఠశాల మైదానంలో ఈ నెల 11న జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. సభ విషయం తెలియని మైనార్టీ వర్గ యువకులు కొందరు క్రికెట్ ఆడేందుకు వెళ్లారు. దీంతో టీడీపీకి చెందిన ఎంపీపీ చింతలపూడి చంద్రమ్మ కుమారుడు రామ్మూర్తి మీకు ఇక్కడేం పనంటూ.. వారిని దూషించాడు. ఇదేమీ మీ సొంత పాఠశాల కాదంటూ వారు అతనితో వాగ్వాదానికి దిగారు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్న రామ్మూర్తి శనివారం రాత్రి అగ్రకులానికి చెందిన 50 మంది యువకులతో కలసి మైనార్టీలు నివాసముండే ప్రాంతానికి వెళ్లి దాడికి దిగారు. తమతో వాగ్వాదానికి దిగినవారు ఆ సమయంలో అక్కడ లేకపోవడంతో సంబంధం లేని ముగ్గురిపై విచక్షణారహితంగా దాడికి దిగారు. రాళ్లు విసురుతూ, కర్రలతో కొడుతూ అమానుషంగా ప్రవర్తించారు. ఈ ఘటనలో ఎం.సైదాబి అనే మహిళతో పాటు గురజాల బుడే, షేక్ బుడేలు గాయపడ్డారు. దీనిపై బాధితులు పోలీస్‌స్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు చేయగా కేసు నమోదుకు పోలీసులు అంగీకరించలేదు. దీంతో పోలీస్ స్టేషన్ నుంచి వారు తిరిగి వస్తుండగా అధికారపార్టీకి చెందిన యువకులు మరోమారు దాడికి పాల్పడి సుభాని అనే యువకుడిని తీవ్రంగా గాయపరిచారు. దాడిలో అతను తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని పిడుగురాళ్ల ఆస్పత్రికి తరలించారు. సుభాని పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్టు సమాచారం. దీనిపై సుభాని తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు, బంధువులు జానపాడు సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహం వద్ద రాత్రి 10 గంటల సమయంలో ధర్నాకు దిగారు. సమాచారమందుకున్న సత్తెనపల్లి డీఎస్పీ కాలేషావలి అక్కడికి చేరుకుని న్యాయం చేస్తానని హామీ ఇవ్వటంతో వారు ఆందోళన విరమించారు.

దోపిడీకి 'ప్రైవేటు' కొత్త రూటు



పండుగ సీజన్‌ను సొమ్ము చేసుకుంటున్న ట్రావెల్స్ నిర్వాహకులు

- నిబంధనలను విరుద్ధంగా అదనపు సీట్లు, బెర్తులు
- తనిఖీలు పట్టించుకోని రవాణాశాఖ అధికారులు
- టిక్కెట్ ధర నియంత్రణ సైతం తమ పరిధిలోకి రాదంటున్న వైనం
- పోటాపోటీగా టిక్కెట్ల ధరలు పెంచిన ఆర్టీసీ, ప్రైవేటు ట్రావెల్స్

సాక్షి, అమరావతి

ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకుల తీరు మారలేదు. సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులకు చుక్కలు చూపిస్తున్నారు. ఇష్టారాజ్యంగా టిక్కెట్ ధరలు పెంచడంతోపాటు అదనపు సీట్లు/బెర్తుల ఏర్పాటుతో బస్సు పొడవు పెంచి ప్రయాణికుల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారు. అయినా రవాణా అధికారులు పట్టించుకోవడం లేదు. ఏదైనా ప్రమాదం జరిగితే ప్రయాణికుల ప్రాణాలు గాల్లో కలిసి పోవాల్సిందే అన్న రీతిగా ట్రావెల్స్ వ్యవహరిస్తున్నాయి. రూల్ 351–ఎ ప్రకారం స్లీపర్ బస్సుకు 36 సీట్లు, 32 బెర్తులు ఉండాలి. కానీ అరుణాచల్‌ప్రదేశ్, కర్ణాటక, పాండిచ్చేరి తదితర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న బస్సులు అదనపు సీట్లు, బెర్తులతో తెలుగు రాష్ట్రాల్లో తిరిగాయి. ఆ తర్వాత ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఏపీ, తెలంగాణల్లో ఆ బస్సుల్ని తిరగనివ్వని సంగతి తెలిసిందే. అక్కడి రాష్ట్రాలు రిజిస్ట్రేషన్ రద్దు చేశాక, కొన్నాళ్ల తర్వాత ఏపీలో బస్సుల్ని అనుమతించారు. సీట్లు, బెర్తులు తగ్గించి మోటారు వాహనాల చట్టంలో ఏఐఎస్–119 నిబంధనను అనుసరించి తిప్పాలని సూచించారు. అప్పట్లో సీట్లు, బెర్తులు తగ్గించిన ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకులు, ఇప్పుడు మళ్లీ అదనపు బెర్తులు ఏర్పాటు చేశారు.

చేతులెత్తేసిన రవాణా అధికారులు

టిక్కెట్ల ధరల నియంత్రణ తమ చేతుల్లో లేదని రవాణా అధికారులు చేతులెత్తేయడంతో ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకులు తమకు అడ్డే లేదన్న రీతిలో దోచుకుంటున్నారు. సంక్రాంతి పండుగ సీజన్‌లో ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్ని తనిఖీ చేస్తే, అంతిమంగా ప్రయాణికులే ఇబ్బందులు పడతారని రవాణా అధికారులు చెబుతున్నారంటే.. దోపిడీకి ఏ విధంగా సహకరిస్తున్నారో అర్థమవుతోంది. సాధారణంగా పండుగ సీజన్‌ల ముందు ఆయా జిల్లాల్లో రవాణా శాఖ అధికారులు ముందుగా ట్రావెల్స్ నిర్వాహకులతో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రయాణికుల్ని వారి వారి ప్రాంతాలకు చేరవేయడంలో సహకరించాలని, టిక్కెట్ల ధరలు పెంచి ప్రయాణికుల్ని దోచుకోవద్దని హెచ్చరికలు చేయాలి. టిక్కెట్ల ధరల నియంత్రణపై ట్రావెల్స్ నిర్వాహకుల నుంచి అంగీకార పత్రాలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఈసారి ఏ జిల్లాల్లోనూ సమావేశాలు నిర్వహించిన దాఖలాలు లేకపోవడం గమనార్హం.

ఆర్టీసీ లక్ష్యం రూ.40 కోట్లు.. ప్రైవేటు ట్రావెల్స్ లక్ష్యం రూ.50 కోట్లు..

ఆర్టీసీ ప్రతి రోజూ 70.24 లక్షల మంది ప్రయాణికుల్ని చేరవేస్తుంది. ఈ సంక్రాంతి సీజన్‌కు అదనంగా రూ.40 కోట్లను ఆర్జించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఆ మేరకు రోజుకు 2,500 స్పెషల్ సర్వీసులు ఏర్పాటు చేసింది. స్పెషల్ సర్వీసుల్లో 150 శాతం అధిక రేట్లతో టిక్కెట్లు వసూలు చేస్తున్న సంగతి తెలిసిందే. మరోవైపు ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు ఈ సీజన్ 4 రోజుల్లో రూ.50 కోట్లు ఆర్జించేందుకు లక్ష్యం పెట్టుకున్నట్లు సమాచారం.

హైదరాబాద్ రూటే టార్గెట్

ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకులు హైదరాబాద్ రూటే టార్గెట్‌గా పెట్టుకున్నారు. ఈ రూట్లో ప్రతి రోజూ 70 వేల మంది ప్రయాణికుల్ని చేరవేస్తున్నాయి. సాధారణ రోజుల్లో విజయవాడ నుంచి హైదరాబాద్‌కు ఏసీ సర్వీసుకు రూ.550గా ఉన్న టిక్కెట్టు ధర ఈ నెల 14, 15, 16, 17, 18 తేదీల్లో రూ.990గా వసూలు చేస్తున్నారు. స్లీపర్ సర్వీసుల్లో సాధారణ రోజుల్లో రూ.850–రూ.1000గా ఉన్న టిక్కెట్టు ధర ఈ సీజన్‌లో రూ.1,200–రూ.1,850గా వసూలు చేయడం గమనార్హం. హైదరాబాద్–విశాఖ రూట్‌లోనూ సాధారణ రోజుల్లో స్లీపర్ సర్వీసుల్లో రూ.1,500– రూ.1,700 టిక్కెట్ ధర ఈ పండగ సీజన్‌లో ఏకంగా రూ.2,500–రూ.2,700 వరకు వసూలు చేస్తున్నారు. ఆ మేరకు ఆన్‌లైన్‌లో టిక్కెట్ల ధరలను అందుబాటులో ఉంచాయి.



హైదరాబాద్ నుంచి ప్రజలు పెద్ద ఎత్తున సొంత ఊళ్లకు తరలడంతో తెలంగాణలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద శనివారం బారులుతీరిన వాహనాలు

విమాన టికెట్లకు భారీ డిమాండ్..

సంక్రాంతి పండగ ప్రభావం విమాన టికెట్లపై తీవ్రంగా కనిపిస్తోంది. హైదరాబాద్ నుంచి రాష్ట్రంలోని ముఖ్య పట్టణాలకు వెళ్లే టికెట్ల ధరలు ఆకాశానంటున్నాయి. ముఖ్యంగా రాజమండ్రి, విశాఖపట్నం, విజయవాడలకు డిమాండ్ అధికంగా ఉంది. శనివారం సాధారణ సగటు ధర కంటే పది రెట్లు పైగా పెరిగిపోయాయి. ఆదివారానికి కొంత డిమాండ్ తగ్గినా సగటు కంటే నాలుగురెట్లు ఎక్కువగానే ఉన్నాయి. వరుస సెలవులు వచ్చినప్పటికీ తిరుపతికి డిమాండ్ అంతగా లేకపోవడం గమనార్హం. సాధారణంగా శనివారం తిరుపతికి వెళ్లే విమానాలకు డిమాండ్ ఉన్నట్లుగానే ఈ శనివారం కూడా ఉంది.

హైదరాబాద్‌నుంచి...	సాధారణ టికెట్ ధర	శనివారం టికెట్ ధర	ఆదివారం టికెట్ ధర
రాజమండ్రి	రూ.2,050	రూ.17,345	రూ.9,149
విశాఖపట్నం	రూ.2,000	రూ.16,386	రూ.10,902
విజయవాడ	రూ.1,700	రూ.7,925	రూ.2,881
తిరుపతి	రూ.2,000	రూ.5,889	రూ.2,600-4,000

సాక్షి
రాష్ట్రీయం
వైఎస్ఆర్ జిల్లా
ఆదివారం | జనవరి | 14 | 2018
www.sakshi.com

10

దేశంలోమొట్టమొదటి సుప్రీంకోర్టు కోల్‌కతాలోని ఫోర్ట్ విలియమ్ వద్ద ఏర్పాటైంది. 1773 రెగ్యులేటింగ్ చట్టం ప్రకారం దీన్ని అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది.



'అతడు' కాదు.. ఆమె!





అది చైనాలోని జెజియాంగ్ ప్రావిన్స్.. వాంగ్‌కీ అనే 41 ఏళ్ల మహిళ. ఆన్‌లైన్ ద్వారా 2016లో ఓ 'యువకుడు' పరిచయమయ్యాడు. 'అతడి' పేరు కియాన్. అతడు వయసులో చాలా చిన్నవాడని.. ఇద్దరికీ కుదరదని వాంగ్‌కీ చెబుతూనే ఉంది. తనకు పెళ్లయి విడాకులయ్యాని, ఓ పాప కూడా ఉందని కియాన్‌తో నచ్చజెప్పింది. కొంతకాలానికి ఎలాగోలా వాంగ్‌కీని కియాన్ ప్రేమలో పడేశాడు. డేటింగ్ చేయడం మొదలుపెట్టారు. ఆ తర్వాత వాంగ్‌కీని కియాన్ ఇంటికి తీసుకెళ్లి తన తల్లిదండ్రులకు పరిచయం కూడా చేశాడు. పెళ్లయే వరకు ఇద్దరి మధ్యా శారీరక సంబంధం ఉండకూడదని ఇద్దరూ ఓ నిర్ణయానికి వచ్చారు. ఇప్పటివరకు అంతా బాగానే ఉన్నా 2017 నవంబర్ నాటికి 'అతడి' అసలు బండారం బయటపడింది. సడన్‌గా కియాన్ కనిపించకుండా మాయమయ్యాడు. అయితే అప్పటికే కియాన్‌కు వాంగ్‌కీ అవసరం ఉన్నప్పుడల్లా డబ్బులు కూడా ఇచ్చింది. తనను మోసం చేసిన కియాన్‌ను ఊరికే వదలకూడదని భావించి కియాన్ పుట్టుపూర్వోత్తరాలు లాగడం మొదలుపెట్టింది. తల్లిదండ్రుల వద్దకు వెళ్లి ఆరా తీయగా, వారికి ఉన్నది ఏకైక కుమార్తె అని కుమారులు ఎవరూ లేరిన చెప్పడంతో వాంగ్‌కీ అవాక్కయింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే కియాన్ ఎక్కడున్నాడో.. సారీ ఎక్కడుందో ఇప్పటికీ తెలియదు.



సీతాకోకమ్మకు శస్త్రచికిత్స!

రోడ్డుపై పిల్లులు, కుక్క పిల్లలకు గాయాలైతే కొందరు స్పందించి వాటికి ప్రాథమిక చికిత్స అందిస్తుంటారు. ఇలాంటి జంతుప్రేమికులను చాలామందినే చూసి ఉంటాం. అయితే ఇప్పుడు చెప్పకోబోయే వ్యక్తి మాత్రం చాలా అరుదుగా కన్పిస్తుంటారు. ఆమె పేరు రోనీ మెక్‌క్యాన్‌స్కీ. వృత్తి రీత్యా కాస్ట్యూమ్ డిజైనర్. ఓ రోజు వాళ్లింటి తోటలోని ఓ చెట్టుపై ఆమెపై మూడు సీతాకోకచిలుకలను చూశారు. అందులో ఒకదానికి కుడివైపు రెక్క విరిగిపోయింది. దీంతో వెంటనే ఆ సీతాకోకచిలుకకు ఇంట్లోనే చిన్నపాటి 'రెక్క' శస్త్రచికిత్స చేశారు. ఇంట్లో దొరికే చిన్న చిన్న పరికరాలతోనే సీతాకోకచిలుక రెక్కను తయారు చేసి దానికి అతికించారు. ఇక ఆ రెక్కలు కట్టుకుని రివ్వున ఎగిరిపోయింది ఆ సీతాకోకమ్మ.



భృంగి వాహనంపై శ్రీశైలేశుడు



శ్రీశైలం: మకర సంక్రమణ మహోత్సవాల సందర్భంగా శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లు శనివారం భృంగివాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అక్కమహాదేవి అలంకార మండపంలో భృంగి వాహనాధీశులైన స్వామి, అమ్మవార్లకు విశేష వాహన పూజలు నిర్వహించారు. ఆ తరువాత ప్రధానాలయ రాజగోపురం నుంచి రథశాల వద్దకు చేరుకున్న ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు చేసి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. గంగాధర మండపం నుంచి ప్రారంభమైన గ్రామోత్సవం అంకాలమ్మ గుడి, నంది మండపం, బయలు వీరభద్రస్వామి ఆలయం వరకు కొనసాగి.. రాత్రి 9:30కి ఆలయ ప్రాంగణానికి చేరుకుంది. కార్యక్రమంలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మాణిక్యాలరావు వివాదంపై చంద్రబాబు ఆరా

ముగ్గురు సభ్యులతో విచారణ కమిటీ

సాక్షి, అమరావతి: పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో బీజేపీ, టీడీపీ నాయకుల మధ్య వివాదంపై సీఎం చంద్రబాబు నాయుడు ఆరా తీశారు. ఆ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీకి చెందిన మంత్రి పైడికొండల మాణిక్యాలరావు, అక్కడి టీడీపీ ఇన్‌చార్జి, జెడ్పీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజులు ఒకరిపై ఒకరు తీవ్ర స్థాయిలో విమర్శలు చేసుకుంటూ రచ్చకెక్కడం చాలా రోజులుగా నడుస్తోంది. ఈ నేపథ్యంలో జన్మభూమి సభలో మాణిక్యాలరావు లేని సమయంలో ఆయనపై బాపిరాజు తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. తర్వాత బాపిరాజు అనుచరుడు, తాడేపల్లిగూడెం మున్సిపల్ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు మరో అడుగు ముందుకేసి మాణిక్యాలరావు ఆఫ్ట్రాల్.. ఒక ఫొటోగ్రాఫర్ అని, తమవల్లే తాడేపల్లెగూడెంలో గెలిచి మంత్రి అయ్యాడని వ్యాఖ్యలు చేశారు. దీనిపై మంత్రి మాణిక్యాలరావు స్పందిస్తూ ఎదురుదాడి చేశారు. దీనిపై సీఎం శనివారం ఉదయం ఆరా తీశారు. ఈ వివాదంపై విచారణ జరపాలంటూ మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, కొల్లు రవీంద్ర, పిఠాపురం ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మతో కమిటీని నియమించారు.

గుప్తనిధుల తవ్వకాల కేసులో ఐదుగురు అరెస్టు

సిద్దవటం: వైఎస్సార్ జిల్లా సిద్దవటం మండలంలోని పలు ప్రాంతాల్లో గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపట్టిన కేసులో ఐదుగురిని అరెస్టు చేసినట్లు సిద్దవటం ఎస్ఐ అరుణ్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన సిద్ధవటంలో విలేకరులతో మాట్లాడారు. సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా మండలంలోని నేకనాపురం గ్రామం క్రాస్ రోడ్డు వద్ద కొందరు వ్యక్తులు పోలీసు వాహనాన్ని చూసి దాక్కోవాలని ప్రయత్నిస్తుండగా వారిని పట్టుకొని విచారించినట్లు చెప్పారు. నేకనాపురం గ్రామంలోని శివాలయంవద్ద గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపేందుకు వచ్చినట్లు తెలియడంతో సిద్దవటం సర్పంచ్ భర్త వేల్పుల వెంకటేశ్వర్లు, నెల్లూరుకు చెందిన ఉడత మధు, హైదరాబాద్‌కు చెందిన తిరుకలువల విష్ణుచిత్తం, నెల్లూరుకు చెందిన సూరం వెంకటేశ్వర్లు అలియాస్ వెంకటేశ్వర్‌రెడ్డి, రాజంపేటకు చెందిన పొట్టపేగుల ఆదినారాయణలను అరెస్టు చేసినట్లు వివరించారు. వీరు సుమారు ఏడాది క్రితం సిద్దవటంలోని శ్రీ రంగనాయకస్వామి ఆలయంలో తవ్వకాలు జరిపినట్లు విచారణలో వెల్లడైందన్నారు.

కర్నూలులో కిలో బంగారం చోరీ

కర్నూలు: కర్నూలు అబ్బాస్ నగర్‌లో కిలో బంగారం, రూ.4 లక్షల నగదు చోరీ జరిగింది. డీఎస్పీ ఖాదర్ బాషా తెలిపిన మేరకు.. భర్త త్యాగరాజు డాక్టర్‌గా పనిచేస్తూ ఆరేళ్ల క్రితం గుండెపోటుకు గురై మృతి చెందడంతో శ్రీదేవి తన ఇద్దరు పిల్లలతో అబ్బాస్‌నగర్‌లో ఉంటోంది. చెల్లెలి భర్తకు ఆరోగ్యం బాగాలేక శుక్రవారం ఇంటికి తాళం వేసి శ్రీదేవితో సహా కుటుంబీకులు నెల్లూరు జిల్లా వెంకటగిరికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి నగదుతో పాటు నగలను మూటగట్టుకుని ఉడాయించారు. శనివారం ఉదయం స్థానికులు దీన్ని గమనించి శ్రీదేవికి సమాచారమివ్వడంతో పోలీసులకు ఆమె ఫిర్యాదు చేశారు.

సైబర్ నేరగాడి అరెస్టు



మాట్లాడుతున్న డీఎస్పీ షేక్ మాసుంబాషా

కడప అర్బన్: ఎంబీఏ వరకు చదువుకున్న ఓ యువకుడు సైబర్ నేరాలకు పాల్పడుతూ పోలీసులకు చిక్కాడు. ఈ వివరాలను శనివారం కడప డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ షేక్ మాసుంబాషా వెల్లడించారు. ఇంటర్నెట్ ద్వారా వాయిస్ కాల్స్‌ను అక్రమంగా మళ్లిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న వైఎస్సార్ జిల్లా కడప హాజీగపూర్‌సాబ్ వీధిలో నివసిస్తున్న హిమాయతుల్లా షరీఫ్ కుమారుడు షేక్ ముక్కపాలెం హఫీజుల్లాను వన్‌టౌన్ సీఐ టీవీ సత్యనారాయణ, ఎస్ఐలు, సిబ్బంది అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి ఒక్కొక్కటి రూ.లక్షకు పైగా విలువజేసే వీవోఐపీలు మూడు, 120 సిమ్‌కార్డులు స్వాధీనం చేసుకున్నామన్నారు. డీఎస్పీ మాట్లాడుతూ వీవోఐపీ (వాయిస్ ఓవర్ ఇంటర్నెట్ ప్రోటోకాల్) పరిజ్ఞానం ద్వారా కాల్స్ చేస్తే అది కంప్యూటర్ ద్వారా దేశంలోని అనధికారిక ఎక్స్ఛేంజ్‌లకు వస్తుందన్నారు. అక్కడి నుంచి సాధారణ కాల్స్‌గా మారుతాయన్నారు. ఇటీవల దేశంలోకి అక్రమంగా ఇంటర్నెట్ ద్వారా కాల్స్ వస్తున్నట్లు రక్షణ శాఖ ఇచ్చిన ఆదేశాల మేరకు కడప వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో నిఘా గట్టిగా ఉంచడం వల్ల నిందితుడిని పట్టుకోగలిగామన్నారు. నిందితుడు తనకు తెలిసిన టెక్నాలజీతో తన వద్దనున్న ఆధునిక పరికరాలతో సాధారణ కాల్స్ మాదిరిగా మార్చి డబ్బులు సంపాదించుకోవడానికి వాడుకుంటున్నారన్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి ఏర్పడుతోందన్నారు. ప్రస్తుతం పట్టుబడిన హఫీజుల్లాకు విజయవాడలో చిరంజీవి అనే వ్యక్తి కీలకంగా వ్యవహరిస్తూ కాల్స్ మళ్లించడంలో నైపుణ్యం పొందాడన్నారు.

లఘు చిత్రాలకూ నంది అవార్డులు

ఏపీ ఫిల్మ్ డెవలప్‌మెంట్ చైర్మన్ అంబికా కృష్ణ

ఏలూరు (సెంట్రల్): రాష్ట్రంలో లఘు చిత్రాలకు (షార్ట్ ఫిలిమ్స్) కూడా నంది అవార్డులు ఇవ్వనున్నట్లు ఏపీ ఫిల్మ్, టెలివిజన్ అండ్ థియేటర్స్ డెవలప్‌మెంట్ చైర్మన్ అంబికా కృష్ణ తెలిపారు. డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా సంఘాల ఆధ్వర్యంలో ఏలూరులో సంక్రాంతి యువజనోత్సవాలు జరుపుతున్నారు. ఇందులో భాగంగా శనివారం ఆర్ఆర్‌పేటలోని నిర్వహించిన షార్ట్ ఫిల్మ్ పోటీలను అంబికా కృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నైపుణ్యాలను వెలికి తీసేలా షార్ట్ ఫిల్మ్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం లఘు చిత్రాలకు మంచి ఆదరణ ఉందని, వీటిని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి చెస్ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

సంక్రాంతి వేళ రైతు ఇంట విషాదం

- అప్పుల బాధ తాళలేక భార్యను చంపి ఆత్మహత్య చేసుకున్న రైతు
- ప్రకాశం జిల్లా అచ్చంపేటలో ఘటన
- సాగు కోసం రూ.15 లక్షల వరకు అప్పు
- అప్పులవాళ్లు కోర్టుకెళ్లడంతో మనస్తాపం



కాశిరెడ్డి, ఈశ్వరమ్మ (ఫైల్ ఫొటోలు)

రాచర్ల (గిద్దలూరు): సంక్రాంతి వేళ ఓ రైతు ఇంట విషాదం అలుముకుంది. వరుస నష్టాలకు తోడు అప్పులిచ్చిన వారి నుంచి ఒత్తిళ్లు అధికమవ్వడంతో మనస్తాపం చెందిన ఆ రైతు భార్యను చంపి, తర్వాత తాను కూడా ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ప్రకాశం జిల్లా అచ్చంపేటలో జరిగింది. బేస్తవారిపేట మండలం వంగపాడుకు చెందిన రైతు కామిరెడ్డి కాశిరెడ్డి(58), ఈశ్వరమ్మ(53) దంపతులకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. ముగ్గురు పిల్లలకు వివాహాలు చేశారు. కాశిరెడ్డి తనకున్న ఐదెకరాల పొలంలో సాగు చేసుకుంటూ జీవిస్తుండగా.. కుమారుడు రామాంజనేయరెడ్డి పాల వ్యాపారం చేస్తున్నాడు. అయితే వ్యాపారంలో నష్టాలు రావడం, పంట దిగుబడి రాకపోవడంతో రూ.15 లక్షల వరకూ ప్రైవేటు రుణం తీసుకున్నారు. అయితే అప్పులిచ్చిన వారి నుంచి ఒత్తిళ్లు అధికమవ్వడంతో కాశిరెడ్డి 2.30 ఎకరాల సాగు భూమిని అమ్మి.. రూ.9 లక్షల అప్పు తీర్చాడు. మిగిలిన భూమి తాకట్టులో ఉంది. ఈ నేపథ్యంలో మూడేళ్ల కిందట కాశిరెడ్డి దంపతులు స్వగ్రామం నుంచి రాచర్ల మండలం అచ్చంపేటకు వలస వచ్చారు. వ్యవసాయంపై మమకారం తీరని కాశిరెడ్డి అచ్చంపేటలో ఐదెకరాల పొలం కౌలుకు తీసుకున్నాడు. గతేడాది ఐదెకరాల్లో మిర్చి పంట వేశాడు. వర్షాభావంతో పంట పూర్తిగా ఎండిపోవడంతో తీవ్రంగా నష్టపోయాడు. దాదాపు రూ.2 లక్షల వరకూ అప్పులు తేలాయి. ఈ ఏడాది మరో రెండెకరాలు అదనంగా కౌలుకు తీసుకొని.. మూడు ఎకరాల్లో బొప్పాయి, రెండు ఎకరాల్లో చొప్ప, కంది పంట వేశాడు. నీళ్లు లేక రెండు ఎకరాలను బీడుగానే వదిలేశాడు. అయితే సకాలంలో వర్షాలు కురవకపోవడంతో ఈ ఏడాది కూడా పంటలు ఎండిపోయాయి. ఇంతలో స్వగ్రామంలో అప్పులిచ్చిన వాళ్లు కోర్టుకు వెళ్లారు. దీంతో మనస్తాపానికి గురైన కాశిరెడ్డి శనివారం తెల్లవారుజామున ఇంట్లో నిద్రిస్తున్న భార్య ఈశ్వరమ్మ తలపై రోకలిబండతో బలంగా కొట్టాడు. దీంతో తీవ్ర రక్తస్రావమై ఆమె అక్కడికక్కడే మరణించింది. అనంతరం కాశిరెడ్డి తాను సాగు చేస్తున్న పొలానికి వెళ్లి విష గుళికలు మింగి ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ఉదయం ఈశ్వరమ్మను పొలం పనులకు పిలిచేందుకు వచ్చిన స్థానికులు ఆమె విగతజీవిగా పడి ఉండటం గమనించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కాశిరెడ్డి ఇంట్లో లేకపోవడంతో.. పొలానికి వెళ్లి వెతికారు. కాశిరెడ్డి కూడా చనిపోయి కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న గిద్దలూరు సీఐ శ్రీరామ్ మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వి.నాగశ్రీను తెలిపారు.

మేయర్ మోసంపై ఆధారాలున్నాయి

- ప్రసాద్ జంపెక్స్ కంపెనీ ప్రతినిధులు
- మీడియా సమావేశాన్ని అడ్డుకున్న మేయర్ వర్గీయులు..



విలేకరులతో మాట్లాడుతున్న ప్రసాద్ జంపెక్స్ కంపెనీ ప్రతినిధులు

నెల్లూరు(సెంట్రల్): నెల్లూరు కార్పొరేషన్ మేయర్ అబ్దుల్ అజీజ్ తమను మోసం చేశారని, ఇప్పుడు కూడా ఆయన కంపెనీ డైరెక్టర్‌గా కొనసాగుతున్నట్లు తమ వద్ద పక్కా ఆధారాలున్నాయని చెన్నైకు చెందిన జంపెక్స్ కంపెనీ ప్రతినిధులు, అడ్మిన్ మేనేజర్ ప్రదీప్‌కుమార్, అకౌంట్స్ మేనేజర్ మయూర్‌నాథ్ పేర్కొన్నారు. నెల్లూరులోని మినర్వా హోటల్లో శనివారం ఆ వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. అబ్దుల్ అజీజ్ 2014 నుంచి 2017 వరకే కాకుండా ప్రస్తుతం కూడా కంపెనీలో డైరెక్టర్ హోదాలో కొనసాగుతున్నారని వారు తెలిపారు. డైరెక్టర్ పదవికి అజీజ్ రాజీనామా చేశారని చెబుతున్న మాటల్లో వాస్తవం లేదన్నారు. 2017 సెప్టెంబర్‌లో అజీజ్ డైరెక్టర్ హోదాలో సంతకం చేసిన పత్రాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. ఈ కేసులో సీబీఐ, ఈడీలు కలుగజేసుకుని విచారించే అవకాశాలు ఉన్నాయన్నారు. నెల్లూరు మేయర్ అజీజ్, అతని సోదరులు, కుటుంబ సభ్యులు కలసి నిర్వహిస్తున్న స్టార్ ఆగ్రో మెరైన్ ఎక్స్‌పోర్ట్స్ కంపెనీలో భాగస్వామ్యం కోసం చెన్నై టీ నగర్‌కు చెందిన ప్రసాద్ జంపెక్స్ కంపెనీ నిర్వాహకుడు ఎ.మనోహరప్రసాద్ రూ.42 కోట్లు పెట్టుబడిగా పెట్టారు. వీటిని కంపెనీ డైరెక్టర్లుగా ఉన్న అజీజ్, అతని సోదరుడు అబ్దుల్ జలీల్ వ్యక్తిగత ఖాతాలోకి మళ్లించి తనను మోసం చేశారని మనోహరప్రసాద్ తమిళనాడు హైకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో చెన్నై సెంట్రల్ క్రైంబ్రాంచ్ పోలీసులు ఇటీవల కేసు నమోదు చేయడం తెలిసిందే. ఇదిలా ఉండగా జంపెక్స్ కంపెనీ ప్రతినిధుల విలేకరుల సమావేశాన్ని మేయర్ అజీజ్ వర్గీయులు అడ్డుకున్నారు. మేయర్‌కు అనుకూలంగా నినాదాలు చేశారు. మేయర్ అజీజ్‌కు ప్రధాన అనుచరుడైన పాల్ అనే వ్యక్తి కనుసన్నల్లో ఈ తతంగమంతా కొనసాగింది.

పెదగొట్టిపాడు సందర్శనపై ఉక్కుపాదం

- సీపీఎం నేతలను అడ్డుకొని అరెస్ట్ చేసిన పోలీసులు
- టీడీపీ ప్రభుత్వం రాక్షస పాలన సాగిస్తోందన్న మధు



సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధును అరెస్టు చేసి వ్యానులోకి ఎక్కిస్తున్న పోలీసులు

కొరిటెపాడు(గుంటూరు)/తాడికొండ: గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడు గ్రామంలోని దళితులపై జనవరి 1న జరిగిన దౌర్జన్యకాండను నిరసిస్తూ బాధితులకు అండగా నిలిచేందుకు సీపీఎం ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన గొట్టిపాడు సందర్శనను పోలీసులు అడ్డుకున్నారు. ఇక్కడి బ్రాడీపేటలోని సీపీఎం కార్యాలయం వద్ద భారీ ఎత్తున పోలీసులను మోహరించి నేతలను, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. ఇది ఉద్రిక్తతకు దారితీసింది. ఈ సందర్భంగా పోలీసులకు, సీపీఎం కార్యకర్తలకు మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో పార్టీ గుంటూరు పశ్చిమ జిల్లా కార్యదర్శి గద్దె చలమయ్య అస్వస్థతకు గురయ్యారు. దీంతో అక్రమ అరెస్టులు సరికాదంటూ సీపీఎం కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వి.కృష్ణయ్యలతోపాటు 52 మందిని అర్బన్ జిల్లా అదనపు ఎస్పీ వైటీ నాయుడు ఆధ్వర్యంలోని పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకుని నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. అంతకుముందు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పక్షపాత ధోరణిని విడనాడి పెద్దగొట్టిపాడు దళిత బాధితులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. తమను అడ్డుకోవడాన్ని ఆయన తప్పుపట్టారు. టీడీపీ ప్రభుత్వం రాక్షస పాలనను తలపిస్తోందని మండిపడ్డారు. పెదగొట్టిపాడులో దళితులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వ పెద్దలు పెద్దఎత్తున రాజకీయాలు చేసి బాధితులను మరింత ఇబ్బందులకు గురిచేయడం శోచనీయమన్నారు.

23న 36 దళిత, ఇతర సంఘాలతో చలో గొట్టిపాడు

ఇదిలా ఉండగా పి.మధును పోలీసులు తాడికొండ పోలీస్‌స్టేషన్‌కు తరలించగా.. అక్కడ ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెదగొట్టిపాడు దళితులపై దాడికి నిరసనగా ఈ నెల 23వ తేదీన 36 దళిత, ఇతర ప్రజాసంఘాలతో కలసి 'చలో గొట్టిపాడు' కార్యక్రమం నిర్వహించనున్నట్టు ప్రకటించారు. శనివారం సాయంత్రం 4 గంటలదాకా తాడికొండ ఠాణాలో అదుపులో ఉంచిన అనంతరం సీపీఎం రాష్ట్ర కార్యదర్శిని పోలీసులు సొంత పూచీకత్తుపై వదిలిపెట్టి ఇన్నోవా వాహనంలో విజయవాడకు తరలించారు.

'హోదా' కంటే అసెంబ్లీ సీట్ల పెంపు ముఖ్యమా?

చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే రోజా మండిపాటు

ప్రజా సంకల్పయాత్ర నుంచి



సాక్షి ప్రత్యేక ప్రతినిధి: రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించుకోవడం కంటే అసెంబ్లీ సీట్లు పెంచుకోవడమే తనకు ముఖ్యమనే విషయాన్ని సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటన ద్వారా తేటతెల్లం చేశారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ఆర్కే రోజా మండిపడ్డారు. ప్రజా సంకల్పయాత్రలో భాగంగా పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం చిత్తూరు జిల్లా చంద్రగిరి నియోజకవర్గంలో చేసిన పాదయాత్రలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోజా సాక్షి మీడియాతో మాట్లాడుతూ.. 16 నెలల తరువాత ప్రధాని మోదీ అపాయింట్‌మెంట్ దొరికితే రాష్ట్రానికి చంద్రబాబు ఏదో తీసుకొస్తారని ప్రజలు అనుకున్నారని, కానీ ఆయనకు ప్రత్యేక హోదా ముఖ్యమో.. అసెంబ్లీ సీట్ల పెంపు ముఖ్యమో తేలిపోయిందని ధ్వజమెత్తారు. ఐదుకోట్ల మంది రాష్ట్ర ప్రజలు ప్రత్యేక హోదా కావాలని కోరుకుంటున్నారని ఆమె గుర్తు చేశారు. అయితే చంద్రబాబు మాత్రం హోదా అడగకుండా అసెంబ్లీ సీట్లు పెంచాలి.. ఓటుకు కోట్లు కేసు నుంచి తనను బయట పడెయ్యాలి అని కేంద్రాన్ని కోరడం దారుణమన్నారు.

అధికారులు అవినీతికి అడ్రస్‌గా మారారు

టీడీపీ ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డి ఆరోపణ

అనంతపురం టౌన్: అధికారులు అవినీతికి అడ్రస్‌గా మారారని టీడీపీ ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. శనివారం అనంతపురంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. జన్మభూమి కమిటీల తీరు బాగాలేదని విమర్శించారు. అధికారులు సైతం ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయడం లేదని మండిపడ్డారు. అధికారులు 50 శాతం మేర అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రజా సేవకులమనే విషయాన్ని మరిచిపోవడంతో పాటు ప్రజా ప్రతినిధులను సైతం తప్పుదోవ పట్టించేలా వ్యవహరిస్తున్నారని విమర్శలు చేశారు. అవినీతికి పాల్పడే అధికారుల పట్ల కఠినంగా వ్యవహరించాలని కోరారు. మరోవైపు ప్రజా ప్రతినిధులు సైతం ఐదేళ్లలో కేవలం ఒక్క నెల మాత్రమే ప్రజలకు కేటాయించి.. మిగిలిన కాలమంతా రాజకీయాలు చేస్తున్నారన్నారు. నియోజకవర్గాల్లో ప్రాబల్యం పెంచుకునేందుకు ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నారని విమర్శించారు.

అస్మదీయులకే టెండర్లు

- ఆర్ఈసీఎస్ స్పాట్ బిల్లింగ్ టెండర్లలో అక్రమాలు
- ఎల్–1ను పక్కనపెట్టి ఎల్–2కు వత్తాసు



ఆర్ఈసీఎస్ ప్రధాన కార్యాలయం

సాక్షి ప్రతినిధి, విజయనగరం: పల్లె ప్రజల ఇళ్లల్లో వెలుగులు నింపాలన్న లక్ష్యంతో ప్రారంభించిన గ్రామీణ విద్యుత్ సహకార సంఘం(ఆర్ఈసీఎస్) గాడి తప్పుతోంది. స్పాట్ బిల్లింగ్ రీడింగ్‌లో అవకతవకల వల్ల ఇప్పటికే పేదలపై చార్జీల పిడుగు పడింది. తాజాగా స్పాట్ బిల్లింగ్ టెండర్లను నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ పెద్దలు తమకు కావాల్సిన వారికి కట్టబెడుతున్నారు. ఎల్–1ను పక్కనపెట్టి ఎల్–2కు టెండర్ ఖరారు చేసేందుకు పన్నాగం పన్నుతున్నారు. ఇలా చేసే వెసులుబాటు ఉందని నమ్మబలుకుతున్నారు.

చర్చల డ్రామా

రాష్ట్రంలో గ్రామీణ విద్యుత్ సహకార సంఘాలు మూడే ఉన్నాయి. ఒకటి కుప్పంలో, రెండోది అనకాపల్లిలో మూడోది విజయనగరం జిల్లా చీపురుపల్లిలో ఉంది. ఆర్ఈసీఎస్‌లో రెండేళ్లపాటు విద్యుత్ మీటర్ల రీడింగ్ నమోదు(స్పాట్ బిల్లింగ్)కు ఈ నెల 8న టెండర్లు నిర్వహించారు. టెండర్లలో నలుగురు పాల్గొన్నారు. విశాఖ జిల్లా యలమంచిలికి చెందిన కేవీ రమణమూర్తి అనే కాంట్రాక్టర్ పట్టణాల్లో ఒక్కో మీటర్‌కు రూ.3.41, గ్రామీణ ప్రాంతాల్లో రూ.3.53కు రీడింగ్ తీసేందుకు టెండర్ వేశారు. విజయనగరానికి చెందిన ఈశ్వర భవానీ అనే వ్యక్తి ఒక్కో మీటర్‌కు పట్టణ ప్రాంతాల్లో రూ.4.17, గ్రామీణ ప్రాంతాల్లో రూ.4.23కు టెండర్ దాఖలు చేశారు. దీంతో కేవీ రమణమూర్తిని ఎల్–1(లోయెస్ట్ 1)గా, ఈశ్వర్ భవానీని ఎల్–2(లోయెస్ట్ 2)గా నిర్ధారించారు. నిబంధనల ప్రకారమైతే ఎల్–1కు టెండర్ దక్కాలి. కానీ, ఎల్–2 తమకు బాగా కావాల్సిన కాంట్రాక్టర్ కావడంతో ఆయనకే టెండర్ ఖరారు చేయడానికి కొత్త నిబంధనను తెరపైకి తెచ్చారు. ఇంకా తక్కువకు రీడింగ్ తీస్తామన్న వారికి టెండర్లు ఖరారు చేస్తామంటూ ఈశ్వర్ భవానీని పిలిచి చర్చలు జరిపారు. ఆయన అంతకుముందు వేసిన టెండర్ ధరలను పక్కన పెట్టి పట్టణ ప్రాంతాల్లో రూ.3.35, గ్రామీణ ప్రాంతాల్లో రూ.3.48కు రీడింగ్ తీసేందుకు అంగీకరించారంటూ టెండర్ కట్టబెట్టేందుకు రంగం సిద్ధం చేశారు. ఆర్ఈసీఎస్‌లో స్పాట్ బిల్లింగ్ విషయంలో గతంలోనూ వివాదాలు తలెత్తాయి. ఈ కాంట్రాక్టును ఇద్దరు వ్యక్తులకు అప్పగించారు. వారిలో ఒకరు అధికార తెలుగుదేశం పార్టీ నాయకుడే. ఆయన స్పాట్ బిల్లింగ్ నిర్వహణలో అలసత్వం ప్రదర్శించడంతో సాధారణ వినియోగదారులకు సైతం రూ.వేలల్లో కరెంటు బిల్లులొచ్చాయి. వినియోగదారుల నుంచి ఒత్తిడి పెరగడంతో ఆ కాంట్రాక్టును రద్దు చేశారు. గత ఆరు నెలలుగా కాంట్రాక్టు జూనియర్ లైన్‌మన్లు, విలేజ్ ఎలక్ట్రికల్ వర్కర్లతో రీడింగ్ నమోదు చేయించారు. తాజాగా టెండర్లు నిర్వహించారు.

ఇక టెండర్లు పిలవడం ఎందుకు?

"తక్కువ ధరలకు టెండర్ వేసిన నాకు కాంట్రాక్టు అప్పగించలేదు. తక్కువ ధరలకు టెండర్ వేసిన నన్ను కాదని ఇతరులకు కాంట్రాక్టు కట్టబెట్టడం దారుణం. అలాంటప్పుడు టెండర్లు పిలవడం ఎందుకు?బహిరంగ వేలం వేసుకోవచ్చు కదా!

– కేవీ రమణమూర్తి, ఎల్–1 కాంట్రాక్టర్

సైకత సత్యదేవుడు

సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న చిత్రం



అన్నవరం(ప్రత్తిపాడు): గత కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారంలో ఉన్న తూర్పుగోదావరి జిల్లాలోని అన్నవరం శ్రీ సత్యదేవుని ఆలయ సైకత శిల్పం ఇది. రెండేళ్ల క్రితం రెండు గోపురాలు మధ్యలో శ్రీ సత్యదేవుని ఆలయం ఫోటోను డ్రోన్ సాయంతో తీశారు. ఆ ఫొటో ఆధారంగా ఈ సైకతాన్ని శిల్పి ఇలా మలిచారు. వాట్సాప్, ఫేస్‌బుక్‌లలో దీన్ని వేలమంది షేర్ చేస్తున్నారు. ఈ సైకత శిల్పం రూపొందించిన శిల్పి ఎవరు? ఏ ప్రాంతంలో దీన్ని చేశారనే వివరాలు లభ్యం కావడం లేదు.

సైకత సంక్రాంతి

తూర్పు గోదావరి జిల్లా రంగంపేటకు చెందిన సైకత శిల్పి దేవిన శ్రీనివాస్ కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌లో సంక్రాంతి పండుగ సందర్భంగా 'సేవ్ అవర్ కల్చర్' 'మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుందాం'.. అనే నినాదంతో గంగిరెద్దులు, హరిదాసు, ముగ్గులు పెడుతున్న యువతి, గాలిపటాలు, పొదరిల్లుతో కూడిన పల్లె వాతావరణాన్ని శనివారం సైకత శిల్పంగా రూపొందించారు. ఇది సందర్శకులను విశేషంగా ఆకర్షిస్తోంది.



గంగిరెద్దులు, హరిదాసు, ముగ్గులుపెడుతున్న యువతి, గాలిపటాలు, పొదరిల్లుతో కూడిన పల్లెవాతావరణాన్ని సైకత శిల్పం

మత్స్యకారునికి 'కోనేం' పంట

రూ.25 వేలకు కొనుగోలు చేసిన వ్యాపారి

గార: శ్రీకాకుళం జిల్లా గార మండలంలోని బందరువానిపేట సముద్ర తీరంలో వేటకు వెళ్లిన మత్స్యకారుని వలలో కోనేం చేప చిక్కింది. బందరువానిపేట గ్రామానికి చెందిన కందు లోకయ్య తన కుమారులు రమేశ్, రాజేశ్‌లను వెంట తీసుకొని శనివారం వేకువజామున సముద్రంలో వేటకు వెళ్లాడు. వలకు బరువైన చేప తగలడంతో మరో నలుగురి మత్స్యకారులు సాయంతో వలను బయటకు తీయగా సుమారు 200 కేజీల బరువుండే కొమ్ముల కోనేం చేపను గుర్తించారు. దీన్ని మత్స్యకారుని వద్ద నుంచి శ్రీకాకుళానికి చెందిన చేపల వ్యాపారి రూ.25 వేలకు కొనుగోలు చేశాడు. ఈ సందర్భంగా లోకయ్య 'సాక్షి'తో మాట్లాడుతూ సంక్రాంతి పండగ మాకు ముందే వచ్చేసిందని ఆనందం వ్యక్తం చేశాడు.



మత్స్యకారుని వలకు చిక్కిన భారీ కోనేం చేప

సాక్షి స్పోర్ట్స్
ఆదివారం 14-1-2018



టాటా స్టీల్ మాస్టర్స్ టోర్నీలో ఆనంద్ శుభారంభం

ప్రతిష్టాత్మక టాటా స్టీల్ మాస్టర్స్ చెస్ టోర్నమెంట్‌లో భారత దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ శుభారంభం చేశాడు. నెదర్లాండ్స్‌లోని విక్ ఆన్ జీ పట్టణంలో శనివారం మొదలైన ఈ టోర్నీ తొలి రౌండ్‌లో ఆనంద్ 53 ఎత్తుల్లో మాక్సిమ్ మత్లాకోవ్ (రష్యా)ను ఓడించాడు. పీటర్ స్విడ్లెర్ (రష్యా)తో జరిగిన మరో గేమ్‌లో భారత్‌కే చెందిన ఆదిబన్ 33 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. ఇదే టోర్నీ చాలెంజర్స్ విభాగంలో పోటీపడుతున్న ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక తొలి గేమ్‌ను 'డ్రా'గా ముగించింది. అమీన్ బాసిమ్ (ఈజిప్ట్)తో జరిగిన గేమ్‌ను హారిక 30 ఎత్తుల్లో 'డ్రా' చేసుకుంది.



అశ్విన్

పోరాడి... పైచేయి

ఓపెనర్లు శుభారంభం అందించారు. ఆపద్బాంధవుడు ఆమ్లా నిలిచాడు. కెప్టెన్ డు ప్లెసిస్ కుదురుకున్నాడు. ఇంకా డికాక్ రావాల్సి ఉంది. పరిస్థితి చూస్తే ఆతిథ్య జట్టు ఆధిపత్యంతో తొలి రోజు ముగిసేలా ఉంది. కానీ భారత్ పుంజుకుంది. రెండు ఓవర్ల వ్యవధిలో మూడు వికెట్లు పడగొట్టి ప్రత్యర్థిపై పైచేయి సాధించింది. సెంచూరియన్ టెస్టులో తేరుకుంది. రెండో రోజు భారత్ చేయాల్సిందల్లా దక్షిణాఫ్రికాను సాధ్యమైనంత త్వరగా ఆలౌట్ చేయడం... బ్యాటింగ్‌లో ప్రతాపం చూపడం!

- చివరి సెషన్‌లో పుంజుకున్న భారత్
- శతకం చేజారిన మార్క్‌రమ్
- రాణించిన ఆమ్లా
- దక్షిణాఫ్రికా 269/6
- అశ్విన్‌కు మూడు వికెట్లు

సెంచూరియన్: ఒకరు ఇబ్బందిగా కదిలితే... మరొకరు సాధికారికంగా ఆడారు... ఇంకొకరు నిలదొక్కుకుంటే... అవతలివైపు వారు దూకుడు చూపారు... తమకు పెట్టని కోటలాంటి రెండో టెస్టు వేదిక సూపర్ స్పోర్ట్ పార్క్ పిచ్‌పై శనివారం సఫారీల ఇన్నింగ్స్ సాగిన తీరిది. అప్పుడప్పుడు ఓ వికెట్ అన్నట్లుగా సాగిన భారత్ బౌలింగ్‌ను రెండు సెషన్ల పాటు ధీమాగా ఆడింది. ప్రతి బ్యాట్స్‌మన్ తలా కొన్ని పరుగులు అందించడంతో మెరుగైన స్కోరు దిశగా కదిలింది. అయితే... చివర్లో రనౌట్లతో తడబడి వికెట్లు చేజార్చుకుంది. అంతకుముందు ఓపెనర్ ఐడెన్ మార్క్‌రమ్ (150 బంతుల్లో 94; 15 ఫోర్లు), డిపెండబుల్ బ్యాట్స్‌మన్ హషీమ్ ఆమ్లా (153 బంతుల్లో 82; 14 ఫోర్లు) రాణించడంతో ప్రొటీస్ జట్టు తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆరు వికెట్లకు 269 పరుగులు చేసింది. కెప్టెన్ డు ప్లెసిస్ (77 బంతుల్లో 24 బ్యాటింగ్), కేశవ్ మహరాజ్ (23 బంతుల్లో 10 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. అశ్విన్ మూడు వికెట్లు పడగొట్టగా, ఇషాంత్‌కు ఒకటి దక్కింది.

రెండు సెషన్లు వారివే...

పేస్ స్వర్గధామంగా పేరొందిన పిచ్‌పై టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికాకు మంచి ఆరంభం దక్కింది. ఓపెనర్లు ఎల్గర్ (83 బంతుల్లో 31; 4 ఫోర్లు), మార్క్‌రమ్ పట్టుదలగా ఆడారు. ఎల్గర్ తడబడుతుండటంతో స్పిన్నర్ అశ్విన్‌ను ముందే బౌలింగ్‌కు దింపినా లంచ్ వరకు భారత్‌కు వికెట్ దక్కలేదు. తొలి వికెట్‌కు 85 పరుగులు జోడించాక అతడు అశ్విన్‌కే చిక్కాడు. వన్‌డౌన్ బ్యాట్స్‌మన్ ఆమ్లా కూడా ఏమంత సౌకర్యంగా కనిపించలేదు. 14, 30 పరుగుల వద్ద అవుటయ్యే ప్రమాదం తప్పించుకున్నాడు. మార్క్‌రమ్ మాత్రం మొదటి నుంచి చక్కగా ఆడాడు. పేసర్లను దీటుగా ఎదుర్కొంటూ బౌండరీలు కొట్టాడు. రెండో వికెట్‌కు 63 పరుగులు జోడించాక... శతకం ఖాయం అనుకుంటున్న దశలో అశ్విన్ బౌలింగ్‌లో లేట్ కట్‌కు యత్నించి పార్థివ్ పట్టిన చురుకైన క్యాచ్‌కు అతను వెనుదిరిగాడు. దీంతో క్రీజులోకి వచ్చిన డివిలియర్స్ (48 బంతుల్లో 20; 2 ఫోర్లు) తన సహజ తీరుతో ఆడేందుకు యత్నించాడు. రివర్స్ స్వీప్‌తో ఫోర్ కొట్టాడు. మూడో వికెట్‌కు 51 పరుగులు జత చేశాక... ఇషాంత్ బంతిని వికెట్ల మీదకు ఆడుకుని బౌల్డయ్యాడు. ఈ సమయానికి దక్షిణాఫ్రికా స్కోరు 199. తర్వాత ఆమ్లా, డుప్లెసిస్ ఎలాంటి అవకాశం ఇవ్వకుండా ఆడారు.

పాండ్యా ఈసారి రనౌట్లతో...

మరో 9 ఓవర్లే మిగిలాయి. స్కోరు 246/3. దీంతో దక్షిణాఫ్రికా మెరుగ్గానే రోజును ముగించేలా కనిపించింది. ఇక్కడే... హార్దిక్ పాండ్యా ఆటను మలుపు తిప్పాడు. తొలి టెస్టులో ఇటు బ్యాట్, అటు బంతితో ముద్ర వేసిన ఈ యువ ఆల్‌రౌండర్ ఈసారి రనౌట్ల రూపంలో జట్టుకు ఉపయోగ పడ్డాడు. తన బౌలింగ్‌లో బంతిని షార్ట్ లెగ్‌లోకి ఆడి పరుగుకు ప్రయత్నించిన ఆమ్లాను అతడు డైరెక్ట్ హిట్ ద్వారా పెవిలియన్‌కు పంపాడు. ఫాలో త్రూలో బంతిని అందుకుని మరీ నేరుగా వికెట్లకు కొట్టిన ఈ రనౌట్ తొలి రోజు ఆటలో హైలైట్. పాండ్యా మరుసటి ఓవర్‌లోనే ఫిలాండర్ లేని పరుగుకు యత్నించి అవుటయ్యాడు. ఈసారీ పాండ్యా ఫాలో త్రూలో బ్యాట్స్‌మన్ క్రీజు వద్దకు వచ్చి పార్థివ్ నుంచి బంతిని అందుకుని వికెట్లను గిరాటేయడం గమనార్హం. అంతకుముందు డికాక్ (0)ను అద్భుత బంతితో అశ్విన్ వెనక్కి పంపడంతో ప్రత్యర్థి 5 పరుగుల తేడాతో 3 వికెట్లు కోల్పోయింది. ఒక్కసారిగా 251/6కు పడిపోయింది.

అశ్విన్ చమక్...

సెంచూరియన్‌లో అసలు స్పిన్నర్‌కు చోటుంటుందా అని భావించే పరిస్థితుల్లో కూడా రవిచంద్రన్ అశ్విన్ (3/90) ప్రభావం చూపాడు. 20వ ఓవర్‌లోనే బౌలింగ్‌కు దిగి ఇన్నింగ్స్‌లో అత్యధికంగా 31 ఓవర్లు వేయడంతో పాటు ఓపెనర్లు సహా ప్రమాదకర డికాక్‌ను అవుట్ చేశాడు. అశ్విన్ బౌలింగ్ బాగా పడుతుండటం చూసి కోహ్లి... సుదీర్ఘ స్పెల్స్(17–8–6) వేయించాడు. దీనికి తగ్గట్లే అతడు కెప్టెన్ నమ్మకాన్ని నిలబెట్టుకున్నాడు.

మన పేస్ సాదాసీదాగానే...

భారత్ బౌలింగ్ దాడిని బుమ్రా, షమీ ప్రారంభించారు. అడపాదడపా మంచి బంతులేసినా పిచ్‌కు తగ్గట్లు పదును చూపలేకపోయారు. వీరిని మార్క్‌రమ్ అవలీలగా ఎదుర్కొన్నాడు. షమీ అయితే ఓవర్‌కు సగటున 4 పరుగులు ఇచ్చాడు. దీంతో అశ్విన్‌ను ముందే దింపాల్సి వచ్చింది. షమీ ఆట మధ్యలో తలనొప్పి కారణంగా మైదానం వీడాడు. మరోవైపు ఇషాంత్ (1/32) పరుగుల కట్టడితో పాటు ప్రమాదకరంగా కనిపించాడు. డివిలియర్స్‌ను అవుట్ చేశాడు.

లేదు... కాదంటూనే మూడు మార్పులు

తుది జట్టు ఆటగాళ్ల కూర్పుపై శుక్రవారం తీవ్రంగా స్పందించిన భారత కెప్టెన్ విరాట్ కోహ్లి అసలు టెస్టు సమయానికి వచ్చేసరికి అందరి అంచనాలను తలకిందులు చేస్తూ ఏకంగా మూడు మార్పులతో బరిలో దిగాడు. పరిస్థితులరీత్యా తప్పక ఉంటారని భావించినప్పటికీ ఓపెనర్ శిఖర్ ధావన్, కీపర్ సాహా, పేసర్ భువనేశ్వర్‌లను పక్కన పెట్టాడు. కేఎల్ రాహుల్, పార్థివ్ పటేల్, ఇషాంత్ శర్మలకు చోటిచ్చాడు. అన్నిటికి మించి తొలి టెస్టులో బౌలర్‌గా సత్తాచాటి, బ్యాటింగ్‌లో అధిక బంతులు ఆడిన భువీని.... బౌన్స్‌ను దృష్టిలో పెట్టుకుని ఇషాంత్‌ను తీసుకోవడం కోసం త్యాగం చేయాల్సి వచ్చింది. ఎన్ని వైపుల నుంచి ఒత్తిడి వచ్చినా రహానేకు అవకాశం ఇవ్వకుండా రోహిత్ శర్మపైనే నమ్మకముంచాడు.



ఆమ్లా



మార్క్‌రమ్

ధావన్ ఎప్పుడూ బలి పశువేనా...?

తలపై నిత్యం వేటు కత్తి వేలాడుతూ ఓపెనర్ శిఖర్ ధావన్ ఎప్పుడూ బలి పశువు కావాల్సిందేనా? అతడిని తప్పించాలంటే ఒక్క వైఫల్యం చాలేమో? షమీ లేదా బుమ్రాను కాకుండా భువనేశ్వర్‌ను తప్పించి ఇషాంత్ శర్మను తుది జట్టులో ఎందుకు తీసుకున్నారో నాకు అర్థం కావడం లేదు.

–సునీల్ గావస్కర్



ఈసారి విఫలమైతే కోహ్లి తప్పుకోవాలి

ధావన్‌ను ఒక్క వైఫల్యానికే తప్పించారు. ఎత్తు కారణంగా ఇషాంత్‌ను ఎంచుకున్నా వేరే బౌలర్ స్థానంలో తీసుకోవాల్సింది. భువీ ఆత్మవిశ్వాసాన్ని కోహ్లి దెబ్బతీశాడు. సెంచూరియన్‌లో విఫలమైతే మూడో టెస్టు నుంచి కోహ్లి తనంతట తాను తప్పుకోవాలి.

–వీరేంద్ర సెహ్వాగ్

స్కోరు వివరాలు

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: ఎల్గర్ (సి) విజయ్ (బి) అశ్విన్ 31; మార్క్‌రమ్ (సి) పార్థివ్ పటేల్ (బి) అశ్విన్ 94; ఆమ్లా (రనౌట్) 82; డివిలియర్స్ (బి) ఇషాంత్ శర్మ 20; డు ప్లెసిస్ (బ్యాటింగ్) 24; డి కాక్ (సి) కోహ్లి (బి) అశ్విన్ 0; ఫిలాండర్ (రనౌట్) 0; కేశవ్ మహరాజ్ (బ్యాటింగ్) 10; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (90 ఓవర్లలో ఆరు వికెట్లకు) 269**

వికెట్ల పతనం: 1–85, 2–148, 3–199, 4–246, 5–250, 6–251

బౌలింగ్: బుమ్రా 18–4–57–0, షమీ 11–2–46–0, ఇషాంత్ శర్మ 16–3–32–1, హార్దిక్ పాండ్యా 14–4–37–0, అశ్విన్ 31–8–90–3.

విండీస్‌కు షాక్



అలెన్

తౌరంగ (న్యూజిలాండ్): అండర్–19 క్రికెట్ ప్రపంచ కప్‌లో డిఫెండింగ్ చాంపియన్ వెస్టిండీస్ జట్టుకు తొలి లీగ్ మ్యాచ్‌లోనే చుక్కెదురైంది. ఆతిథ్య న్యూజిలాండ్ ఎనిమిది వికెట్ల తేడాతో విండీస్‌ను ఓడించి శుభారంభం చేసింది. తొలుత విండీస్ ఎనిమిది వికెట్లకు 233 పరుగులు సాధించగా... న్యూజిలాండ్ 39.3 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అధిగమించింది. ఫిన్ అలెన్ (115 నాటౌట్; 15 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ సెంచరీ చేసి కివీస్ విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఇతర మ్యాచ్‌ల్లో అఫ్ఘానిస్తాన్ ఐదు వికెట్లతో పాకిస్తాన్‌ను బోల్తా కొట్టించగా... పపువా న్యూగినియాపై జింబాబ్వే పది వికెట్ల తేడాతో.., బంగ్లాదేశ్ 87 పరుగుల తేడాతో నమీబియాపై గెలుపొందాయి.

బెంగళూరును ఫైనల్‌కు చేర్చిన సిక్కి జంట

- నిర్ణాయక మ్యాచ్‌లో అద్భుత విజయం
- నేడు హైదరాబాద్ హంటర్స్‌తో టైటిల్ పోరు
- రాత్రి గం.7 నుంచి స్టార్ స్పోర్ట్స్–1లో ప్రత్యక్ష ప్రసారం

సాక్షి, హైదరాబాద్: ఫైనల్ చేరాలంటే తప్పనిసరిగా గెలవాల్సిన మ్యాచ్‌లో బెంగళూరు బ్లాస్టర్స్ మిక్స్‌డ్ డబుల్స్ జంట సిక్కి రెడ్డి–కిమ్ సా రంగ్ అద్భుత ఆట తీరును కనబరిచింది. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో సిక్కి రెడ్డి–కిమ్ సా రంగ్ ద్వయం 15–12, 13–15, 15–9తో కామిల్లా రైటర్ జుల్–లా చెయుక్ హిమ్ జోడీని ఓడించింది. దాంతో క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ యజమానిగా ఉన్న బెంగళూరు బ్లాస్టర్స్ జట్టు ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్)లో ఫైనల్లోకి దూసుకెళ్లింది. శనివారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన రెండో సెమీఫైనల్లో బెంగళూరు బ్లాస్టర్స్ 4–3తో అహ్మదాబాద్ స్మాష్ మాస్టర్స్‌ను ఓడించింది. ఆదివారం జరిగే ఫైనల్లో హైదరాబాద్ హంటర్స్‌తో బెంగళూరు బ్లాస్టర్స్ అమీతుమీ తేల్చుకుంటుంది.



కిమ్ సా రంగ్, సిక్కిరెడ్డి

అంతకుముందు తొలి మ్యాచ్‌లో సౌరభ్ వర్మ (అహ్మదాబాద్) 15–2, 14–15, 15–10తో చోంగ్ వె ఫెంగ్ (బెంగళూరు)ను ఓడించాడు. పురుషుల డబుల్స్ మ్యాచ్‌లో మథియాస్ బో–కిమ్ సా రంగ్ జంట (బెంగళూరు) 15–13, 15–12తో రెగినాల్డ్–నందగోపాల్ (అహ్మదాబాద్) ద్వయంపై నెగ్గింది. ఈ మ్యాచ్‌ను బెంగళూరు 'ట్రంప్'గా ఎంచుకోవడంతో ఆ జట్టు 2–1తో ఆధిక్యంలోకి వెళ్లింది. అనంతరం మహిళల సింగిల్స్‌ను అహ్మదాబాద్ 'ట్రంప్' మ్యాచ్‌గా తీసుకుంది. ప్రపంచ నంబర్‌వన్ తై జు యింగ్ 8–15, 15–13, 15–8తో కిర్‌స్టీ గిల్మోర్ (బెంగళూరు)పై గెలిచింది. దాంతో అహ్మదాబాద్ 3–2తో ముందంజ వేసింది. నాలుగో మ్యాచ్‌గా జరిగిన పురుషుల సింగిల్స్ రెండో మ్యాచ్‌లో ప్రపంచ నంబర్‌వన్ విక్టర్ అక్సెల్‌సన్ (బెంగళూరు) 15–11, 15–14తో ప్రణయ్‌ను ఓడించాడు. దాంతో స్కోరు 3–3తో సమంగా నిలిచింది. ఈ దశలో చివరి మ్యాచ్‌గా జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ మ్యాచ్‌లో హైదరాబాద్ అమ్మాయి సిక్కి రెడ్డి–కిమ్ సా రంగ్ జంట నెగ్గడంతో బెంగళూరు బ్లాస్టర్స్ విజయంతో పాటు ఫైనల్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది.

భళా... బౌల్ట్

- పాకిస్తాన్ 74 ఆలౌట్
- మూడో వన్డేలో కివీస్‌దే విజయం



డ్యూనెడిన్: సమష్టి ప్రదర్శనతో మరోసారి సత్తా చాటిన న్యూజిలాండ్ జట్టు... పాకిస్తాన్‌తో జరుగుతున్న ఐదు వన్డేల సిరీస్‌ను రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే సొంతం చేసుకుంది. పేస్ బౌలర్ ట్రెంట్ బౌల్ట్ (5/17) నిప్పులు చెరిగే బంతులతో పాకిస్తాన్‌ను హడలెత్తించడంతో... శనివారం జరిగిన మూడో వన్డేలో న్యూజిలాండ్ 183 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించి 3–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ సరిగ్గా 50 ఓవర్లలో 257 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ విలియమ్సన్ (73; 7 ఫోర్లు), రాస్ టేలర్ (52; 4 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు. గప్టిల్ (45; 4 ఫోర్లు, ఒక సిక్స్), లాథమ్ (35; 3 ఫోర్లు) కూడా రాణించారు. పాక్ బౌలర్లలో రుమాన్ రయీస్, హసన్ అలీ మూడేసి వికెట్లు తీశారు. అనంతరం పాకిస్తాన్ జట్టు బౌల్ట్ ధాటికి 27.2 ఓవర్లలో 74 పరుగులకే కుప్పకూలింది. ఆరంభంలోనే బౌల్ట్ ఐదు బంతుల తేడాలో మూడు వికెట్లు పడగొట్టడంతో ఒకదశలో పాక్ 32 పరుగులకే 8 వికెట్లు చేజార్చుకుంది. చివర్లో ఆమిర్ (14; 3 ఫోర్లు), రయీస్ (16; 3 ఫోర్లు) పుణ్యమాని స్కోరు 70 పరుగులు దాటింది. ఓవరాల్‌గా వన్డేల్లో పాకిస్తాన్ తమ మూడో అత్యల్ప స్కోరును నమోదు చేసింది. సిరీస్‌లో నాలుగో వన్డే ఈనెల 16న జరుగుతుంది.

వేలానికి 1,122 మంది క్రికెటర్లు

ఐపీఎల్–2018కి భారీ డిమాండ్ ● ఈ నెల 27, 28 తేదీల్లో వేలం

న్యూఢిల్లీ: కాసులు కురిపించే ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) టి20 టోర్నమెంట్‌లో భాగమయ్యేందుకు అన్ని దేశాల క్రికెటర్లు ఉత్సుకత చూపిస్తున్నారు. 2018 సీజన్‌కు సంబంధించి ఆటగాళ్ల వేలానికి ఏకంగా 1,122 మంది క్రికెటర్లు పేర్లను నమోదు చేసుకున్నారు. ఆస్ట్రేలియా నుంచి మొదలుకొని అమెరికా దాకా ఆటగాళ్లు తమ ఎంట్రీలను ఖరారు చేశారు. బెంగళూరులో ఈనెల 27, 28 తేదీల్లో వేలం కార్యక్రమం జరుగుతుంది. ఫ్రాంచైజీలకు పంపించిన క్రికెటర్ల జాబితాలో జాతీయ జట్లకు ఆడిన వారు 281 మంది... ఆడని వారు 838 మంది ఉన్నట్లు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) తెలిపింది. భారత్ నుంచి అత్యధికంగా 778 ఎంట్రీలున్నాయి. ఇటీవలే ఎనిమిది ఫ్రాంచైజీలు మొత్తం 18 మంది ఆటగాళ్లను అట్టిపెట్టుకున్నాయి. వీరిని మినహాయించి మిగతా ఆటగాళ్లు వేలంలో భాగమవుతారు.

వేలంలో భారత స్టార్ ఆటగాళ్లు

లోకేశ్ రాహుల్, రహానే, అశ్విన్, యువరాజ్ సింగ్, గంభీర్, యజువేంద్ర చహల్, హర్భజన్ సింగ్, మురళీ విజయ్, కుల్దీప్ యాదవ్.

వేలంలో విదేశీ స్టార్ ఆటగాళ్లు

క్రిస్ గేల్, డ్వేన్ బ్రేవో, కార్లోస్ బ్రాత్‌వైట్ (వెస్టిండీస్), బెన్ స్టోక్స్, ఇయాన్ మోర్గాన్ (ఇంగ్లండ్), గ్లెన్ మ్యాక్స్‌వెల్, మిచెల్ స్టార్క్, షేన్ వాట్సన్ (ఆస్ట్రేలియా), డేవిడ్ మిల్లర్, డు ప్లెసిస్, రబడ, డి కాక్ (దక్షిణాఫ్రికా), కొలిన్ మున్రో (న్యూజిలాండ్), ఎంజెలో మాథ్యూస్, తిసారా పెరీరా, లసిత్ మలింగ (శ్రీలంక), ముస్తఫిజుర్ రెహమాన్ (బంగ్లాదేశ్), రషీద్ ఖాన్ (అఫ్ఘానిస్తాన్).

విదేశీ ఆటగాళ్ల సంఖ్య

ఆస్ట్రేలియా	58	అఫ్ఘానిస్తాన్	13
దక్షిణాఫ్రికా	57	బంగ్లాదేశ్	8
శ్రీలంక	39	జింబాబ్వే	7
వెస్టిండీస్	39	ఐర్లాండ్	2
న్యూజిలాండ్	30	అమెరికా	2
ఇంగ్లండ్	26	స్కాట్లాండ్	1



రామ్‌కుమార్ ముందంజ

మరో మ్యాచ్ గెలిస్తే మెయిన్ డ్రాకు అర్హత

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ క్వాలిఫయింగ్ టోర్నమెంట్‌లో భారత అగ్రశ్రేణి టెన్నిస్ ఆటగాడు రామ్‌కుమార్ రామనాథన్ ముందంజ వేశాడు. శనివారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో ప్రపంచ 141వ ర్యాంకర్ రామ్‌కుమార్ 6–4, 7–6 (14/12)తో గ్లెబ్ సఖరోవ్ (ఫ్రాన్స్)పై గెలుపొందాడు. గంటా 49 నిమిషాలపాటు సాగిన ఈ మ్యాచ్‌లో రామ్‌కుమార్ ఏకంగా 17 ఏస్‌లు సంధించడం విశేషం. తన సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయిన రామ్ ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశాడు. క్వాలిఫయింగ్‌లో భారత్ నుంచి నలుగురు బరిలోకి దిగగా... రామ్‌కుమార్, యూకీ బాంబ్రీ మాత్రమే ఫైనల్ రౌండ్‌కు చేరుకున్నారు. ఆదివారం జరిగే ఫైనల్ రౌండ్ మ్యాచ్‌ల్లో పీటర్ పొలాన్‌స్కీ (కెనడా)తో యూకీ; వాసెక్ పోస్పిసిల్ (కెనడా)తో రామ్‌కుమార్ తలపడతారు. ఈ మ్యాచ్‌ల్లో గెలిస్తే యూకీ, రామ్‌కుమార్ మెయిన్ 'డ్రా'కు అర్హత సాధిస్తారు. ప్రధాన టోర్నీ రేపటి నుంచి మొదలవుతుంది.

అజయ్ ఆల్‌రౌండ్ ప్రదర్శన

అంధుల ప్రపంచకప్‌లో భారత్‌కు మరో విజయం

దుబాయ్: కెప్టెన్ అజయ్ కుమార్ రెడ్డి ఆల్‌రౌండ్ ప్రదర్శనతో... అంధుల వన్డే క్రికెట్ ప్రపంచకప్‌లో భారత జట్టు మరో విజయం నమోదు చేసింది. బంగ్లాదేశ్‌తో శనివారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 10 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 40 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు 226 పరుగులు సాధించింది. అజయ్ రెడ్డి అద్భుతంగా బౌలింగ్ చేసి నాలుగు వికెట్లు పడగొట్టాడు. అనంతరం భారత్ 18.4 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 227 పరుగుల లక్ష్యాన్ని అధిగమించింది. ఓపెనర్లు అజయ్, సునీల్ రమేశ్ బంగ్లాదేశ్ బౌలర్ల భరతం పడుతూ అజేయ సెంచరీలు చేయడం విశేషం. అజయ్ కుమార్ రెడ్డి 60 బంతుల్లో 14 ఫోర్లతో 101 పరుగులు... సునీల్ రమేశ్ 57 బంతుల్లో 17 ఫోర్లతో 105 పరుగులు చేశారు.



Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No. 310, Tadigotla Village, Chintakommadinne Mandal, YSR Kadapa District. 516 003 and Printed at Jagati Publications Limited, Survey No. 310, Tadigotla Village, Chintakommadinne Mandal, YSR Kadapa District. 516 003 EDITOR: V. Murali, Phone No. 08562-200076, 77 RNI Regn No. APTEL/2008/23796.


Happy
Makar
Sankranti
సంక్రాంతి శుభ సందర్భానికి స్వర్ణమయ సంపదలు
అద్భుతమైన ఆఫర్, వదులుకోరాని ఆఫర్
ఉచిత
బంగారు
నాణెం
200 MG
₹50,000
విలువ గల
మరియు
అంతకు మించి
ప్రతి నగల
కొనుగోలుపై
*Conditions apply
మిలియన్‌కి పైగా గల డిజైన్లలో తయారు చేయబడిన విశ్వస్థాయి ఆభరణాలతో మీ సంబరాలను మరింత భవ్యంగా చేసుకోండి.
మీరు సర్వదా కోరుకున్న నగలు, వదులుకోలేని ఆఫర్లతో పొంది ప్రతి సందర్భంలోను స్టార్‌లా వెలిగిపోండి!
www.joyalukkas.com
Joyalukkas
World's favourite jeweller
HYDERABAD • KUKATPALLY • VIJAYAWADA • CHITTOOR • GUNTUR • NELLORE • ONGOLE • VISAKHAPATNAM • KAKINADA
NIZAMABAD • WARANGAL • KHAMMAM • KADAPA • RAJAHMUNDRY • TIRUPATI • KARIMNAGAR • ANANTAPUR • KURNOOL
140 SHOWROOMS AROUND THE WORLD



లోపలి పేజీలో
దర్శకురాలు మంజుల,
హీరో సందీప్ కిషన్,
నటి-నిర్మాత మంచు
లక్ష్మీ ప్రసన్న, హీరోయిన్
షాలినీ పాండేల
సంక్రాంతి విశేషాలు...



సాక్షి ఫ్యామిలీ
వైఎస్ఆర్ జిల్లా
ఆదివారం, 14-1-2018



'రంగులరాట్నం' టీమ్ సితార, శ్రీరంజని, రాజ్ తరుణ్, చిత్రా శుక్లా, ప్రియదర్శి సంక్రాంతి సంబరాలు

సమంత ఆటపట్టించింది - నాగార్జున

అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై శ్రీరంజని దర్శకత్వంలో రాజ్‌తరుణ్, చిత్రా శుక్లా జంటగా నాగార్జున నిర్మించిన చిత్రం 'రంగుల రాట్నం'. ఇందులో సితార, ప్రియదర్శి కీలక పాత్రలు చేశారు. నిర్మాత నాగ్‌తో ఎక్స్‌క్లూజివ్ ఇంటర్వ్యూ, నటీనటులతో సంక్రాంతి విశేషాలు.

ఈ సంక్రాంతి మీకు చాలా స్పెషల్. అఖిల్ 'హలో' హిట్. నాగచైతన్య పెళ్లి చేసుకుని సెటిల్ అయ్యారు..

అవును. వెరీ స్పెషల్ సంక్రాంతి. పిల్లలు సెటిల్ అయితే చాలా హ్యాపీగా ఉంటుంది. 'హలో'తో అఖిల్‌కి మంచి పేరు వచ్చింది. మీడియా, డైరెక్టర్స్, ప్రొడ్యూసర్స్, ఆడియన్స్.. ఇలా అందరూ కాంప్లిమెంట్స్ ఇచ్చారు. లాస్ట్ వన్ ఇయర్ బాగాలేదు. పర్సనల్‌గా, ప్రొఫెషనల్‌గా ఎదురైన ఒత్తిడిని తట్టుకొని, నిలబడి సినిమా చేశాడు. అఖిల్ యాక్టింగ్ చూసి, నేను కూడా షాక్ అయ్యాను. తండ్రిగా కాకుండా ఒక ఆర్టిస్ట్‌గా చూస్తే ఆ యాక్షన్, డైలాగ్ డిక్షన్, డాన్స్ చాలా బాగా చేశాడనిపించింది. తెలుగు ఇంత బాగా మాట్లాడతాడనుకోలేదు. వాయిస్ అంత బాగా ఎక్కడ నుంచి వచ్చిందో తెలియదు.. భలే పాడాడు. నాన్న (అక్కినేని నాగేశ్వరరావు) ఎప్పుడూ చెబుతుండేవారు 'కసి ఉంటేనేరా పైకి వచ్చేది' అని. అఖిల్ ఆ కసితోనే చేశాడనిపించింది. హ్యాపీగా ఉంటే శుబ్బరంగా తిని పడుకుంటాం. ఇప్పుడు మేం అంత హ్యాపీగా ఉన్నాం (నవ్వుతూ).

మీరన్నట్లు లైఫ్‌లో వచ్చే 'డౌన్స్'ని తట్టుకుని నిలబడటం గ్రేట్. ఓ ఫాదర్‌గా మీ పిల్లలకు మీరు భలే మోరల్ సపోర్ట్ ఇస్తారనిపిస్తుంటుంది..

నా మొదటి నాలుగు సినిమాలు ఆడనప్పుడు నాన్నగారు 'లైఫ్ విల్ టీచ్ యు' అన్నారు. నేను నా పిల్లలకు కూడా అదే చెబుతుంటాను. దాంతో పాటు గొప్ప గొప్ప వ్యక్తుల లైఫ్ ఎగ్జాంపుల్స్ చెబుతుంటాను. 'నిన్ను ఎవరైనా తిట్టారు అంటే అది పర్సనల్‌గా కాదు.. బాగా లేని నీ సినిమాని' అంటుంటా. 'క్రికెట్‌లో కోహ్లీ బాగా ఆడలేదు అంటే పర్సనల్ అని కాదు పార్ట్ ఆఫ్ ది గేమ్ అంతే' అని చెబుతుంటాను. నాకంటే కూడా అమల స్పిరిచ్యువల్‌గా బాగా మోటివేట్ చేస్తుంది. వాళ్లు గంటలు గంటలు మాట్లాడుకుంటారు. పేరెంట్స్ ఎప్పుడైతే పిల్లలతో ఎక్కువ టైమ్ స్పెండ్ చేస్తారో ఇక వాళ్లకు లోన్లీ ఫీలింగ్ ఎందుకు ఉంటుంది? ఎవరికైనా సరే పేరెంట్స్ సపోర్ట్ ఇస్తే చాలు. మనం ముసలివాళ్లు అయిపోయినా కూడా దెబ్బ తగిలితే 'అమ్మా' అనే అంటాం కదా.

పిల్లలకి పేరెంట్స్ సపోర్ట్ అవసరం

అవును. ఎంత ఎదిగినా తల్లిదండ్రులకు బిడ్డే కదా. ఓకే.. ఇంటికి కొత్త కోడలు వచ్చాక మీరు జరుపుకుంటున్న ఫస్ట్ సంక్రాంతి. సెలబ్రేషన్స్ ఎలా ప్లాన్ చేశారు?

ఈరోజు (శుక్రవారం) అందరం స్టూడియోలోనే కలిశాం. అన్నపూర్ణ స్టూడియోస్ స్థాపించి 42 ఇయర్స్ అయింది. వర్కర్స్ అందరికీ భోజనాలు పెట్టింది సమంత. మేమంతా కలసి భోజనం చేశాం. ఆ సమయంలో ఏవేవో జోక్స్. సమంత అయితే 'మై హస్బెండ్ ఈజ్ ది బెస్ట్' అంది. అంతే.. మేమంతా షాక్ (నవ్వుతూ). అంటే.. మేమందరం మా భార్యలకు మంచి హస్బెండ్స్ కాదా? అనడిగాం. 'లేదు.. లేదు.. మై హస్బెండ్ ఈజ్ ది బెస్టెస్ట్' అంది. ఆ విధంగా మా అందర్నీ ఆటపట్టించింది.

చిన్నప్పుడు గాలి పటాలు ఎగరేశారా? ఏవైనా మెమరీస్ ఉంటే చెబుతారా?

సంక్రాంతి అంటే అదే పని మీద ఉండేవాళ్లం. ఫ్రెండ్స్‌తో కలిసి తెగ తిరిగేవాణ్ణి. హైదరాబాద్ కదా.. ఇక్కడ హడావిడి ఇంకా ఎక్కువ. చింతల్ బస్తీలో ఫ్రెండ్స్‌తో కలిసి గాలిపటాలు ఎగరేసేవాణ్ణి. కైట్స్, మాంజా తెగ కొనేవాళ్లం. వాటితో పాటు డప్పులు కూడా కొనేవాళ్లం. మేం ఎవరిదైనా కైట్‌ని కట్ చేస్తే.. వెంటనే డప్పులు కొట్టి, డ్యాన్స్ చేసేవాళ్లం. చింతల్ బస్తీ ఏరియా అంతా గోల గోల చేసేవాళ్లం. అప్పట్లో ఉన్నంత సందడి ఇప్పుడు లేదేమో అనిపిస్తోంది. ఎక్కడ? ఒక్క కైట్ కూడా కనిపించడంలేదు (పైకి చూస్తూ).



సంక్రాంతి అంటే 'తిల్ లడ్డూ' ఉండాల్సిందే - చిత్రా శుక్లా

మా ఊరు ఇండోర్‌లో సంక్రాంతి అంటే.. కొత్తగా పెళ్లయిన అమ్మాయిలను పుట్టింటికి పిలుస్తారు. స్పెషల్ గిఫ్ట్స్ ఇస్తారు. ఆ కొత్త జంటతో కలిసి ఇంట్లోవాళ్లందరం గాలిపటాలు ఎగరేస్తారు. 'తిల్ లడ్డూ' (నువ్వుల లడ్డూ) కంపల్సరీగా చేస్తాం. అది లేకపోతే సంక్రాంతి లేనట్లే. మేం సూర్య భగవాన్‌ని పూజిస్తాం. చాలా గ్రాండ్‌గా సెలబ్రేట్ చేస్తాం. ఈ సంక్రాంతి స్పెషల్ ఏంటంటే... హీరోయిన్‌గా నా సెకండ్ మూవీ (రంగుల రాట్నం) సంక్రాంతికి విడుదలవుతోంది. నేను, మా ఫ్యామిలీ చాలా సంతోషంగా ఉన్నాం. నేను తెలుగు పరిశ్రమలో పని చేస్తున్నందుకు, రెండో సినిమానే అన్నపూర్ణ బ్యానర్‌లో చేసినందుకు వెరీ హ్యాపీ. చిన్నప్పుడు చాలా సార్లు రంగుల రాట్నం ఎక్కాను. ఇప్పుడు కుడా చాన్స్ దొరికితే ఎక్కేస్తాను. రంగుల రాట్నం ఎక్కినప్పుడు నవ్వుతాం, భయపడతాం, అరుస్తాం, కేరింతలు కొడతాం.. అన్ని రకాల ఎమోషన్స్ కలుగుతాయి.. మన జీవితంలానే.

మావయ్య ఇంట్లో సంక్రాంతి

- సాయిధరమ్ తేజ్

సంక్రాంతి అనగానే మేము మా పెద్ద మావయ్య (చిరంజీవి) ఇంట్లో కలిసి అందరం హ్యాపీగా సెలబ్రేట్ చేసుకుంటాం. కజిన్స్ అందరం కలిసి బాగా సరదాగా టైమ్ స్పెండ్ చేస్తాం. భోగి రోజు మా అమ్మమ్మవాళ్ల ఇంట్లో పాత ఫర్నిచర్‌తో భోగి మంట వేస్తాం. బ్రేక్‌ఫాస్ట్ చేసిన తర్వాత అక్కడి నుంచి సినిమాలకు వెళతాం లేదా సరదాగా క్రికెట్ ఆడతాం. ముందుగా ప్లాన్ చేసుకున్న ప్రకారం ప్రొసీడ్ అవుతాం. ఒక్కోసారి ఏదైనా అవుటింగ్ ప్లాన్ చేస్తాం. చిన్నప్పుడు సంక్రాంతికి ఫ్రెండ్స్‌తో కలిసి గాలిపటాలు ఎగరేసేవాణ్ణి. కాలేజ్ డేస్‌లో అయితే ఫుల్ జోష్ అన్నమాట. స్కూలింగ్ టైమ్ అప్పుడు మేము, మా బాబాయిలు, కజిన్స్ అందరం మా అమ్మమ్మ ఇంటి మేడపై గాలిపటాలు ఎగరేసేవాళ్లం.



నన్ను చూసి నవ్వుకుంటే చాలు

- ప్రియదర్శి

సంక్రాంతి పండగ అంటే చాలు.. 'ఆ బిల్డింగ్ ఎక్కొద్దు.. ఈ బిల్డింగ్ ఎక్కొద్దు' అని రిస్ట్రిక్షన్స్ పెట్టేవారు మా నాన్నగారు. మేం ఎక్కడ పడిపోతామో అని ఆయన భయం. చిన్నప్పుడు ఓల్డ్‌సిటీలో ఉన్నప్పుడు పెద్దవాళ్లందరూ ఓ బ్యాచ్. చిన్నవాళ్లందరూ ఇంకో బ్యాచ్ అన్నమాట. పెద్దవాళ్లతో పోటీ పడి గాలిపటాలు ఎగరేసేవాళ్లం. నాకు ఊహ తెలిసిన దగ్గర్నుంచి సినిమా అంటే ప్రేమ. స్క్రీన్ మీద నన్ను చూసి ప్రేక్షకులు కొన్నిసార్లయినా నవ్వుకుని, నన్ను గుర్తుతెచ్చుకుంటే అదే చాలని కోరుకుంటున్నాను. ఫామ్‌లోకి రాకముందు, వచ్చిన తర్వాత నాలో వచ్చిన మార్పు ఏంటి? అంటే... 'మంచి బట్టలు వేసుకుంటున్నానండి. ఇదిగో నా హెయిర్ ఇలా బాగా సెట్ చేసుకున్నాను. అదే మార్పు' (నవ్వేస్తూ).



సాయిధరమ్ తేజ్



దారం అందిస్తే రెచ్చిపోయేవాణ్ణి - రాజ్ తరుణ్

నేను ఎనిమిదో క్లాస్‌లో ఉన్నప్పుడు సంక్రాంతి మూడు రోజులూ సినిమాలు చూసేవాణ్ణి. మొత్తం ఫ్యామిలీ అంతా కలిసి వెళ్లేవాళ్లం. మాములుగా అయితే సంక్రాంతి పండక్కి ఊరు వెళ్లేవాణ్ణి. కానీ, ఈరోజు నా సినిమా 'రంగుల రాట్నం' రిలీజ్ ఉంది కదా. అందుకే ఇక్కడే ఉంటున్నా. చిన్నప్పుడు నేను గాలిపటాలు బాగా ఎగరేసేవాణ్ణి. కానీ స్టార్టింగ్ ప్రాబ్లమ్. అంటే.. మా అన్నయ్య గానీ, ఫ్యామిలీ మెంబర్స్ కానీ ఎవరైనా కొంచెం దూరం ఎగరేసి ఆ తర్వాత దారం అందిస్తే నేను రెచ్చిపోయేవాణ్ణి. సంక్రాంతి అంటే మనకు ఉన్న అతి పెద్ద ఫెస్టివల్. ఇంత పెద్ద ఫెస్టివల్‌కి నా సినిమా రావడం చాలా హ్యాపీగా ఉంది.



రైతులు బాగుండాలి

కేరళలో సంక్రాంతి లేదు. మకర సంక్రాంతి రోజు మకర జ్యోతిని టీవీలో లైవ్ టెలీకాస్ట్ చూడటం తప్ప పండగ విశేషం ఏం లేదనుకునేదాన్ని. రాజీవ్‌తో పెళ్లయ్యాక ఇక్కడి పండగలు చేసుకోవటం అలవాటైంది. సంక్రాంతి ఎంత పెద్ద పండగో తెలిసింది. అప్పట్లో పండగలంటే తెల్లవారుజామున రంగు రంగుల ముగ్గులు వేయడం, పిండి వంటలు చేయడం చూసేదాన్ని. ఇప్పుడు అపార్ట్‌మెంట్ కల్చర్ వచ్చాక సంక్రాంతి వస్తుంది అన్న ఎగ్జైట్‌మెంట్ లేదు. అందుకే కొంతమంది ఊరికి వెళుతున్నారు. గాలిపటాలు ఎగరేయటం, మాంజాలు కాట్ చేయటం ఇవన్నీ తెలుసు. సంక్రాంతి అంటే రైతుల పండగ. వాళ్ల చేతికి పంట వస్తుంది. డబ్బులు వస్తాయి. వాళ్లు బావుంటే అందరం బాగుంటాం.



సుమ





చెట్టు నీడ

తండ్రీ కొడుకులు

తండ్రీ కొడుకులు మేడపైకి ఎక్కి గాలిపటం ఎగరేస్తున్నారు. గాలిపటాన్ని ఎలా ఎగరేయాలో తండ్రి పిల్లవాడికి నేర్పిస్తున్నాడు. గాలిపటం బాగా ఎత్తుకు వెళ్లాక, దారాన్ని కొడుకు చేతికి అందించాడు తండ్రి. కొడుకు ముఖం సంతోషంతో వెలిగిపోయింది. ఆ వెలుగులో తండ్రి మనసు ఉప్పొంగిపోయింది. కొంతసేపు దారాన్ని చేత్తో పట్టుకున్నాక కొడుకు తండ్రిని అడిగాడు.

''నాన్నా.. దారంతో పట్టి ఉంచితేనే గాలిపటం అంత ఎత్తుకి ఎగిరిందే! దారాన్ని తెంపేస్తే ఇంకా ఎత్తుకు ఎగిరిపోతుంది కదా'' అన్నాడు.

తండ్రి నవ్వాడు. ''దారాన్ని తెంపేద్దామా మరి?'' అని అడిగాడు.

''తెంపేద్దాం నాన్నా..'' అన్నాడు కొడుకు ఎంతో ఉత్సాహంగా.

ఇద్దరూ కలిసి దారాన్ని తెంపేశారు.

'టప్'మని దారం తెగిపోగానే గాలిపటం ఇంకా పైకి ఎగిరిపోయింది. అంతలోనే దారి తప్పి అటూ ఇటూ కొట్టుకుంటూ కిందికి పడిపోవడం మొదలుపెట్టింది! చివరికి ఎవరి మేడ మీదనో కూలిపోయింది.

''ఇలా జరిగింది ఏంటి నాన్నా'' అన్నాడు కొడుకు విచారంగా.



ప్రతీకాత్మక చిత్రం : మలయాళ చిత్రం 'ఉదాహరణం సుజాత'లో మంజూ వారియర్

దారం తెంపేస్తే గాలిపటం ఇంకా ఇంకా పైకి పోతుందనుకుంటే, కిందికొచ్చి పడిపోవడం ఆ పిల్లాడికి నిరుత్సాహం కలిగించింది.

తండ్రివైపు బిక్కమొహం వేసుకుని చూశాడు.

కొడుకును దగ్గరికి తీసుకున్నాడు తండ్రి.


''గాలిపటానికి దారం ఉండేది, దానిని ఎగిరిపోనీయకుండా పట్టి ఉంచేందుకు కాదు. గాలి ఎక్కువైనా, తక్కువైనా గాలిపటం తట్టుకుని నిలబడి, ఇంకా ఇంకా పైపైకి ఎగిరేలా చేసేందుకే'' అని చెప్పాడు. మరో గాలిపటానికి దారం కట్టి ఎగరేసి కొడుకు చేతికి దారం అందించాడు.

జీవితంలో కూడా మనకు కొన్నిసార్లు అనిపిస్తుంటుంది. కుటుంబం అనే బంధం లేకపోయి ఉంటే మనం ఇంకా ఏదో సాధించి ఉండేవాళ్లం అని! నిజానికి కుటుంబం అందించిన ప్రేమ, సేవ, సౌకర్యాల వల్లనే మనం ఈ మాత్రమైనా నిలబడి ఉన్నామని గ్రహించాలి. కుటుంబం మనల్ని పట్టుకుని లేదు. పట్టుకుని ఉందనుకుని వదిలించుకునే ప్రయత్నం చేస్తే మనమే పట్టుతప్పిపోతాం. తెగిపోయిన గాలిపటంలా గింగిరాలు తిరుగుతూ ఎక్కడో పడిపోతాం.

– మాధవ్ శింగరాజు

సాక్షి ఫ్యామిలీ
సినిమా
వైఎస్ఆర్ జిల్లా
ఆదివారం
14-1-2018

లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ అన్న..! లాస్ట్ ఇయర్ నుంచి నేను ఒక అమ్మాయితో రిలేషన్‌షిప్‌లో ఉన్నా. చాలా ప్రేమించుకున్నాం. మొన్నటి దాకా బాగానే ఉండేది. కానీ, నెలరోజుల నుంచి నరకం చూపిస్తోంది. నేనంటే అస్సలు ఇష్టం లేనట్లు మాట్లాడుతోంది. అడిగితే ''నాకు ప్రైవేట్ స్పేస్ కావాలి'' అంటోంది. తన ఎక్స్ బాయ్‌ఫ్రెండ్‌తో మాట్లాడుతోందేమో నని డౌట్‌గా ఉంది. తనంటే పిచ్చి ప్రేమ అన్నా నాకు, వదులుకోలేకపోతున్నా. చచ్చి పోవాలనిపిస్తోంది. ప్లీజ్ తనని తిరిగి దక్కిం చుకోవడానికి ఏమైనా సజేషన్ ఇవ్వండి అన్నా ప్లీజ్.

\- సన్ని

సన్నీ డోంట్ బి ఫన్నీ..!
ప్రేమలో అవుతుంటాయి ఇవన్నీ..!
అడిగితే చెబుతాడు బన్ని...
పట్టించుకోకూడదు అన్నీ..!
వదిలెయ్యాలి కొన్ని..
ఆవేదనను చెయ్యాలి మిని..!
ఆనందాన్ని పిలవాలి రమ్మని..!
నిన్ను కోరి సినిమాలో నాని..
లాగా అయిపోవాలి సన్ని..!
బతకడానికి వెతుక్కోవాలి గని..!!
ఇక డిప్రెషన్ని పోనీ..
కొత్త ప్రేమను రానీ..
ఇవన్నీ చేయకు నేను చెప్పానని..
అలా అని చెబుతుంది నీలు పిన్నీ....!
'సార్ అన్యాయం సార్.. నా ఇమేజ్‌ని చెయ్యకండి ఖూని..!!'

ప్రేమ, ఆకర్షణ, టీనేజ్ అనుబంధాల్లోని అయోమయం మిమ్మల్ని గందరగోళపరుస్తుంటే ప్లీజ్ ఈ అడ్రస్‌కు మాత్రం అస్సలు రాయకండి.
లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. lovedoctorram@sakshi.com

కాయుకో సుడోకు

	5			6			8	
			1			9	2	5
		8	5	9		4		7
	7				4		9	3
			7	3	5			
5	3		8				4	
3		7		4	6	1		
1	8	2			7			
	6			8			7	

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

1	3	6	8	2	5	7	4	9
9	5	4	7	3	1	8	2	6
7	2	8	9	4	6	5	3	1
2	1	3	4	6	7	9	8	5
8	6	9	5	1	3	2	7	4
5	4	7	2	9	8	1	6	3
4	7	5	3	8	9	6	1	2
3	8	1	6	5	2	4	9	7
6	9	2	1	7	4	3	5	8

మహేశ్ మాంజా తయారు చేసేవాడు

\- మంజుల



భర్త సంజయ్, కుమార్తె జాన్వీ, హీరో సందీప్ కిషన్‌తో దర్శకురాలు మంజుల సంక్రాంతి సందడి

సూపర్ స్టార్ కృష్ణ కుమార్తె మంజుల దర్శకత్వం వహించిన తొలి చిత్రం 'మనసుకు నచ్చింది' త్వరలో విడుదల కానుంది. సందీప్ కిషన్, అమైరా దస్తూర్ జంటగా పి. కిరణ్, సంజయ్ స్వరూప్ నిర్మించారు. సంక్రాంతి సందర్భంగా మంజుల, సందీప్ పంచుకున్న విశేషాలు.

మీ చిన్నప్పటి సంక్రాంతిని గుర్తు చేసుకుంటారా?

మంజుల: మా అమ్మమ్మ భోగి రోజు పిల్లలందరికీ నూనె రాసి, స్నానం చేయించేది. పిండి వంటలు బాగా వండేవాళ్లు. ముఖ్యంగా గారెలు, పాయసం అయితే తెగ లాగించేవాళ్లం. తెల్లవారు జాము భోగి మంటలు వేసేవాళ్లం. సంక్రాంతి పండగ విశేషం గురించి అప్పట్లో ఏమీ తెలియకపోయినా ఆ సెలబ్రేషన్ చాలా బాగా అనిపించేది.

మీ నాన్న సొంతూరు బుర్రిపాలెంలో సంక్రాంతి సెలబ్రేట్ చేసుకున్న సందర్భాలేమైనా?

మా చిన్నప్పుడు కంటిన్యూస్‌గా మూడు సంవత్సరాలు సంక్రాంతి పండగకి బుర్రిపాలెం వెళ్లాం. అక్కడ మా నాన్నమ్మ బాగా సెలబ్రేట్ చేసేది. విలేజ్‌లో పండగలంటే ఓ సెపరేట్ కళ ఉంటుంది. పెద్ద పెద్ద ముగ్గులు, గొబ్బెమ్మలు, హరిదాసులు... చాలా సందడిగా ఉంటుంది. ఇప్పుడు లేదని కాదు.. ఇప్పుడూ మా ఇంట్లో ఫెస్టివల్స్ బాగానే జరుపుకుంటాం. ఈ టైమ్‌లో పెద్ద పెద్ద ముగ్గులు వేయిస్తాను. నేను డైలీ పూజ చేస్తాను. పండగ రోజు ఇంకొంచెం ఎక్కువసేపు చేస్తుంటాను. సంక్రాంతి రోజు ముఖ్యంగా వినాయకుడు, శివుడికి పూజ చేస్తాను.

చిన్నప్పుడు మీ బ్రదర్స్ (అన్నయ్య రమేశ్‌బాబు, తమ్ముడు మహేశ్‌బాబు)తో కలసి గాలిపటాలు ఎగరేసేవారా?

మేం ముగ్గురు సిస్టర్స్ చూడటంవరకే. రమేశ్ అన్నయ్య, మహేశ్‌కి గాలిపటాలంటే పిచ్చి. సంక్రాంతి టైమ్ అంటే చాలు.. రోజూ గాలిపటాలు ఎగరేయాల్సిందే. ఇద్దరూ ఇంట్లోనే 'మాంజా' తయారు చేసేవాళ్లు. పోటీలు పడి ఎగరేసేవాళ్లు. నాన్న చూస్తూ కూర్చునేవారు.

ఇప్పుడు మీ భర్త, పాప (సంజయ్, జాన్వీ) కైట్స్ ఎగరేస్తారా?

లాస్ట్ ఇయర్ ట్రై చేశారు. ఇద్దరికీ కుదరలేదు (నవ్వుతూ). బేసిక్‌గా సంజయ్‌కి గాలిపటాలు ఎగరేయడం తెలీదు. ఈసారి అయినా కుదురుతుందో లేదో చూడాలి.

సంక్రాంతి షాపింగ్ కంప్లీట్ అయిందా?

'మనసుకు నచ్చింది' సినిమా డైరెక్షన్ చేస్తున్న విషయం మీకు తెలుసు. షూటింగ్ అయింది. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్‌తో ఫుల్ బిజీ. అయినా పండగ రోజు కొత్త బట్టలు వేసుకుంటేనే బాగుంటుంది. మా అమ్మాయి వెస్టర్న్ డ్రెస్సులకు అలవాటుపడింది. పండగల సమయంలో అయినా ట్రెడిషనల్ వేర్ అయితే బాగుంటుంది కదా. అందుకే తనకు అలాంటి డ్రెస్ తీసుకున్నా.

మామూలుగా పండగలకి మీ బ్రదర్స్, సిస్టర్స్ కలుస్తుంటారా?

ప్లాన్ చేసుకుని కలిసింది లేదు. అయితే ఇకనుంచి ప్లాన్ చేయాలని ఉంది. మిగతా రోజుల్లో ఎవరి పనులతో వాళ్లం బిజీగా ఉన్నా పండగలకి మాత్రం అందరం ఒకచోట కలిస్తే బాగుంటుందని ఈ ఏడాదే అనిపించింది. అమ్మానాన్న, బ్రదర్స్, సిస్టర్స్ ఫ్యామిలీస్‌ని కలిసేలా నేనే ఇకనుంచి ప్లాన్ చేయాలనుకుంటున్నా.

ఈ ఇయర్ డైరెక్టర్‌గా మీ పేరుని స్క్రీన్ మీద చూడబోతున్నారు. ఎలా ఉంది?

డైరెక్షన్ అనేది పెద్ద బాధ్యత. బాగానే చేశాననే నమ్మకం ఉంది. దర్శకురాలిగా నాకు మొదటి సినిమా, నటిగా మా అమ్మాయికి ఇది మొదటి సినిమా. మంచి క్యారెక్టర్ చేసింది. నాకు నచ్చిన కథతో, నాకు నచ్చినట్లుగా పూర్తి సంతృప్తితో చేసిన సినిమా ఇది. డైరెక్షన్ చేస్తానన్నప్పుడు నాన్నగారు చాలా ఎంకరేజ్ చేశారు. త్వరలో రిలీజ్ అనుకుంటున్నాం. పండగ రోజు కూడా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ చేద్దామనుకున్నా కానీ, అందరూ సెలవు తీసుకుంటామన్నారు. అందుకని నేనూ రిలాక్స్ అవుతున్నా (నవ్వుతూ).

ఫైనల్లీ సంక్రాంతి స్పెషల్ ఏంటి?

పర్సనల్‌గా ఫుల్ సెలబ్రేషన్. ప్రొఫెషనల్‌గా డైరెక్టర్‌గా ఇంట్రడ్యూస్ కాబోతున్నాను. దేవుడు ఇచ్చిన మంచి గిఫ్ట్‌లా భావిస్తున్నాను. మంచి లవ్‌స్టోరీతో 'మనసుకు నచ్చింది' తీశాను. సక్సెస్ అవుతుందనే నమ్మకం ఉంది.

అమ్మమ్మతో కలసి గాలిపటాలు ఎగరేసేవాణ్ణి

\- సందీప్ కిషన్

చిన్నప్పుడు సంక్రాంతి పండగ అంటే సినిమాలు చూస్తూ గడిపేసేవాణ్ణి. పండగకి రిలీజయ్యే సినిమాలన్నీ చూడాల్సిందే. అవి పూర్తయ్యాక టీవీల్లో వచ్చే స్పెషల్ షోస్, సినిమాలు చూస్తూ కూర్చునేవాణ్ణి. ఏదైనా సినిమా చుట్టూనే. గాలిపటాలూ ఎగరేసేవాణ్ణి. అది కూడా మా అమ్మమ్మతో. మేడ మీదకు నాతో పాటు వచ్చి తను కూడా సరదాగా ఎగరేసేది. పెద్దయ్యాక ఫ్రెండ్స్ పెరిగాక వాళ్లతో కైట్స్ ఎగరేయడం అలవాటైంది. సంక్రాంతి అంటే నాకు సికింద్రాబాద్ గుర్తొస్తుంది. నా ఫ్రెండ్స్ అందరూ అక్కడే ఉన్నారు. ఎక్కువమంది మార్వాడీ స్నేహితులే. మనలానే వాళ్లు కూడా సంక్రాంతి బాగా సెలబ్రేట్ చేస్తారు. ఫెస్టివల్ టైమ్‌లో మేమంతా కలుస్తాం" అంటున్న సందీప్‌తో "కోడి పందాలు ఎప్పుడైనా చూశారా?" అనడిగితే – "లేదు. కానీ, 'గుండెల్లో గోదారి' సినిమా కోసం చూశాను. ఆ సినిమా షూటింగ్ రాజమండ్రిలో చేశాం. కోడి పందాల సీన్ ఉంది. అంతకుముందు ఎప్పుడూ చూడలేదు కాబట్టి, డైరెక్ట్‌గా కోడి పందాలు చూశాను" అన్నారు. "ఈ సంవత్సరం ఎక్కువ సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాను. అలాగే, మంజులగారి డైరెక్షన్‌లో చేసిన 'మనసుకు నచ్చింది' రిలీజ్‌కి రెడీ అవుతోంది. నేను చేసిన ఫస్ట్ ప్యూర్ లవ్‌స్టోరీ ఇది. ఇంకా ఈ సంవత్సరం మంచి మంచి పాత్రలు చేస్తున్నాను" అని సందీప్ కిషన్ అన్నారు.



సందీప్ కిషన్



'జయం' రవి, నివేతా పేతురాజ్ నటించిన చిత్రం 'టిక్.. టిక్. టిక్'. ఈ నెల 26న విడుదల కానున్న ఈ సినిమాను తెలుగులో కూడా విడుదల చేయాలనుకుంటున్నారు. మూవీ ప్రమోషన్‌లో భాగంగా సంక్రాంతి సెలబ్రేషన్స్ చేశారు 'జయం' రవి, నివేతా, సంగీత దర్శకుడు ఇమ్మాన్ తదితరులు.

లాస్ట్ ఇయర్ సంక్రాంతి... ఈ ఇయర్ పొంగల్

\- షాలినీ పాండే

సంక్రాంతి మెమరీస్ పెద్దగా లేవు. ఎందుకంటే మేం పెద్దగా సెలబ్రేట్ చేసుకోం. ఇక్కడికొచ్చాకే (హైదరాబాద్) సంక్రాంతి గురించి తెలిసింది. 'అర్జున్ రెడ్డి' చేస్తున్నప్పుడు సంక్రాంతి ఎలా సెలబ్రేట్ చేసుకుంటారో చూశాను. చక్కెర పొంగలి చాలా టేస్టీగా అనిపించింది. ఫెస్టివల్ టైమ్‌లో ఎక్కడ చూసినా గాలిపటాలే. ఇంత బాగా ఎగరేస్తారని నాకు తెలీదు. లాస్ట్ ఇయర్ తెలుగు సినిమా చేస్తే.. ఈ ఇయర్ తమిళ సినిమా '100% కాదల్' (తెలుగు '100% లవ్) రీమేక్) షూటింగ్‌లో ఉన్నాను. ఈ సెట్స్‌లో పొంగల్ (సంక్రాంతి) సెలబ్రేట్ చేసుకున్నాం. ఆ విధంగా తమిళనాడులో ఎలా పండగ చేస్తారో తెలిసింది. నేను ఆర్టిస్ట్ అవ్వడంవల్లనే అన్ని సంప్రదాయాలు తెలుసుకోగలుగుతున్నాను. ఇక్కడి అమ్మాయిని అనే ఫీల్ కలుగుతోంది. మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన నన్ను ఇక్కడివారు తమ అమ్మాయిలా ఆదరిస్తున్నారు. అందుకు ధన్యవాదాలు. అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు.



షాలినీ పాండే

పసందుగా పండగ




మంచు లక్ష్మీప్రసన్న

ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని, విద్యార్థులతో సంక్రాంతి సంబరాలను తన నివాసంలో జరుపుకున్నారు నటి, నిర్మాత మంచు లక్ష్మీప్రసన్న. టీచ్ ఫర్ చేంజ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జంట నగరాల్లోని 38 ప్రభుత్వ పాఠశాలల నుంచి సుమారు 50 మంది విద్యార్థులు మంచు లక్ష్మి నివాసానికి చేరుకుని, సందడి చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, టీచ్ ఫర్ చేంజ్ వాలంటీర్లకు సంక్రాంతి విందు భోజనాన్ని వడ్డించారు మంచు లక్ష్మి. ''ప్రతి ఏడాది ఫైవ్‌స్టార్ హోటల్‌కు విద్యార్థులను తీసుకెళ్లి సంక్రాంతి వేడుకలను జరుపుకునే వాళ్లం. కానీ ఈ ఏడాది సంక్రాంతిని మా ఇంట్లోనే చేసుకోవడం చాలా ఆనందంగా ఉంది'' అన్నారు లక్ష్మీప్రసన్న. కుమార్తె విద్యా నిర్వాణతో కలసి పిల్లలందరితో లక్ష్మీప్రసన్న సెల్ఫీ దిగారు.

ముగ్గు-ముచ్చట

గుమ్మడికాయల ముగ్గు
19 చుక్కలు
19 వరుసలు




మద్దుల పద్మావతి
కొత్తపేట, తెనాలి





సుభాషిణి
సైదాబాద్,
బ్రాహ్మణపల్లి

27 చుక్కల నుండి 1 చుక్క వచ్చే వరకు చుక్కలు చూసి పెట్టుకోవాలి.




కింది నుండి 27 చుక్కలు – 7 వరుసలు. అటు సగం ఇటు సగం వదిలి 11 వరుసలు 6 చుక్కలు మరల 27 చుక్కలు 6 వరుసలు 1 వచ్చేవరకు (సరి చూక్క)



పీతల గౌతమి
విజయనగరం



క్రాంతిమయ పర్వదినమే సంక్రాంతి



తెలుగు సంస్కృతి వివిధ రూపాల్లో ప్రత్యక్షమయ్యే గొప్ప క్రాంతిమయ పర్వదినం సంక్రాంతి. తెలుగువారు ఉత్సాహంగా, ఉల్లాసంగా, సరస విన్యాసాలతో జరుపుకొనే సజీవ చైతన్యమే ఈ సంక్రాంతి. మన కుటుంబ సభ్యుల మధ్య ఏవైనా పొర పొచ్చాలు, భేదాభిప్రాయాలు ఉంటే అవి తొలగిపోయి అందరూ కలిసి మెలిసి జరుపుకునే పర్వదినాలే పండగలు. 'సంక్రాంతి' అనడం లో ''సం'' అంటే మిక్కిలి ''క్రాంతి'' అంటే అభ్యుదయం. మంచి అభ్యుదయాన్ని ఇచ్చే క్రాంతి కనుక దీనిని 'సంక్రాంతి' గా పెద్దలు వివరణ చెబుతూ ఉంటారు. అన్నదాతలు సంవత్సరమంతా కష్టపడి చేసిన వ్యవసాయ ఫలితం ధాన్యలక్ష్మి రూపంలో ఇళ్ళకు చేరి, తద్వారా ధనలక్ష్మి నట్టింట కొలువుదీరే పండుగ మన సంక్రాంతి పండుగ. ఆనందాన్ని మనసునిండా నింపుకొని, అనురాగ బంధాల మధ్య ఎంతో శ్రద్ధగా ఈ పండుగ జరుపుకొంటారు. 'సంక్రాంతి' లేదా 'సంక్రమణం' అంటే చేరటం అని అర్థం. సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించే కాలమే మకర సంక్రమణం. మకర సంక్రమణం నుండి ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభం అవుతుంది. శారీరక పరిశ్రమకు, పూజలకు, సాధనలకు, కృషికి అనువైన, ఆవశ్యకత ఉన్న కాలం ఉత్తరాయణం. మానసికమైన అర్చనకు, ధ్యానానికీ, యోగానికీ, దీక్షలకు, బ్రహ్మచర్యానికి, నియమ నిష్ఠలకు అనువైన, ఆవశ్యకత ఉన్న కాలం దక్షిణాయణం. పన్నెండు నెలలలో ఆరు నెలల దక్షిణాయణం దేవతలకు ఒక రాత్రి, ఆరు నెలల ఉత్తరాయణం దేవతలకు ఒక పగలు. కనుక దేవతలు మేలుకుని ఉండే కాలం ఉత్తరాయణ పుణ్యకాలం. అందువల్ల ఉత్తరాయణ పుణ్యకాలంలో మరణించిన వారు స్వర్గానికి వెళ్తారని నమ్మకం. సంక్రాంతితో ఉత్తరాయణం మొదలవుతుంది. అంతటి మహత్తరమైన పర్వదినం మకర సంక్రాంతి లేక పెద్ద పండుగ. ఈ పండగను భారతదేశంలో మన తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్ , తెలంగాణాలలోనే కాక, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ, ఒడిషా, పంజాబ్, గుజరాత్ మొదలగు రాష్ట్రాలలో కూడా పాటిస్తారు. మనకు వచ్చే పండుగలలో సంక్రాంతి మాత్రమే సౌర గమనాన్ని అనుసరించి పాటించే పండుగ.

మనం సంక్రాంతి అని పిల్చుకుంటే మహారాష్ట్రీయులు, గుజరాతీలు మకర సంక్రాంతి అంటారు. తమిళులు పొంగల్ అని పిలిస్తే పంజాబీలు లోరీ అంటారు. ఉత్తరాయణంలో సూర్యుని గమనం ఉత్తర ముఖంగా మారడంతో పగటికాలం క్రమంగా పెరుగుతూ వస్తుంది. సూర్యరశ్మి క్రిమి సంహారిణి. అది అందరికీ ఆరోగ్యాన్ని కలిగిస్తుంది. అయితే సూర్యుని కిరణాలు ఎక్కువగా సోకినా మంచిదికాదు. ఎందుకంటే సూర్యరశ్మిలోని అతి నీలలోహిత కిరణాలు చర్మ వ్యాధులను, చర్మ సంబంధ క్యాన్సర్‌ను ఇతర రుగ్మతలను కలిగిస్తాయి.

తెలుగువారికి అత్యంత ప్రియమైన పండుగలు వరుసగా వచ్చే కాలం ఇదే! ముఖ్యంగా మధ్య దినమైన రోజును 'సంక్రాంతి' అని పిలుచుకుంటాం. పుష్యమాసంలో వచ్చే ఈ పండుగ పౌష్యలక్ష్మితో కళకళలాడే గృహ ప్రాంగణాలతో, ఒక కొత్త శోభతో వెలుగుతూ ఉంటుంది. పుష్యం అంటేనే పోషణ శక్తి గలదని అర్థం. స్నానం దానం, పూజ అనే మూడు విధులు ఈ దినాలలో నిర్వర్తించాలి. సూర్యుడు హిందువులకు ప్రత్యక్ష దైవం. కాలచక్రానికి అనుగుణంగా సంచరిస్తూ ఉండే దేవతా స్వరూపం. ఉత్తరాయణంలో సూర్యుడు ధనుర్రాశి నుంచి మకర రాశి లోకి రావడమే మకర సంక్రమణం. అదే మకర సంక్రాంతి. సూర్యోదయానికి ముందే నువ్వులపిండితో శరీరానికి నలుగు పెట్టి తలంటి స్నానం చేయాలి. జాతకంలో శని వల్లే కష్టాలు కలుగుతాయి. ఆయనను శాంతింప చేయాలంటే నువ్వులు దానమివ్వాలి. వాతావరణ పరంగా చూస్తే మంచు కురిసే హేమంత ఋతువు, శీతకాల బాధలు నివారించుకోవడానికి స్నానజలంలో నువ్వులు కలపడం, నువ్వులు తినడం, తిలలతో దైవ పూజ అనేవి ఆచరించే విధులు. ఆయుర్వేద పరంగా చూస్తే చలికాలంలో శరీరానికి నువ్వులు మంచి చేస్తాయి.

సంక్రాంతి రోజున పాలు పొంగించి మిఠాయిలు తయారు చేస్తారు. అరిసెలు, బొబ్బట్లు, జంతికలు, చక్కినాలు, పాలతాలకలు, సేమియా పాయసం, పరమాన్నం, పులిహోర, గారెలు మొదలయి న వంటకాలు చేసి, కొత్తబట్టలు ధరించి ఈ పండుగను జరుపుకుంటారు. ఈ రోజున పితృదేవతలకు తర్పణాలు వదలడం ఆచారం.

మహిళలు ఎంతో అందంగా రంగవల్లులు తీర్చిదిద్దే రోజు సంక్రాంతి. దానికి ఆరోగ్య రీత్యా, ఖగోళ శాస్త్ర రీత్యా ఎంతో ప్రాముఖ్యం ఉందని పెద్దలు చెప్తారు. రాళ్ళూ రప్పలూ లేకుండా ఒక పద్ధతిలో అలకబడిన నేల, మేఘాలు లేని ఆకాశానికి సంకేతంగా భావిస్తే, ఒక పద్ధతిలో పెట్టే చుక్కలు రాత్రి వేళ కనిపించే నక్షత్రాలకు సంకేతం గా చెప్తారు. చుక్కల చుట్టూ తిరుగుతూ చుక్కలను గళ్ళలో ఇమిడ్చే ముగ్గు ఖగోళంలో ఎప్పుడికప్పుడు కనిపించే మార్పులకు సంకేతం. ఎంత పెద్దదైనా చిన్నదైనా ముగ్గు మధ్య గడిలో పెట్టే చుక్క సూర్యుని స్థానానికి సంకేతం. ఇంకొక దృక్పథంలో గీతలు స్థితిశక్తికి (స్టాటిక్ ఫోర్స్) చుక్కలు గతిశక్తి (డైనమిక్ ఫోర్స్) కు సంకేతాలనీ.. శ్రీచక్ర సమర్పణా ప్రతీకలని శక్తి తత్త్వవేత్తలు అంటారు. మన నేటి మహిళ లు కాంక్రీట్ జంగిల్స్‌లో నివసిస్తూ రంగవల్లుల సంస్కృతిని మరచిపోకుండా రంగవల్లుల పోటీలు నిర్వహిస్తూ ఉంటారు.

సంక్రాంతి నాడు దేవతలకూ, పితృ దేవతలకూ ఏయే పదార్థాలను దానం చేస్తామో అవి అత్యధికంగా జన్మజన్మలకి సిద్ధిస్తాయని నమ్మకం. మగపిల్లలు పతంగులు (గాలి పటాలు) ఎగురవేసి ఆనందిస్తారు. ఇంటి ఆచారం ప్రకారం స్త్రీలు సావిత్రీ వ్రతం లాంటి నోములను నోచుకుంటారు. దీనివల్ల కుటుంబ సౌఖ్యం, అన్యోన్య దాంపత్యం, సౌభాగ్యం సిద్ధిస్తుందని విశ్వాసం. ఇరుగు పొరుగులను పిలిచి పండు తాంబూలాలను, నువ్వుండలను ఇచ్చి పెద్దల దగ్గర ఆశీర్వాదాలను తీసుకొంటారు. కొందరు సంక్రాంతి నాడు రాముని పూజచేస్తారు. రాముని లాగా ధర్మమార్గంలో నడవడానికి శక్తి కలగాలని రామాయణాన్నీ పఠిస్తారు.

బలిచక్రవర్తికి ఉన్న త్యాగగుణం అలవడాలన్న కోరికతో వామన పురాణాన్ని కూడా వింటారు. తెలంగాణ అంతా నువ్వుల ఉండలను చేసి ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకుంటారు. ఇవే కాక ఈరోజున కూష్మాండం, కంబళి, ధాన్యాదులు, లోహాలు, తిలలు, వస్త్రాలు, తైలదీప దానాలు చేస్తే మంచిదని శాస్త్ర వచనం. బూడిద గుమ్మడి కాయను దానంచేసిన వారికి భూదానం చేసిన ఫలం వస్తుంది. పెరుగును దానం చేయడం వల్ల అనారోగ్య బాధలు తీరుతాయి. బుద్ధి వికాసం కలుగుతుంది. సంక్రాంతికి కొన్ని ప్రాంతాలలో బొమ్మల కొలువును తీర్చి పేరంటాలూ చేస్తారు.

ఇళ్ళలో బొమ్మల కొలువులు, చిన్న పిల్లలకి భోగి పళ్ళు దిష్టి తీయడం వంటి ఆచారాలు సంబరాన్ని తెస్తాయి. పన్నెండు సంవత్సరాలు బాలునిగా, వీర పద్మాసన భంగిమలో కూర్చుని, కుడిచేతిని చిన్ముద్రగా చేసుకుని ఆ కొండమీద వెలిసిన హరిహర పుత్రుడు స్వామి అయ్యప్పను ఉద్దేశించి దీక్షాధారణ చేసిన అయ్యప్పలందరూ శబరిమలై చేరి మకరవిళక్కును నిర్వర్తించి మకరజ్యోతి దర్శనం చేసుకోవడం సంక్రాంతి పండుగ ప్రత్యేకత.

ఇన్ని ప్రత్యేకతలకు, ఇంత విశిష్టతకు కారణం సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించడమే కాబట్టి, ఆయనకు కృతజ్ఞతా సూచకంగా సంక్రాంతినాడు సూర్యభగవానుడిని పూజిస్తారు. శ్రద్ధాభక్తులతో ఆదిత్యహృదయాన్ని పారాయణ చేస్తారు.

- డి.వి.ఆర్. భాస్కర్

పాశుర ప్రభాతం

30వ పాశురం

వంగుక్కడల్ కడైంద మాదవనై కేశవనై,
తింగళ్ తిరుముగత్తు చ్చేయిళైయార్ శెన్ఱిఱైంజి,
అంగుప్పఱై కొండ వాత్తై అణిపుదువై
పైంగమల తణ్ తెరియల్ పట్టర్ పిరాన్ కోదై శొన్న,
శంగు త్తమిళ్‌మాలై ముప్పదుం తప్పామే
ఇంగు ఇప్పరిశురైప్పార్ ఈరిరండు మాల్వరైత్తోళ్,
శెంగణ్ తిరుముగత్తు చ్చెల్వ త్తిరుమాలాల్,
ఎంగుం తిరువరుళ్ పెత్తు ఇంబురువ రెమ్బావాయ్.



భావం: ఓడలతో నిండిన పాల సముద్రమును చిలికి లక్ష్మీదేవిని పొందినట్టి మాధవుడికి, బ్రహ్మదేవుడికి, పరమశివునికి కూడా కొండంత అండగా నిలిచే శ్రీమన్నారాయణునికి పూర్ణచంద్రుని పోలినట్టి అందమైన ముఖమును కలిగిన చక్కని ఆభరణాలను ధరించిన గోపికలు మంగళం పాడుచున్నారు. పర అను వాద్యమును పొందే సాకుతో ధనుర్మాస వ్రతమును కొనసాగించి, భగవంతుని ఆంతరంగిక సేవను చేయగల అర్హతను గోపికలు సంపాదించుకొనిరి. ఒక ఆభరణం వలె ప్రకాశించే శ్రీవిల్లిపుత్తూర్ అనే క్షేత్రంలో ఎల్లప్పుడూ తామరపూసలను మెడలో ధరించియుండే శ్రీవిష్ణుచిత్తుల పుత్రికగా జన్మించిన గోదాదేవి తమిళభాషలో ముప్పది పాటల మాలికగా తిరుప్పావై ప్రబంధాన్ని రచించినది. ఎవరైతే ఈ ముప్పది పాశురాలను ప్రతిరోజు తప్పక చదువునట్టివారు గోపికలు, గోదాదేవి అనువారు పొందినట్టి ఫలితాన్ని కూడా పొందుతారు. కేవలం తిరుప్పావై గ్రంథాన్ని చదివినంత మాత్రముననే పద్మములవంటి నేత్రాలు కలిగి, పర్వతశిఖరాల వంటి భుజములు కలిగిన శ్రీవల్లభుడు, చతుర్భుజుడు అయిన శ్రీ శ్రీమన్నారాయణుడు సకల జనులకు సమస్త శుభాలను, ఆనందాన్ని అనుగ్రహించును.

- ఎస్. శ్రీప్రియ

ధర్మజిజ్ఞాస

ఆలయంలో దేవునికి ఎదురుగా నిలబడకూడదా?



ఆ ప్రాణప్రతిష్ఠ చేసే క్రమంలో ఎన్నో శక్తుల్ని స్వామి ప్రతిమలోకి ఆహ్వానిస్తారు. ఆ శక్తిని మనం తట్టుకోలేం. కనుక ఎదురుగా నిలబడకూడదన్న నియమం ఏర్పడింది. దేవాలయంలో అద్వితీయమైన శక్తి ఉంటుంది. ప్రధానంగా మూలవిరాట్‌ను ప్రతిష్ఠించే సమయంలో వేదమంత్రాలను పఠిస్తారు. గర్భగుడిలో మహాశక్తులను నిక్షిప్తం చేస్తారు. మందిరంలో యంత్రబలంతో పాటు మంత్రబలం ఉంటాయి. పరమేశ్వరుడు, కాళీమాత ఆలయాల్లో ఇంకా జాగ్రత్తగా ఉండాలని పురాణగ్రంథాలు వెల్లడిస్తున్నాయి. ఇంకా కొన్ని ఆలయాల్లో సూర్యకిరణాలు నేరుగా గర్భగుడిలోకి ప్రవేశిస్తాయి. మనం అడ్డంగా నిలిస్తే కిరణాలు మూలవిరాట్ దగ్గరకు వెళ్లలేవు. అంతేకాదు, స్వామివారికి ఎదురుగా ఉండే ఆయన వాహనానికి మధ్యలో కూడా నిలబడకూడదు. ఒకపక్కగా నిలబడి నమస్కరించుకోవాలి.

సంప్రదాయ సంబరం

మన సంప్రదాయంలో ప్రతి ఆచారం, సంప్రదాయం వెనుక భౌతికం, మానసికం, ఆధ్యాత్మికం అనే మూడు ప్రయోజనాలు ఇమిడి ఉన్నాయి. సంక్రాంతి అంటే పిండివంటలు చేసుకోవడం, దేవాలయాలకు వెళ్లి దండం పెట్టుకోవడమే కాదు. మన పెద్దలు అనుసరించే సంప్రదాయాల వెనకున్న మర్మం ఏమిటి? వాటి నుంచి మనమేం నేర్చుకోవాలి? వాటిని శాస్త్రీయంగా ఎలా అర్థం చేసుకోవాలి- అనేది తెలుసుకోవడం అవసరం.



ఓర్పును నేర్పే ముగ్గులు

ఇంటి ముందు లోగిళ్లలో ఒక పెద్ద రథం ముగ్గో, నక్షత్రం ముగ్గో వేస్తే చాలు. గంటసేపు వ్యాయామం చేసిన శ్రమకు సమానం. ముగ్గు వేయడం అంటే.. బోలెడన్ని చుక్కలు పెట్టాలి. వాటన్నిటినీ కలుపుతూ గీతలు గీయాలి. ఒక ఆకారాన్ని తీసుకురావాలి. ఆ క్రమంలో లెక్కపెట్టుకోలేనన్ని సార్లు కదలాల్సి వస్తుంది. పొట్టచెంగును సరి చేసుకుంటూ, జడను వెనక్కు వేసుకుంటూనే ముగ్గు మీద బోలెడంత ఏకాగ్రతను సంధించాలి. ముగ్గు ఇంటికి అలంకరణే కాదు. మనసుకు, శరీరానికి ఓర్పును, నేర్పును అందించే సమస్యాపూరణం లాంటిది. ముగ్గులు మనకో తాత్విక దృక్పథాన్ని తెలియజేస్తాయి.



గంగిరెద్దులు.. హరిదాసులు... భిక్షానికీ ఓ ధర్మం..

గంగిరెద్దుల వాడైనా, హరిదాసైనా ఏదో ఒక మంచి విషయాన్ని చెప్పే బిచ్చమెత్తుకుంటారు. గంగిరెద్దుల వాడైతే ఇల్లు కలవాళ్లు ఏదిచ్చినా గంగిరెద్దు మీదే వేస్తాడు తప్ప చేతికి తీసుకోడు. పాత చీరలిస్తే వాటినే తీసుకుంటారు. హరిదాసు కూడా ఏడాదికి ఒకసారే వచ్చి హరినామ సంకీర్తనలు పాడి.. గిన్నెడు బియ్యం తీసుకుని సంతృప్తిగా ఇంటికెళ్లిపోతాడు. పండగ పోయాక మళ్లీ ఏ వీధిలోనూ కనిపించడు. హరిదాసు ఇంటి ముందుకొచ్చి గొబ్బెమ్మల్ని తొక్కి వెళితే మంచిది అని చెబుతారు పెద్దలు.



అసహ్యం నుంచి అద్భుతాల గొబ్బెమ్మ

కృష్ణ భక్తురాలైన గోపెమ్మ అనే పేరు నుంచి పుట్టిందే గొబ్బెమ్మ. ఈ భూమ్మీదున్న దేన్నీ అసహ్యించుకోకూడదు. ప్రతిదీ ప్రకృతి ప్రసాదితం. అసహ్యమైన పేడను కూడా అద్భుతంగా మలిస్తే అది గొబ్బెమ్మ అవుతుంది. జీవి కడుపులో ఉన్నంత కాలం పవిత్రమైనది. తల్లి కడుపు దాటి నేల మీద పడగానే అపవిత్రమైపోతుంది. అందుకే, నేల మీద పడని ఆవు పేడతోనే గొబ్బెమ్మలను చేస్తారు.



జీవితం దారం వంటిదని చెప్పే పతంగం

మనిషికి ఆత్మనిగ్రహం లేకపోతే జీవితంలో ఎన్నో సమస్యల్ని కొని తెచ్చుకోవాల్సి వస్తుంది. సన్నని దారంతో ఆకాశంలో ఎగిరే గాలిపటాన్ని అదుపులో పెట్టగలిగినట్లు.. మనల్ని మనం అదుపులో పెట్టుకోవాలని చెబుతుంది గాలిపటం. లాగితే తెగిపోతుంది. వదలకుంటే ఎగరలేదు. రెండింటినీ సమన్వయం చేసుకుంటూ ఆడిస్తేనే గాలిపటమైనా, జీవితమైనా! చేతిలో దారం ఉంది కదా అని ఎంత దూరమైనా గాలిపటాన్ని వదల్లేము. చుట్టచుట్టి గుప్పెట్లోకి తీసుకోవాల్సిందే. మనం ఎంత ఎత్తుకు ఎగిరినా భగవంతుని చేతిలోనే ఉన్నామన్నదిని మరచిపోలేదని చెప్పడానికే గాలిపటాలు ఎగురవేస్తారు.

కోడిపందేలు యుద్ధనీతిని గెలిపించే పందెం

పండగ పరమార్థాన్ని మరిచిపోయి దాన్ని పరిహసించగా మార్చాం. నేడు జరుగుతున్న కోడిపందేలే అందుకు నిదర్శనం. కోడిపందేలకు తరాల చరిత్ర ఉంది. కాని ఆ రోజుల్లో కోళ్లకు కత్తులు కట్టి ఆనందించేవారు కాదు. ఇప్పుడు కత్తులు కట్టి, డబ్బు కట్టలు పెట్టి జూదంగా మార్చేశారు. పాతరోజుల్లో ఇద్దరి మధ్య వైరం ఏర్పడితే దాన్ని కోడిపందెం ద్వారా పరిష్కరించేవారు మధ్యవర్తులు. పల్నాటి కాలంలో మాచర్ల, గురజాల మధ్య గొడవ యుద్ధానికి దారితీసింది. అలాంటి సమస్యను కోడిపందెమే పరిష్కరించింది. యుద్ధనీతిని తెలియజేసింది.



పశు పూజలు... శ్రమకు కృతజ్ఞత చెల్లింపులు

సంక్రాంతికి ఇంటినిండా ధాన్యం వచ్చిందంటే.. అది పశువుల పుణ్యం. ఏడాది పొడవునా పశువులతో చాకిరీ చేయించడమే కాదు. పండగరోజైనా వాటిని పూజించి కృతజ్ఞత చెప్పుకోవాలంటుంది పశువుల పూజ. ఆ రోజు రైతులు నాగలి కట్టరు. ఎద్దుల మీద కాడి మోపరు. బండ్లు తోలరు. అందుకే 'కనుమ రోజు కాకైనా కదలదు' అంటారు. కనుమును పశువుల పండుగ అంటారు. ఈ రోజున పితృదేవతలకు తర్పణాలు వదులుతారు.



సువార్త

ఆచరణలో కనిపించేదే అసలు విశ్వాసం!!



'కనిపించడు కాని మా వాడు భలే భక్తిపరుడు తెలుసా?' లాంటి వ్యాఖ్యలు వినిపిస్తుంటాయి. పైకి పొంగిపోతున్నట్టుండే భక్తితో సమస్యలేమో కాని, నిజమైన భక్తి విశ్వాసికి జీవితంలో కనిపించి తీరాలి. బబులోను చెరలో మగ్గుతున్నా తమ దేవుణ్ణి, దేవుని విధి విధానాలను మర్చిపోలేని భక్తి యూదులది, ముఖ్యంగా దానియేలు, అతని ముగ్గురు స్నేహితులది. వారి అచంచలమైన భక్తిశ్రద్ధలు చూసి అసూయపడ్డ శత్రువులు ఎలాగైనా వారిని నాశనం చేయడానికి కుట్రపన్నారు. యూదులు పరలోకమందున్న దేవునికి తప్ప మరొకరికి సాగిలపడరు. అందువల్ల బబులోను సామ్రాజ్యంలోని ప్రజలు, ప్రముఖులెవరూ ముప్పైరోజులపాటు చక్రవర్తి దర్యావేషుకు తప్ప మరే వ్యక్తికైనా సాగిలపడరాదని, విన్నపాలు సమర్పించరాదని ఒక శాసనం చేశాడు. ఎంతో తెలివైనవాడిగా ప్రసిద్ధి పొందిన దానియేలును అప్పటికే చక్రవర్తి తన సంస్థానంలో అత్యున్నత స్థానంలో నియమించాడు. అదీ వారి అసూయకు ప్రధాన కారణం. ఇలాంటి శాసనం గురించి తెలిసి కూడా దానియేలు రోజుకు మూడుసార్లు యథాప్రకారం దేవుని ప్రార్థించాడు. శాసనోల్లంఘనకుగాను రాజుగారికిష్టం లేకున్నా శిక్షగా దానియేలును సింహాలున్న గుహలో పడదోశారు. కాని దానియేలును దేవుడు సింహాల గుహలో కూడా క్షేమంగా కాపాడుతాడని నమ్మకమున్న చక్రవర్తి మరునాడే అక్కడికెళ్లి 'నిత్యమూ నీవు సేవిస్తున్న జీవము కలిగిన నీ దేవుడు నిన్ను రక్షించాడా?' అని అడిగితే, 'అవును రాజా: నన్ను రక్షించాడని దానియేలు జవాబిచ్చాడు. చక్రవర్తి వెంటనే అతన్ని బయటకి రప్పించి, అతని మీద కుట్ర చేసిన వారందరినీ సింహాల గుహలో వేశాడు.

మేము రహస్య విశ్వాలసుమంటారు కొందరు. 'రహస్యభక్తి' అనేది క్రైస్తవమే కాదు. క్రైస్తవ సుగుణమైన సాహసం, క్షమాపణ, ప్రేమ, పేదలు నిరాశ్రయుల పక్షంగా పోరాడేందుకు తెగింపు సమాజానికి వారి జీవితాల్లో కొట్టవచ్చినట్లు కనిపించాలి. ఉద్యమాలు, విప్లవాలు క్రైస్తవ విధానం కాదు. కాని దేవుని పక్షంగా నిరుపేదలు, నిర్భాగ్యుల కోసం నిలబడేందుకు విప్లవాలు తేవాల్సిన అవసరం లేదు. దాన్ని ప్రతి క్రైస్తవుడూ తన వ్యక్తిగత కుటుంబ బాధ్యతగా చేపట్టాలి. అలాంటి నిస్వార్థసేవే క్రైస్తవాన్ని ఒక విశిష్టమైన జీవన విధానంగా తీర్చిదిద్దింది. నిస్వార్థమైన త్యాగపూరితమైన సేవ క్రైస్తవానికి పర్యాయపదంగా నిలబెట్టింది.


- రెవ.డా.టి.ఎ.ప్రభుకిరణ్

దేవదేవుడయినా గురువుకి శిష్యుడే!



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

కృష్ణ భగవానుడిది పరిపూర్ణావతారం. ఆయనే జగద్గురువు. కానీ ఈ లోకంలోకి వచ్చిన తరువాత గురువయిన సాందీపని మహర్షికి ఎంత సేవ చేసాడో! ఆ సేవకుమెచ్చి గురువులు కూడా అలాగే అనుగ్రహించేసారు. ఒకరోజు సమిధలు తేవడానికి అరణ్యానికి వెళ్ళారు శ్రీ కృష్ణుడు, కుచేలుడు. కొద్దిసేపటికి మబ్బులు పట్టి హోరున వాన, చీకటి.. అరణ్యంలో దారితప్పి తెల్లవారేసరికి తిరిగొచ్చారు. ఈలోగా వారు రాలేదన్న బెంగతో సాందీపని మహర్షి వాళ్ళ పేర్లుపెట్టి పెద్దగా అరుస్తూ వెతికాడు ఆ రాత్రంతా. వారు ఎదురు పడగానే గట్టిగా కావలించుకుని ''ఓ కృష్ణా! ఓ కుచేలా! ఇకపై మీకు విశేషమైన ఐశ్వర్యం, జ్ఞానంతోపాటూ బంధుమిత్ర బలగాలు అన్నీ విశేషంగా సమకూరుతాయి'' అని ఆశీర్వదించేసాడు ఆ ఆనందంలో. గురువు ప్రేమైక హృదయుడు. దాచుకోవడం గురువుకి తెలియదు. తాను కష్టపడి నేర్చుకున్నది మొత్తం ఇచ్చేస్తాడు. అంతేకాదు, గురువు వినయ సంపన్నుడు. ఉపనిషత్తులో ఒక కథ ఉంది. సుకేశుడని ఒక మహర్షి. ఆయన దగ్గరకు ఒక రాకుమారుడు వెళ్ళాడు. ''చంద్రకళలు, షోడశకళలు ఏవి? వాటి విశేషం గురించి తెలుసుకోవాలని ఉంది, చెప్పండి'' అని అడిగాడు. ''అయ్యో నాకు తెలియదే, మరొకర్ని అడగండి'' అన్నాడు. చెప్పలేక పోయినవాడు సుకేశుడనే గురువయితే, అడిగిన రాకుమారుడు సిగ్గుపడి తలొంచుకుని వెళ్ళిపోయాడు. ఇదేమిటి? అంటే...ఆయన ఎన్నో శాస్త్రాలు చదువుకున్నాడు, కష్టపడి ఎంతో మంది శిష్యులకు చెబుతున్నాడు. ఆయనకి తెలియని ఏదో ఒక చిన్న విషయం ఉంటే నేనది అడిగి ఆ మహానుభావుడి నోటితో తెలియదనిపించానే, ఇటువంటి ప్రశ్న అడిగి ఆయన్ని ఇబ్బందిపెట్టానే...అని క్షోభిస్తూ వెళ్ళాడు యోగ్యుడైన ఆ శిష్యుడు.



శిష్యుడు గురువుగారి కీర్తిప్రతిష్ఠలు నిలబెట్టడానికి ఎప్పుడూ ప్రయత్నిస్తూంటాడు. పెద్దవాళ్ళయిన తరువాత కుచేలుడు, శ్రీకృష్ణుడు ఒకసారి కలుసుకున్నప్పుడు పాతజ్ఞాపకాలు నెమరువేసుకునే క్రమంలో కృష్ణుడు మొదటగా ప్రస్తావించిన అంశం – ''ఓయ్, కుచేలా! నీకు గుర్తున్నారు కదా మనకు పాఠం చెప్పిన ఆ గురువుగారంటూ... మన సాందీపని గురువుగారు ఎంత గొప్పవాడయ్యా, అజ్ఞానమన్న చీకటికి దీపమయ్యా ఆయన. ఎంత మహానుభావుడో.. అవ్యయమైన బ్రహ్మాన్ని లోపల తాను అనుభవించి ఎప్పుడూ సత్కర్మలు చేస్తూ పండిత శ్రేష్ఠులచేత ప్రశంసలనందుకొన్నవాడయ్యా... అటువంటి గురువు లభించడం.. అక్కడ మనం చదువుకోవడం ఎంత అదృష్టమయ్యా..'' అంటాడు.

రుక్మిణీ కళ్యాణంలో... అగ్నిద్యోతనుడు రుక్మిణికి గురువు, కాబట్టి కృష్ణుడికీ గురువే. ఆయనను రమ్మని పిలుస్తూ 'ఆలస్యం చేస్తావేం..ఆవిడ రాసిన పత్రిక చదివావుగా, లే, లేచిరా, పెళ్ళవుతుందా, అని సందేహిస్తున్నావా. తప్పకుండా అవుతుంది. ఉపాధ్యాయులం, గురువులమయిన మేం ఆశీర్వదిస్తున్నాం. కళ్యాణమస్తు.'' గురుభక్తి ఎలా ఉండాలో చిన్న పద్యాల్లో పోతన గారు అద్భుతంగా ఆవిష్కరించేసారు.

శిష్యుడి ప్రథమ కర్తవ్యం–గురువుగారి గౌరవాన్ని నిలబెట్టడం. గురువు పేరెత్తితే చాలు పరబ్రహ్మం, పరిపూర్ణావతారం కూడా తలవంచేసింది. అంతే. అదీ ఆచార్యదేవోభవ అంటే.

సాక్షి ఫ్యామిలీ
సినిమా
వైఎస్ఆర్ జిల్లా
ఆదివారం
14-1-2018



● పాలక్, రంజిత్, చిరంజీవి, త్రికోటి, భరత్ సోమి, సురేష్

అన్నదమ్ముల అనుబంధానికి ఈ సినిమా ప్రతీక – చిరంజీవి

''సాధారణంగా యాక్టర్ కాబోయి డాక్టర్ అయ్యాడనే మాటలను వింటుంటాం. కానీ తమ్ముడు రంజిత్ కోసం డాక్టర్ భరత్ ప్రొడ్యూసర్ అయ్యాడు. ఈ విధంగా అన్నదమ్ముల అనుబంధానికి ప్రతీకగా ఈ సినిమా నిలబడింది'' అన్నారు చిరంజీవి. రంజిత్, పాలక్ లల్వానీ జంటగా 'దిక్కులు చూడకు రామయ్య' ఫేమ్ త్రికోటి పేట దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'జువ్వ'. ఎస్వీ రమణ సమర్పణలో సొమ్మి ఫిలింస్ పతాకంపై డాక్టర్ భరత్ సోమి నిర్మించారు. ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్ అండ్ టీజర్‌ను చిరంజీవి విడుదల చేశారు. ఇంకా ఆయన మాట్లాడుతూ– ''భరత్, రంజిత్‌ల నాన్నగారితో నాకు మంచి పరిచయం ఉంది. టీజర్‌లో రంజిత్ డైనమిక్‌గా, హుషారుగా కనిపిస్తున్నాడు. రంజిత్‌ది పక్కా మాస్ క్యారెక్టర్ అని అర్థం అవుతోంది. పాలక్ లల్వానీ రొమాంటిక్‌గా, అందంగా కనిపించింది. రాజమౌళి శిష్యుడు త్రికోటి దర్శకత్వం వహించిన ఈ జువ్వ సినిమాను ఈ అన్నదమ్ముల కోసం తప్పకుండా చూస్తా. త్రికోటి మరో హిట్ అందుకోవాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ''ఫస్ట్ లుక్ పోస్టర్, టీజర్‌ను రిలీజ్ చేసిన చిరంజీవిగారికి థ్యాంక్స్. గతేడాదే మా సినిమా పూర్తయింది. ఈ నెల చివర్లో ఆడియోను, వచ్చే నెలలో సినిమాను రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నాం'' అన్నారు భరత్. ''చిరంజీవిగారి చేతుల మీదగా ఈ కార్యక్రమం జరగడం ఆనందంగా ఉంది. ప్రేమకథా చిత్రమిది. థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ప్రేక్షకులకు నచ్చుతాయన్న నమ్మకం ఉంది'' అన్నారు త్రికోటి. ''చిరంజీవిగారు నా రోల్ మోడల్ అండ్ ఇన్‌స్పైరింగ్. నేను హీరోగా పరిచయం అవుతున్న ఈ సినిమా టీజర్‌ను ఆయన రిలీజ్ చేయడం ఆనందంగా ఉంది. నేనెప్పుడైనా లోన్లీగా ఉన్నప్పుడు చిరంజీవి గారి పాటలే వింటాను'' అన్నారు రంజిత్.




● శ్రియ

మిస్ ఇన్నోసెంట్!

చిన్న ఉద్యోగం చేసుకుంటూ లైఫ్‌ని లీడ్ చేస్తుంది ఓ అమాయకురాలైన అమ్మాయి. చెప్పుకోవాల్సినంత బాధలు, గుర్తుపెట్టుకోవాల్సినన్ని బాధ్యతలు తనకు లేవు. ఒక్క మాటలో చెప్పాలంటే.. హ్యాపీ లైఫ్ అన్నమాట. కానీ ఎప్పుడూ ఒకేలా ఉంటే అది జీవితం ఎందుకు అవుతుంది. సడన్‌గా ఓ ఇన్సిడెంట్. లైఫ్ అంతా టోటల్ చేంజ్. ఏంటా ఇన్సిండెట్? దాని వల్ల ఆ అమ్మాయి జీవితంలో వచ్చిన మార్పులేంటి? అంటే ప్రజెంట్ సస్పెన్స్. ఆ అమాయకురాలి పాత్రలో నటిస్తున్నారు శ్రియ. సుజన దర్శకురాలిగా పరిచయమవుతున్న ఈ లేడీ ఓరియంటెడ్ మూవీలో శ్రియ ముఖ్య తార. ఇళయరాజా సంగీతం అందించనున్న ఈ చిత్రం ద్వారా ఛాయాగ్రాహకుడు వీఎస్ జ్ఞానశేఖర్ నిర్మాతగా మారుతున్నారు. సాయిమాధవ్ బుర్రా మాటలు అందించనున్నారు. ''నటీనటుల ఎంపిక ఆల్మోస్ట్ కంప్లీట్ అయ్యింది. సెట్ డిజైన్ వర్క్స్ జరుగుతున్నాయి. మార్చి ఫస్ట్ వీక్‌లో షూటింగ్ స్టార్ట్ చేయాలనుకుంటున్నాం'' అన్నారు సుజన.

● జ్ఞానశేఖర్, ఇళయరాజా, సుజన





● టీయస్సార్, మోహన్‌బాబు, పరుచూరి గోపాలకృష్ణ

అందుకే మోహన్‌బాబు 'నట విశ్వ సార్వభౌమ' – టీయస్సార్

''నటుడిగా నేను 40 ఏళ్లు కంప్లీట్ చేసుకున్న సందర్భంగా నన్ను తెలుగు తెరకు పరిచయం చేసిన దాసరిగారి సమక్షంలో వైజాగ్‌లో ఫంక్షన్ చేశారు టీయస్సార్. కళాకారులను గౌరవించాలనే ఆలోచన రావడం మామూలు విషయం కాదు. ఈ ఆలోచన వచ్చిన వ్యక్తి నాకు తెలిసి తెలుగు రాష్ట్రాల్లో వన్ అండ్ వోన్లీ పర్సన్ టీయస్సార్. ఇది డబ్బుతో కూడుకున్న విషయం కాదు. మనసు ఉండాలి. అభినందనలు వేరు కానీ నాకు ఈ బిరుదు (విశ్వ నట సార్వభౌమ) ప్రదానం చేయటం ఇబ్బందిగా అనిపించింది. టీయస్సార్ నేను ఊళ్లో లేనప్పుడు ఈ నిర్ణయం తీసుకున్నారు. తర్వాత నీకీ బిరుదు ఇస్తున్నాం అంటే కాదన లేకపోయాను'' అన్నారు మంచు మోహన్‌బాబు. టి.సుబ్బిరామి రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్, విశాఖపట్టణం, బెంగళూర్, ముంబై, ఢిల్లీ.. ఇలా పలు ప్రాంతాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ 17న హైదరాబాద్‌లో 'కాకతీయ కళా వైభవ మహోత్సవం' నిర్వహించనున్నారు. ఈ విశేషాలు తెలియజేయడానికి ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో టీయస్సార్ మాట్లాడుతూ– ''దాదాపు 600 ఏళ్ల క్రితం ఓరుగల్లు ముఖ్య పట్టణంగా కాకతీయ రాజులు తెలుగు కళలను, నాగరికతను అద్భుతంగా ప్రోత్సహించారని ప్రసిద్ధి. వారి పాలన స్వర్ణ యుగం అని కవులు వర్ణించారు. ఆ తర్వాత శ్రీకృష్ణ దేవరాయలు కూడా ఎంతో ప్రోత్సహించారు. ఈసారి మేం టీయస్సార్ కాకతీయ లలిత కళా పరిషత్ ఏర్పాటు చేశాం. తెలంగాణ ముఖ్య ప్రాంతాలలో కాకతీయ కళా వైభవోత్సవాలు చేయాలి, తెలుగు ప్రజల్ని మరోసారి రంజింపజేయాలని నిశ్చయించుకున్నాం. ఇందులో భాగంగా ముందు హైదరాబాద్‌లో ఈ నెల 17న భారీ కార్యక్రమం ఏర్పాటు చేశాం. 42 ఏళ్లుగా ఏకధాటిగా నటిస్తూ, 560 సినిమాల్లో విభిన్న పాత్రలు చేసి, తనకంటూ ఓ స్థాయి క్రియేట్ చేసుకున్న మోహన్‌బాబుకు 'విశ్వ నట సార్వభౌమ' బిరుదును ప్రదానం చేయబోతున్నాం. ఆ రోజు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మహారాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్ రావుగారు వస్తున్నారు'' అన్నారు.

పరుచూరి గోపాలకృష్ణ మాట్లాడుతూ – ''సుబ్బిరామి రెడ్డిగారి ఇంటి పేరు 'టి' అని కాకుండా కళా అని పెట్టి ఉంటే బావుండేది. కళాకారులను సత్కరించి తాను సంతృప్తి పొందుతుంటాడు. కాకతీయ శబ్దాన్ని కళా పరిషత్‌లోకి తీసుకొచ్చారు. ప్రజలకు ఏం కావాలో తెలుసుకొని చేసిన రాజ్యాధినేత రుద్రమదేవి. కాకతీయ ద్వారంలోనే కళ కనపడుతుంది. మోహన్‌బాబు తెర మీద కనపడగానే ఈలలు కొడతారు. ఆయన మమల్ని ఆప్యాయంగా అగ్రజా అని పిలుస్తుంటారు. ఆయనకు సన్మానం జరుగుతుంది అంటే మాకు జరిగినట్టే. ఆ బిరుదుకు మోహన్‌బాబు అర్హుడు'' అన్నారు. రాజేంద్రప్రసాద్, విష్ణు, మనోజ్, పోసాని కృష్ణమురళి, అలీ, జయప్రద, జయసుధ, లక్ష్మీప్రసన్న, శ్రియ తదితర సినీరంగ ప్రముఖులు, మధుసూధనాచారి, కె. స్వామిగౌడ్‌తో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు ఈ వేడుకలో పాల్గొననున్నారు.



● అనుష్క

స్వీట్ షాక్

హోమ్ నుంచి స్ట్రైట్ షూటింగ్ స్పాట్‌కు చేరుకున్నారు హీరోయిన్ అనుష్క. 'భాగమతి' లొకేషన్‌కి అయితే కాదు. అంటే.. హీరోయిన్‌గా ఏదైనా కొత్త సినిమా స్టార్ట్ చేశారా? అంటే అదీ కాదు. పోనీ ఏదైనా సినిమాలో గెస్ట్ రోల్ చేస్తున్నారా? అంటే.. కానే కాదు. మరి ఏ సినిమా షూటింగ్‌కి వెళ్లారు స్వీటీ (అనుష్క) అంటే.. 'సాహో' సెట్స్‌కి. 'రన్ రాజా రన్' ఫేమ్ సుజీత్ దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా రూపొందుతున్న సినిమా 'సాహో'. నీల్‌నితిన్ ముఖేష్, అరుణ్ విజయ్, జాకీ ష్రాఫ్, మందిరా బేడీ, మురళీ శర్మ కీలక పాత్రలు చేస్తున్న ఈ సినిమా షూటింగ్ శుక్రవారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో జరిగిందని సమాచారం. ఈ లొకేషన్‌కి వెళ్లి, స్వీటీ స్వీట్ షాకిచ్చారు. అందరితో సరదాగా కబుర్లు చెప్పారు. ఇన్‌సెట్‌లో పిక్ చూస్తున్నారుగా. ఈ ఫొటోను యాక్టర్ మురళీ శర్మ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఇలా 'సోహో' సెట్‌లోకి 'భాగమతి' ఎంట్రీ ఇచ్చారు. 'పిల్ల జమిందార్' ఫేమ్ అశోక్ దర్శకత్వంలో అనుష్క లీడ్ రోల్‌లో యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, ప్రమోద్‌లు నిర్మించిన 'భాగమతి' చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది.



● మురళీ శర్మ, అనుష్క, సుజిత్, మది

త్రినేత్ర 116

అడవి శేష్, శోభితా ధూళిపాళ జంటగా శశి కిరణ్ తిక్క దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'గూఢచారి'. 'క్షణం, అమీ తుమీ' వంటి విజయవంతమైన చిత్రాల తర్వాత అడవి శేష్ చేస్తున్న చిత్రం ఇది. సంక్రాంతి సందర్భంగా ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. తల చుట్టూ మెషిన్ గన్స్, త్రినేత్ర 116 అనే క్యాప్షన్‌తో ఉన్న ఫస్ట్ లుక్‌ని చూస్తే ఉత్కంఠ రేపే స్పై థ్రిల్లర్‌లా సినిమా ఉంటుందేమో అనిపిస్తోంది కదూ. ఏజెంట్ రవి పట్నాయక్ పాత్రలో అడవి శేష్ కనిపించనున్నారు. ఈ సినిమాకు అడవి శేషే కథను అందించారు. అభిషేక్ పిక్చర్స్, విస్టా డ్రీమ్ మెర్చంట్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం వేసవికి విడుదల కానుంది.



● అడవి శేష్







